PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 45 సంచిక : 35 | విజయవాడ, శుక్రవారం 5 సెప్టెంబర్ 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Friday 5 September 2025 | Rs

యూరియా కొరతపై ఆందోళనలు

- రైతు సేవా కేంద్రాల వద్ద పడిగాపులు

3

కదం తొక్కిన హాకీ ఆటగాళ్లు

- నిర్ణయాత్మక మ్యాచ్‌లో మలేషియాపై గెలుపు
- కొరియాపై చైనా విజయం
- ఆసియాకప్ సూపర్-4

8

ప్రైవేట్‌కు ఆరోగ్యశ్రీ

- బీమా కంపెనీలకు అప్పగింత
- పిపిపి విధానంలో మెడికల్ కాలేజీలు
- మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక పథకం ఆరోగ్యశ్రీ (ఎన్‌టిఆర్ వైద్య సేవా ట్రస్ట్)ను ప్రైవేటు సంస్థలకు అపగించనున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సచివాలయంలో గురువారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ మేరకు నిర్ణయించారు. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను విలేకరులకు వివరించిన సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి ఈ విషయం తెలిపారు. ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ పథకాలను కలిపి హైబ్రీడ్ మోడ్‌లో యూనివర్శల్ హెల్త్ పాలసీని రూపొందించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ మేరకు వైద్య ఆరోగ్య,కుటుంబ సంక్షేమశాఖ ఇచ్చిన ప్రతిపాదనను కేబినెట్ ఆమోదించినట్లు తెలిపారు. దారిద్ర్య రేఖకు దిగువున ఉన్న కుటుంబాలకుబీమా కంపెనీ ద్వారా కుటుంబానికి ఏడాదికి రూ.2.5లక్షల వరకు, ట్రస్టు ద్వారా రూ.25 లక్షల వరకు కవరేజ్ ఉంటుందని అన్నారు. దారిద్ర్య రేఖకు ఎగువున ఉన్న కుటుంబాలకు ఏడాదికి రూ.2 నుంచి 5లక్షల వరకు బీమా కవరేజ్‌ను అందిస్తామని పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా 3257 రకాల వైద్య సేవలు అందజేయడం జరుగుతుందని చెప్పారు. ప్రతి పేషంట్‌కు ఒక క్యూఆర్ కోడ్‌ను ఇచ్చి ఈ పథకం అమలు తీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ ట్రస్టు ఆధ్వర్యంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. ఇహెచ్‌ఎస్ పరిధిలోకి వచ్చే ఉద్యోగులు మినహా మిగిలిన వారికి ఈ పథకం వర్తించేలా నిబంధనలు రూపొందించినట్లు తెలిపారు. రాష్ట్రంలో 10 కొత్త వైద్య కళాశాలలను పిపిపి పద్ధతిలో నిర్వహించేందుకు ఆమోదం తెలిపామని పేర్కొన్నారు. రెండు దశల్లో వీటిని అభివృద్ధి చేస్తామని, తొలి దశలో ఆదోని, మార్కాపురం, మదనపల్లి, పులివెందుల కళాశాలలు ఉన్నాయని తెలిపారు. ఈ 10 వైద్య కళాశాలల్లో 2027-28 విద్యాసంవత్సరం నుంచి అడ్మిషన్లు జరిగే విధంగా నిర్మాణాలు పూర్తిచేస్తామన్నారు. సిఆర్‌డిఎ(సీడ్ క్యాపిటల్ మినహా), స్థానిక సంస్థల పరిధిలో ఈ ఏడాది ఆగస్టు 31 నాటికి అనధికారికంగా నిర్మించిన భవనాలు, నిబంధనలు ఉల్లఘించిన నిర్మాణాలను జరిమానా విధించి క్రమబద్ధీకరించేందుకు ఆమోదం తెలిపామన్నారు. . రాష్ట్రంలో 59,375 అనధికార నిర్మాణాలు, 49,936 డివియేషన్లు, 10,212 అదనపు అంతస్తులు ఉన్నట్లు గుర్తించామన్నారు. ఆగస్టు 28వ తేదిన జరిగన రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు(ఎస్ఐపిబి) సమావేశంలో చేసిన సిఫార్సుల ఆమోదం కోసం పరిశ్రమలు, వాణిజ్య శాఖ చేసిన పలు ప్రతిపాదనలను అంగీకరించామన్నారు.

మంత్రివర్గ సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

పిఎస్‌పిలకు నీటి కేటాయింపు

అల్లూరి సీతారామ రాజు జిల్లా గుజ్జిలి పంప్డ్‌స్టోరేజ్ పవర్(పిఎస్‌పి) ప్రాజెక్టు 1500 నుంచి 2400 మెగావాట్ల సామర్థ్యానికి పెంచేందుకు అనుమతి ఇచ్చామన్నారు. జలవనరుల శాఖ మార్గదర్శకాలు, లభ్యతకు అనుగుణంగా ఈ ప్రాజెక్టు వార్షిక ఎవాపరేషన్ నష్టాలను పూడ్చుకునేందుకు చంపావతి నది నుంచి వన్‌టైమ్ ఫిల్లింగ్‌కు 0.98 మిలియన్ క్యూబిక్ మీటర్స్(ఎంసిఎం) చొప్పున 18 ఎంసిఎం కేటాయింపులకు ఆమోదం తెలిపామని చెప్పారు. కడపజిల్లా కొండాపురం మండలంలో చింత గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ ద్వారా కొప్పోలు పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్రాజెక్టు 360 నుంచి 2400 మెగావాట్లకు పెంచేందుకు ఆమోదించామన్నారు. ఈ ప్రాజెక్టుకు గండికోట రిజర్వరాయర్‌ను లోయర్ రిజర్వాయర్‌గా ఉపయోగించడంతో పాటు వన్‌టైమ్ ఫిల్లింగ్‌కు, వార్షిక ఎవాపరేషన్ నష్టాలకు సంబంధించి 2.79 ఎంసిఎం చొప్పున 38 ఎంసిఎం నీళ్ల కేటాయించేందుకు ఆమోదం తెలిపామన్నారు.

భూముల కేటాయింపు

చిత్తూరు జిల్లాలో మదర్ డైరీ ఫ్రూట్ అండ్ వెజిటేబుల్ ప్రైవేట్ లిమిటేడ్‌కు 73.62 ఎకరాలు కేటాయింపు. వరహా ఆక్వాఫార్మ్ కంపెనీకి 93 ఎకరాలు, చిత్తూరు జిల్లాలో ఎఎల్ఇఎపి మిగతా 7లో

పోలవరం నిర్వాసితుల, గిరిజనుల సమస్యలు పరిష్కరించాలని గవర్నర్‌కు వినతిపత్రం అందజేస్తున్న వి శ్రీనివాసరావు, కె లోకనాథం, కిల్లో సురేంద్ర, కెఎస్ లక్ష్మణరావు, నాగమణి తదితరులు (వార్త 2లో)

కూటమి ఎమ్మెల్యేల అరాచకం

అత్యధిక మంది వసూల్ రాజాలయ్యారు

- ఈ రోజుల్లో ఫ్యాక్షనిజం చెల్లదు
- వి.శ్రీనివాసరావు విమర్శ
- గిరిజన హక్కులు కాలరాస్తున్నారు : కిల్లో సురేంద్ర

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో అత్యధిక మంది కూటమి ఎమ్మెల్యేలు వసూల్ రాజాలుగా మారి అరాచకం చేస్తున్నారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు అన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కిల్లో సురేంద్రతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వారు కార్పొరేట్ కంపెనీలకు ఏజెంట్లుగా మా, ప్రజలను బెదిరిస్తూ కాలం చెల్లిన ఫ్యాక్షన్ భాష వాడుతున్నారని విమర్శించారు. గొంతులు కోసే ఫ్యాక్షన్ భావజాలాన్ని ఎవరూ సహించరని అన్నారు. ప్రజాప్రతినిధులుగా ప్రజా సంక్షేమం కోసం పనిచేయాల్సిన ఎమ్మెల్యేలు వారిని బెదిరించి దోచుకుంటున్నారని తెలిపారు. సుగాలి ప్రీతి తల్లి గురించి జనసేన నాయకులు అన్యాయంగా మాట్లాడుతున్నారని, 2017లో ఈ ఘటన జరిగిన సమయంలో పవన్‌కల్యాణ్ గొంతుచించుకుని ప్రచారం చేశారని, ఇప్పుడు మౌనంగా ఉండటం తగునా అని అడిగారు. సిబిఐకి కేసు అప్పగించామని చేతులు దులుపుకుంటున్నారని, రాష్ట్ర పరిధిలో ఉన్న సిఐడిని గత ప్రభుత్వం లాగానే రాజకీయ నేతలను వేధించేందుకు వాడుకుంటున్నారన్నారు. మహిళల గురించి తప్పుగా మాట్లాడే ఎంఎల్‌ఎలపై ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేసినందువల్ల ప్రయోజనం లేదని వెంటనే చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

యూరియాను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారు

రాష్ట్రంలో యూరియా కృత్రిమ కొరత సృష్టించి బ్లాక్ మార్కెట్‌కు తరలించి రైతులను ఇబ్బంది పెడుతున్నారని శ్రీనివాసరావు చెప్పారు. అధికారులు, అధికార పార్టీ నాయకులు దీనికి బాధ్యత వహించాలన్నారు. బ్లాక్‌మార్కెట్‌ను నివారించి కేంద్రం నుండి తెప్పించి రైతు సేవా కేంద్రాల ద్వారా పంపిణీ చేయాలని కోరారు. అలాగే స్టీలు ప్లాంటు విషయంలో అధికార కూటమి నాయకులు ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం కాదని, ప్రైవేటీకరణ ఆపాలని డిమాండ్ చేశారు. ఆ పనిచేయకుండా కార్మిక సంఘాల నాయకులపై అపవాదులు మోపడం దుర్మార్గమని, నిజంగా అక్రమాలు మిగతా 7లో

ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ, ప్రైవేటు ఉపాధ్యాయులు, అధ్యాపకులకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో పనిచేస్తున్న లక్షలాది మంది ఉపాధ్యాయులు జాతిభవిష్యత్‌ను తీర్చిదిద్దుతున్నారని అన్నారు. అయితే వారిపై రాజకీయ పెత్తనం పెరిగిందని, అకడమిక్ పనికూడా చేయనీ యడం లేదని తెలిపారు. విద్యావ్యవస్థ ఆపదలో పడిందని పేర్కొన్నారు. ఉపాధ్యా యులకు అకడమిక్ స్వేచ్ఛ ఇవ్వాలని కోరారు. కేంద్రంలో బిజెపి శాస్త్రీయ విద్యావిధానం స్థానంలో మతోన్మాదాన్ని పెంచే సిలబస్ తీసుకొచ్చి భవిష్యత్ తరాలను పాడుచేస్తోందని మండిపడ్డారు. 156 క్యూబిట్ సామర్థ్యంతో కంప్యూటర్లు తయారు చేస్తుంటే మనదేశం పురాణాల పేరుతో వెనక్కు పోతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రభాకరరెడ్డిని బెదిరించిన ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలి

గుత్తి దగ్గర కార్పొరేట్లకు అప్పనంగా కట్టబెడుతున్న భూములు చూసేందుకు వెళ్లిన రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకరరెడ్డిని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ఫోన్‌లో అసహ్యంగా, అవమానకరంగా మాట్లాడారని, కార్పొరేట్ ఏజెంటుగా మారి రైతుల్ని దోపిడీ చేస్తున్నారని అన్నారు. ఫ్యాక్షనిజాన్ని మరలా ముందుకు తెచ్చి ప్రజల్ని అణచివేస్తామంటే సహించే రోజులు పోయాయన్నారు. ఆయనపై ముఖ్యమంత్రి వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అటవీ అధికారులపై దాడి చేశారని, అనంతపురం ఎమ్మెల్యే ప్రసాదు జూనియర్ ఎన్‌టిఆర్ తల్లిని కించపరిచారని ఇలాంటి వ్యక్తులు ప్రజలకు ఏమి న్యాయం చేస్తారని ప్రశ్నించారు. చంద్రబాబు, లోకేష్ పేర్లు చెప్పి అక్రమ వసూళ్లకు దిగుతుంటే వారిపై చర్యలు తీసుకోకపోవడం ఏమిటో అర్థం కావడం లేదన్నారు. ఇలాంటి వారిపై ముఖ్యమంత్రి చర్యలు తీసుకోకపోతే ఇలాగే ఉంటే ప్రజలు తిరగబడే రోజు అతిత్వరలోనే వస్తుందని హెచ్చరించారు.

160 మందికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు

- నేడు ముఖ్యమంత్రి చేతుల మీదుగా అందజేత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా 160 మందిని రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా రాష్ట్రప్రభుత్వం ఎంపిక చేసింది. పాఠశాల విద్యలో 78 మందిని, ఇంటర్మీడియట్ విద్యలో 26 మందిని, డిగ్రీ విద్యలో 18 మందిని, యూనివర్సిటీల నుంచి 32 మందిని, ఇంజనీరింగ్, ఫార్మా కళాశాలల నుంచి ఆరుగురిని ఎంపిక చేశారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను పాఠశాల, ఉన్నత విద్యాశాఖల కార్యదర్శి కోన శశిధర్ గురువారం విడుదల చేశారు. మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి, ఉపాధ్యాయ దినోత్సవం కార్యక్రమం శుక్రవారం విజయవాడలోని ఎ కన్వెన్షన్ సెంటర్‌లో జరగనుంది. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అవార్డులను అందజేయనున్నారు.

అభివృద్ధి పేరుతో పర్యావరణం ధ్వంసం చేయొద్దు

- ప్రకృతి విలయాలపై సుప్రీంకోర్టు ఆందోళన
- కేంద్రానికి, రాష్ట్రాలకు నోటీసులు

న్యూఢిల్లీ : అడవుల నరికివేతపై సుప్రీంకోర్టు గురువారం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. చెట్ల నరికివేత ఇలాగే కొనసాగితే.. మనకు అడవులు లేకుండా పోతాయని వ్యాఖ్యానించింది. అభివృద్ధి అవసరమే కానీ పర్యావరణం, ప్రాణాలను పణంగా పెట్టడం సరికాదు " భారత ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయ్ వ్యాఖ్యానించారు. ఈ అంశంపై జోక్యం చేసుకోవాలని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను ఆదేశించింది. పర్యావరణ హననంపై తమ వైఖరి తెలియజేయాలంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు, భారత జాతీయ రహదారి అథారిటీ (ఎన్‌హెచ్ఎఐ)కి నోటీసులు జారీ చేసింది. పదేపదే మెరుపు వరదలు, హిమాలయాల్లో అక్రమంగా నరికివేయబడిన చెట్ల దుంగలు నదుల్లో ప్రవహించడాన్ని ప్రస్తావిస్తూ కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. ఇటీవల వరద నీటిలో భారీ సంఖ్యలో చెట్ల దుంగలు కొట్టుకువెళుతున్న దృశ్యాలు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారిన సంగతి తెలిసిందే. ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్, జమ్ముకాశ్మీర్, పంజాబ్ రాష్ట్రాల్లో మెరుపు వరదల గురించి కోర్టు తీవ్ర విచారం వ్యక్తం చేసింది. పర్యావరణ పరంగా సున్నితమైన హిమాలయాల్లో అడవులను నరికివేయడంతో పదే పదే ప్రకృతి విపత్తులు, మరణాలు సంభవిస్తున్నాయని పేర్కొంది.

"ఇది చాలా తీవ్రమైన సమస్య. వరదనీటిలో దుంగలు కొట్టుకువెళుతున్నట్టు కనిపిస్తోంది. ఇది ఇలాగే కొనసాగితే మనకు అడవులు కనిపించవు. పంజాబ్‌లో మొత్తం గ్రామాలు మునిగిపోయాయి. వరదల సమయంలో చండీగఢ్ , మనాలి మధ్య ఉన్న 14 సొరంగాలు మరణ ఉచ్చులుగా మారనున్నాయని పిటిషనర్ అనామిక రాణా తరపున న్యాయవాది ఆకాష్ వశిష్ట పేర్కొన్నారు. ఇటీవల వరదల సమయంలో సొరంగం లోపల 300మంది చిక్కుకుపోయారని అన్నారు.

ఒరిస్సాలో గోగూండాల దాష్టీకం

- దళితుడి హత్య
- మరొకరికి తీవ్రగాయాలు

భువనేశ్వర్ : ఒరిస్సాలో గోగూండాలు రెచ్చిపోయారు. ఆవును చంపాడన్న నెపంతో 35 ఏళ్ల దళితుడిని దారుణంగా కొట్టి చంపారు. దేవగఢ్ జిల్లా రియామల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కుండేజురి గ్రామంలో బుధవారం ఘటన జరిగింది. మృతుడ్ని కిషోర్ చమర్‌గా గుర్తించారు. దేవ్‌గఢ్ ఎస్‌పి అనిల్‌కుమార్ మిశ్రా, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..కౌన్సిదీప గ్రామానికి చెందిన వీరిద్దరూ చర్మకారులు. కుండేజురి సమీపంలోని అటవీ ప్రాంతంలో అనారోగ్యం కారణంగా చనిపోయిన పశువుల కళేబరం నుంచి చర్మాన్ని సేకరిస్తుండగా..కొందరు గోగూండాలు దాడికి పాల్పడ్డారు.ఆ పశువును తాము చంపలేదని చర్మకారులు ఇరువురు ప్రాధేయపడినా గోగూండాలు చితకబాదడంతో కిషోర్ అక్కడికక్కడే చనిపోయారు. తీవ్రంగా గాయపడిన గౌతమ్ నాయక్ గోగూండాల చెర నుంచి తప్పించుకొని గ్రామస్థులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు ఆరుగురు గోగూండాలను అదుపులోకి తీసుకున్నారు.

ప్రయివేట్ సోలార్ కంపెనీలతో కేంద్రం కుమ్మక్కు

- కేంద్ర ప్రభుత్వ మాజీ కార్యదర్శి ఇఎఎస్ శర్మ ఆందోళన
- కార్పొరేట్ లాభాలకు ప్రభుత్వ డిస్కమ్‌లను పణంగా పెట్టొద్దు
- కేంద్ర కేబినెట్ కార్యదర్శి సోమనాథన్‌కు లేఖ

విశాఖపట్నం : వినియోగదారులను దోచుకునేందుకు ప్రయివేటు సౌర విద్యుత్ కంపెనీలతో కేంద్ర ప్రభుత్వం కుమ్మక్కవుతోందా అని కేంద్ర ప్రభుత్వ మాజీ కార్యదర్శి ఇఎఎస్ శర్మ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంలో పన్ను చెల్లించేవారిని, వినియోగదారులను, రాష్ట్రాల డిస్కామ్‌లను పణంగా పెట్టి లాభాలు ఆర్జించడమే లక్ష్యంగా కేంద్రం వ్యవహరిస్తున్నట్లు కనిపిస్తోందని ఆయన వ్యాఖ్యానించారు. ఈ మేరకు కేంద్ర కేబినెట్ కార్యదర్శి టి.వి.సోమనాథన్‌కు గురువారం ఒక లేఖ రాశారు. కార్పొరేట్లకు చెందిన పెద్ద పెద్ద కేంద్రీకృత సోలార్ ప్లాంట్లను పెంచి పోషించాలని కేంద్రం ఉద్దేశ్యపూర్వకంగా వ్యవహరిస్తోందని, అదే సమయంలో చవకగా దొరికే వికేంద్రీకృత అప్షన్లను అంటే రూఫ్‌టాప్, సోలార్ పంప్స్ వంటి వాటిని నిర్లక్ష్యం చేస్తోందని శర్మ ఆ లేఖలో పేర్కొన్నారు. అదానీ, రిలయన్స్ వంటి బడా వ్యాపార సంస్థలు సున్నితమైన సరిహద్దు ప్రాంతాలకు సమీపంలో వేలాది హెక్టార్లలో మెగా సోలార్ పార్కులను ఏర్పాటు చేస్తున్నాయని, కార్పొరేట్ల పట్ల చూపే ఆశ్రిత పక్షపాతమే ఇందుకు ప్రధాన కారణమన్నారు. దీనివల్ల ప్రైవేటు సౌర విద్యుత్ వ్యయం అవసరమైన దానికన్నా చాలా అధికమై పోతోందన్నారు. పైగా సరిహద్దులకు సమీపంలో పెద్ద ప్రాజెక్టులు ఏర్పాటు వల్ల జాతీయ భద్రతా ఆందోళనలు కూడా వుంటాయన్నారు. ఒక విద్యుత వినియోగదారుడు లేదా రైతు తన ఆవరణలో పివి ప్యానెల్స్ పెట్టుకుని విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకోవచ్చుని, కానీ ఎన్‌డిఎ ప్రభుత్వం అనుసరించే విధానాల వల్ల ఎక్కడో సుదూర ప్రాంతాల్లో బడా కార్పొరేట్లు పెట్టిన పౌర విద్యుత్ సంస్థలనుండే విద్యుత్‌ను అధిక వ్యయంతో కొనుగోలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుం టోందని విమర్శించారు. ప్రైవేటు సౌర విద్యుత్ కంపెనీల్లో నిండిపోయిన ఇలాంటి విధాన పరమైన అసమానతలు, సబ్సిడీల దుర్వినియోగం, కార్పొరేట్లు లాభార్జనలపై స్వతంత్ర జ్యుడీషియల్ విచారణ జరగాలని ఆయన కోరారు. ఆయా శాఖల దర్యాప్తు సాగించేందుకు వీలుగా సెబి, సిబిఐ, ఇడిలకు కూడా ఆయన తన లేఖల కాపీలను పంపించారు. అప్పుడే ప్రజా ప్రయోజనాల కన్నా ప్రైవేటు కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలకే కేంద్రం, రాష్ట్రాలు ఎలా పెద్ద పీట వేస్తున్నాయో ప్రజలకు తెలుస్తుందని శర్మ ఆ లేఖలో పేర్కొన్నారు. పౌర సేవల అధిపతిగా ఈ విషయమై తక్షణమే జ్యుడీషియల్ విచారణకు చర్యలు తీసుకోవాల్సిందిగా ఆయన కోరారు.

'డల్లాస్'లో బాపట్ల వాసి మృతి

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

ఉన్నత చదువుల కోసం అమెరికాలోని డల్లాస్‌కి వెళ్లిన బాపట్ల జిల్లా మార్టూరు యువకుడు పాటిబండ్ల లోకేష్ (27) మరణించారు. స్నేహితులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం... ఇంకొల్లు మండలం భీమవరం గ్రామానికి చెందిన పాటిబండ్ల వేణుబాబు గ్రానైట్ వ్యాపారం నిమిత్తం మార్టూరు చౌదరి కాలనీలో నివాసం ఉంటున్నారు. ఆయన పెద్ద కుమారుడు లోకేష్ మూడేళ్లక్రితం అమెరికాలోని బోస్టన్‌లో ఎమ్మెస్ పూర్తి చేసుకుని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఇంజనీర్‌గా చేరారు. గురువారం ఉదయం తను ఉండే అపార్ట్‌మెంట్ పైన స్విమ్మింగ్ పూల్‌లో ఈతకు వెళ్లి, ఎంతకూ రాకపోవడంతో స్నేహితులు పైకి వెళ్లి చూశారు. స్విమ్మింగ్ పూల్‌లో నిర్జీవంగా పడి ఉన్న లోకేష్‌ని చూసి దిగ్భ్రాంతికి గురయ్యారు. మార్టూరులో ఉన్న కుటుంబ సభ్యులకు పోలీసులు సమాచారం ఇచ్చారు. సోమవారం మృతదేహం ఇండియాకు చేరుకునే అవకాశం ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు.

మణిపూర్‌లో తెరుచుకున్న జాతీయ రహదారి

- సాయుధ శిబిరాల తొలగింపునకు అంగీకారం
- కుకి-జో గ్రూపులతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఒప్పందం

తెరుచుకున్న రెండో నెంబర్ జాతీయ రహదారి

న్యూఢిల్లీ : మణిపూర్‌లో రెండో నంబరు జాతీయ రహదారి తెరుచుకుంది. బిజెపి రాజకీయ ప్రయోజనాల కోసం రాజేసిన తెగల మధ్య ఘర్షణల కారణంగా ఈ రహదారిపై రాకపోకలు నిలిచి పోయిన సంగతి తెలిసిందే. కేంద్ర ప్రభుత్వానికి, మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వానికి, కుకి-జో గ్రూపులకు మధ్య గురువారం త్రైపాక్షిక ఒప్పందం కుదిరింది. మణిపూర్ ప్రాదేశిక సమగ్రతను రక్షించడం, జాతీయ రహదారి-2లో అడ్డంకులు లేకుండా చూడటం స్వేచ్ఛగా వినియోగించడం, సాయుధల శిబిరాలను తొలగించడం ఈ ఒప్పందంలోని ముఖ్యాంశాలు. న్యూఢిల్లీలో గురువారం జరిగిన త్రైపాక్షిక సమావేశం లో కుకి నేషనల్ ఆర్గనైజేషన్(కెఎన్ఒ), యునైటెడ్ పీపుల్స్ ఫ్రంట్ (యుపిఎఫ్) ప్రతినిధులు, కేంద్ర హోంమంత్రిత్వ శాఖ, మణిపూర్ ప్రభుత్వ ప్రతినిధులు ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఇది ఏడాది పాటు అమల్లో ఉంటుందని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ అధికారులు తెలిపారు. కెఎన్ఒ, యుపిఎఫ్ తమ శిబిరాలను తరలించడానికి, ఆయుధాలను అప్పగించడానికి అంగీకరించినట్లు పేర్కొన్నారు. మరోవైపు ప్రయాణీకులు, నిత్యావసర వస్తువుల రవాణా కోసం జాతీయ రహదారి-2ను తెరవాలని కుకి-జో కౌన్సిల్ (కెజెడ్‌సి) గురువారం నిర్ణయం తీసుకుంది. న్యూఢిల్లీలో కేంద్రహోం మంత్రిత్వ శాఖ అధికారులు, కెజెడ్‌సి మధ్య వరుస సమావేశాల తరువాత ఈ నిర్ణయం తీసుకున్నారు. ఎన్‌హెచ్-2లో శాంతిని నెలకొల్పడానికి భారత భద్రతా దళాలకు సహకరిస్తామని కెజెడ్‌సి వెల్లడించింది.

పోలవరం నిర్వాసితుల, గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి

గవర్నర్‌కు సిపిఎం రాష్ట్ర బృందం విజ్ఞప్తి • సానుకూలంగా స్పందించిన గవర్నర్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పోలవరం నిర్వాసితులు, ఏజెన్సీలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ బృందం గవర్నర్‌కు విజ్ఞప్తి చేసింది. సమస్యలన్నీ విని వాటి పరిష్కారానికి గవర్నర్ అబ్దుల్ నజీర్ సానుకూలంగా స్పందించారు. గురువారం సాయంత్రం సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కిల్లో సురేంద్ర, మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు మొడియం నాగమణి, ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి, ఎఎస్ఆర్ జిల్లా కార్యదర్శి బి.కిరణ్, ఎ.అశోక్ గవర్నర్‌ను కలిసి పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులు, అలాగే ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమగ్ర వివరాలను గవర్నర్‌కు వినతిపత్రం సమర్పించారు.

గవర్నర్‌కు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తదితరులు వివరించిన అంశాల్లో ముఖ్యంగా పోలవరం జాతీయ ప్రాజెక్టు నిర్మాణం జరుగుతోందని, ఇందులో కేంద్ర ప్రభుత్వం నుండి రావాల్సిన నిధులు రాకపోవడంతో నిర్వాసితులు 10 సంవత్సరాలుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారికి ఇవ్వాల్సిన ప్యాకేజీ, భూములు, ఇంటి నిర్మాణాలు అనేకం పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. నిర్వాసితుల గ్రామాలు గుర్తించడంలో కూడా తీవ్ర వైఫల్యం ఉందని, నిర్మించిన నిర్వాసిత కాలనీల్లో మంచినీరు, రోడ్లు, నాసిరకమైన ఇళ్ల నిర్మాణం, మరుగుదొడ్లు, వీధిలైట్లు, రేషన్ షాపులు, స్మశాన వాటికల వంటి సమస్యలు పరిష్కారం చేయాలని కోరారు. ఉపాధిలేక నిర్వాసితులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

జిఓ నెంబర్ 3 పునరుద్ధరించి గిరిజన యువతకు 100 శాతం ఉద్యోగాలు వచ్చేటట్లు కేంద్ర ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకురావాలని, గిరిజన ప్రాంతంలో స్పెషల్ డిఎస్‌సి నిర్వహించాలని కోరారు. గిరిజన ప్రాంతంలో హైడ్రో ఎలక్ట్రిసిటీ ప్రాజెక్టుల నిర్మాణానికి ప్రభుత్వాలు సిద్ధమయ్యాయని, వీటికి సంబంధించి ప్రయివేటు కంపెనీలతో రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలను రద్దు చేయాలని కోరారు. పోలవరం ప్రాంతంలో గతంలో గిరిజనులకు ఇచ్చిన ఎల్‌టిఆర్ భూములని, ఇప్పుడు ఆ భూములనే మళ్లీ గిరిజనులకు ఇవ్వడానికి భూసమీకరణకు ప్రభుత్వం పూనుకోవడం సరైంది కాదని తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో ప్రయివేటు పంప్డ్ స్టోరేజీ పెట్టాలని ప్రభుత్వాలు పూనుకుంటున్నాయని వివరించారు. ఈ ప్రాంతం 5వ షెడ్యూలులో ఉందని, పెసా, అటవీ హక్కుల కమిటీ ఆమోదం లేకుండా ఏకపక్షంగా నిర్ణయించారని వివరించారు. గ్రామ సభలు పెట్టలేదని, 1/70 చట్టం ఉన్న ప్రాంతాన్ని పరిరక్షించాల్సింది పోయి ప్రయివేటు కంపెనీలకు ఇవ్వడం చట్టవ్యతిరేకమైందని వివరించారు. గిరిజనులు సాగుచేసుకుంటున్న పోడు భూములకు పట్టాలు మంజూరు చేయాలని, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, కాకినాడ, ఏలూరు జిల్లాల్లో ఉన్న 1200 నాన్ షెడ్యూల్డు గ్రామాలను షెడ్యూల్డు గ్రామాల్లో కలపాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో 1200 మంది భాషా వలంటీర్లు గత 20 సంవత్సరాల నుండి రూ.5,000 జీతంతో పనిచేస్తున్నారని గవర్నర్‌కు వివరించారు. వారికి జీతాలు పెంచడంతోపాటు ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని కోరారు. ఆదిమ గిరిజన తెగల (పివిటిజి) వారికి ఇళ్ల నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం రూ.10 లక్షలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. విద్యా, వైద్యానికి ఏజెన్సీ ప్రాంతాల్లో ఎక్కువ ప్రాధాన్యతనివ్వాలని, రాష్ట్ర విభజనలో ఉన్న గిరిజన యూనివర్శిటీకి నిధులు కేటాయించి భవన నిర్మాణాలు చేయాలని, గిరిజనులు పండిస్తున్న పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని, ముఖ్యంగా కాఫీ గింజలను కేంద్ర ప్రభుత్వమే కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలని కోరారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు హెచ్ఆర్ పాలసీ

- ఎపి ఎన్‌హెచ్‌ఎం జెఎసి డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నేషనల్ హెల్త్ మిషన్‌లో పని చేస్తున్న అన్ని క్యాడర్ల ఉద్యోగులకు హెచ్ఆర్ పాలసీ, మినిమం టైం స్కేల్ (ఎంటిఎస్) అమలు చేయాలని ఎపి ఎన్‌హెచ్‌ఎం జెఎసి రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు జెఎసి గౌరవ చైర్మన్ ఎ.వి నాగేశ్వరరావు, చైర్మన్ టి.దయామణి, కన్వీనర్ సిహెచ్ ప్రభాకర్ రెడ్డి, కోశాధికారి జె.సింహాచలం తదితరులు ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండ్యన్‌ను గురువారం కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలోని నేషనల్ హెల్త్ మిషన్‌లో దాదాపు 22 వేల మంది 186 క్యాడర్లలో అనేక ఏళ్లుగా పని చేస్తున్నారని, కోవిడ్ కాలంలోనూ ప్రాణాలకు తెగించి సేవలందించారని కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. 10వ పిఆర్‌సి వరకూ నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులు కూడా వైద్య ఆరోగ్య శాఖలోని కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులతో సమానంగా అందరికీ మినిమం టైమ్ స్కేల్ అమలయ్యిందన్నారు. గత పిఆర్‌సి కాలంలో అప్పటి ప్రభుత్వం వివక్ష చూపి ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు ఎంటిఎస్ అమలు చేయలేదని తెలిపారు. ఉద్యోగులకు మ్యూచువల్, ఐచ్ఛిక బదిలీలకు, క్లియర్ వేకెన్సీలు ఉన్న చోట బదిలీలకు అవకాశం ఇవ్వాలన్నారు. గత వేతన పెంపు కాలంలో ఒప్పందం ప్రకారం రావాల్సిన ఎరియర్స్ వెంటనే చెల్లించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ నియమాల ప్రకారం ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు ప్రతి ఏటా చెల్లించాల్సిన 5 శాతం ఇంక్రిమెంట్ గడచిన మూడేళ్లకు చెల్లించాలని పేర్కొన్నారు.

గుండెపోటుతో ప్రజాశక్తి విలేకరి మృతి

ప్రజాశక్తి-మార్కాపురం

ప్రజాశక్తి ప్రకాశం జిల్లా యర్రగొండ పాలెం విలేకరి షేక్ వలీసాహెబ్ (50) గుండెపోటుతో గురువారం మరణించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. శుక్రవారం మధ్యాహ్నం యర్రగొండ పాలెంలోని ఆయన స్వగృహం వద్ద అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ప్రజాశక్తి యర్రగొండపాలెం విలేకరిగా సుదీర్ఘ కాలంగా పనిచేస్తున్నారు. ఎన్నో ప్రజాసమస్యలను తన కథనాల ద్వారా వెలుగులోకి తెచ్చి.. పరిష్కారానికి కృషి చేశారు. సిపిఎం నేతగా కూడా కొనసాగారు. యర్రగొండపాలెంలో కొప్పుకొండ ఇళ్ల స్థలాల కోసం సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహించిన పోరాటంలో కీలకంగా వ్యవహరించారు. ఈ పోరాటం ద్వారా సుమారు 350 మంది పేదలు లబ్ధి పొందారు. ఆర్ఎంపి వైద్యునిగా రాణించి.. డాక్టర్ వలీసాహెబ్‌గా పేద ప్రజలకు సేవ చేశారు. వలీసాహెబ్ మృతి పట్ల ప్రజాశక్తి ఎడిటర్ తులసీదాస్, సిజిఎం అచ్యుతరావు సంతాపం తెలిపారు. సిపిఎం, సిపిఐ నేతలు, ప్రజాశక్తి సిబ్బంది తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

సోషల్ మీడియా పోస్టులపై చట్టం?

- నలుగురు మంత్రులతో ఉపసంఘం
- రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం
- యూరియాపై దుష్ప్రచారాన్ని తిప్పికొట్టలేకపోయారు : మంత్రులతో సిఎం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

సామాజిక మాధ్యమాల్లో తప్పుడు సమాచారాన్ని ప్రసారం చేసే వారిపై చర్యల కోసం ఒక చట్టాన్ని తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. రాష్ట్ర మంత్రివర్గ సమావేశం గురువారం జరిగింది. ఈ సమావేశం నుండి అధికారులు వెళ్లిపోయిన తరువాత మంత్రులతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కొద్దిసేపు సమావేశమై వివిధ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగానే సోషల్ మీడియా అంశం చర్చకు వచ్చినట్లు సమాచారం. మంత్రులందరూ సోషల్ మీడియాలో జరుగుతున్న తప్పుడు ప్రచారాల నియంత్రణ కోసం విధివిధానాలను రూపొందించాల్సిఉందని చెప్పినట్లు సమాచారం. దీంతో చంద్రబాబు జోక్యం చేసుకుంటూ భావ ప్రకటన ఉండాలని, అయితే అది శృతిమించకూడదని ఆయన వ్యాఖ్యానించారు. అలాగే సోషల్ మీడియా ఖాతాలకు ఆధార్ అకౌంటబులిటీ ఉండేలా చూడాలని అన్నట్లు సమాచారం. ఈ విషయమై మరింతగా చర్చించి, విధివిధానాలను రూపొందించేందుకు మంత్రి వర్గ ఉపసంఘాన్ని వేయాలని కూడా ఈ సమావేశంలో నిర్ణయించారు . ఈ ఉపసంఘంలో హోంమంత్రి అనిత, మంత్రులు నాదెండ్ల మనోహర్, అనగాని సత్యప్రసాద్, పార్థసారథిలు ఉంటారని ముఖ్యమంత్రి ప్రకటించినట్లు తెలిసింది. ఇదే సమయంలో సుగాలి ప్రీతి అనుమానాస్పద మృతిపైనా చర్చ జరిగినట్లు తెలిసింది. ఇప్పటికే ఈ కేసును సిబిఐకి అప్పగించాలని నిర్ణయం తీసుకున్నామని, శృతి కుటుంబానికి న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు. దీనిపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జోక్యం చేసుకుంటూ ఆ కుటుంబానికి అండగా నిలిచినందుకు తనను లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేస్తున్నారని, కొందరు స్వార్థ రాజకీయాల కోసం చేస్తున్న ఈ విధానాన్ని తిప్పికొట్టాలని వ్యాఖ్యానించారు.

యూరియాపై దుష్ప్రచారం

రాష్ట్రంలో యూరియా నిల్వలపై దుష్ప్రచారం జరుగుతోందన్న అభిప్రాయాన్ని మంత్రులు వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఎరువుల ఇబ్బందులు లేకున్నా కూడా ప్రతిపక్ష వైసిపి తప్పుడు ప్రచారాన్ని చేస్తోందని చంద్రబాబు అన్నట్లు సమాచారం. దీనిని తిప్పికొట్టలేకపోయినట్లు ఆయన మంత్రులపై కొంత అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసిం

తరచూ డిఆర్‌సి సమావేశాలు

రాష్ట్రంలో జిల్లా సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్న తీరుపైనా ఈ సమావేశంలో చర్చ జరిగినట్లు తెలిసింది. కొంతమంది కలెక్టర్లు మూడు నెలలకు ఒకసారి సమావేశాలు నిర్వహిస్తామని చెబుతున్నట్లు మంత్రి నాదెండ్ల మనోహం అన్నట్లు సమాచారం. దీనిపై చంద్రబాబు స్పందిస్తూ కలెక్టర్లకు డిఆర్‌సి సమావేశాలపై నియమాలు తెలియవా అని ప్రశ్నించినట్లు తెలిసింది,.

కలెక్టర్లకు, ఇన్‌ఛార్జ్ మంత్రులకు మధ్య సమన్వయం ఉండాలని చెబుతూనే ఇన్‌ఛార్జ్ మంత్రుల సమయాలకు అనుగుణంగా డిఆర్‌సి భేటీలు నిర్వహించేలా కలెక్టర్లను ఆదేశించాలని సిఎస్‌కు సూచనలు చేశారు. అలాగే ఇన్‌ఛార్జ్ మంత్రుల సూచనలను అమలు చేసేలా కూడా కలెక్టర్లకు ఆదేశాలు ఇవ్వాలన్నారు. అవసరమైతే నెలకు రెండుసార్లు కూడా డిఆర్‌సి సమావేశాలు పెట్టుకోవచ్చునని సూచించారు.డిఎస్‌సి పరీక్షలనెఉ సజావుగా నిర్వహించడంపై విద్యాశాఖ మంత్రి లోకేష్‌ను మంత్రులు అభినందించారు. దాదాపు 72 కేసులు డిఎస్‌సిపై వేసినా వాటిని పరిష్కరించి మెగా డిఎస్‌సిని విజయవంతం చేసినట్లు మంత్రులు సంతృప్తి వ్యక్తం చేశారు. 400 మంది పోలీసులు కూడా డిఎస్‌సికి ఎంపికయ్యారని కొంతమంది పేర్కొన్నారు. దీనివల్ల పోలీసు శాఖలో ఏర్పడే ఖాళీలను త్వరలో భర్తీ చేయాలని కూడా నిర్ణయించారు.

10న సూపర్‌సిక్స్-సూపర్‌హిట్

ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు వివరించేందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. ఈ నెల 10వ తేదీన సూపర్‌సిక్స్-సూపర్‌హిట్ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు నిర్ణయం తీసుకున్నారు. దీనికోసం మంత్రులతో ఒక కమిటీ వేసినట్లు చంద్రబాబు చెప్పారు.

కోర్టు ఉత్తర్వుల ప్రకారం పరిహారం ఇవ్వండి

- యడవల్లి ఎస్‌సి, ఎస్‌టి భూముల విషయమై పల్నాడు జెసిని కలిసిన వ్యవసాయ కార్మిక, కౌలురైతు సంఘాలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం యడవల్లి గ్రామ దళిత రైతుల నుంచి గత ప్రభుత్వం తీసుకున్న విలువైన భూములకు హైకోర్టు ఉత్తర్వులను అనుసరించి న్యాయమైన పరిహారం ఇవ్వాలని వ్యవసాయ కార్మిక, కౌలురైతు సంఘాలు కోరాయి. ఈ మేరకు జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరేను కలిసి కోర్టు ఉత్తర్వు కాపీని అందజేశారు. ఈ సందర్భంగా కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ మాట్లాడుతూ... కలెక్టర్‌కు రైతులు పెట్టుకున్న అర్జీపై మూడువారాల్లోగా సమాధానం ఇవ్వాలని హైకోర్టు ఆదేశించిందన్నారు. యడవల్లిలో 1975లో అప్పటి ప్రభుత్వ ఆదేశాల మేరకు నాటి జిల్లా కలెక్టర్ చంద్రయ్య... భూమి లేని 120 దళిత, గిరిజన కుటుంబాలకు 416 ఎకరాలు బీడు భూమిని అసైన్డ్ చేసి వీకర్స్ కాలనైజేషన్ సొసైటీ పేరిట రిజిస్టర్ చేసి పంపిణీ చేశారని గుర్తు చేశారు. గ్రానైట్ నిక్షేపాల నెపంతో 2021లో వైసిపి ప్రభుత్వం ఆ భూములను స్వాధీనం చేసుకుందని, దళిత రైతులను బెదిరించి ఎకరాకు రూ.8.33 లక్షల పరిహారంతో సరిపెట్టిందని చెప్పారు.

పల్నాడు జెసికి కోర్టు ఉత్తర్వులు ఇచ్చిన యడవల్లి రైతులు, నాయకులు

అదే పొలాలకు సమీపంలో జగనన్న కాలనీ ఏర్పాటుకు రూ.26 లక్షలతో గత వైసిపి ప్రభుత్వం భూములను కొనుగోలు చేసిందని తెలిపారు. దళితుల భూమిని స్వాధీనం చేసుకునే క్రమంలో 2013 భూసేకరణ చట్టం అమలు చేయలేదని విమర్శించారు. మొత్తం 244 మందికి చట్ట ప్రకారం పరిహారం దక్కలేదని, దీనిపై బాధితులు పోరాడుతున్నా, అధికారుల చుట్టూ తిరుగుతున్నా న్యాయం జరగలేదని వివరించారు. చివరికి బాధితులు కోర్టును ఆశ్రయించారని, దీనిపై వివరణ ఇవ్వాలని జిల్లా కలెక్టర్‌కు కోర్టు ఉత్తర్వులిచ్చిందని తెలిపారు. ఎకరాకు రూ.40 లక్షల చొప్పున పరిహారం కోసం బాధితుల తరుపు న్యాయవాది వి.రవీందర్ కోర్టులో వాదనలు వినిపించారన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వి.వెంకటస్వామి, పెద్దిరాజు, బాధిత రైతులు సుభాషిణి, రాణి, ఏసమ్మ పాల్గొన్నారు.

గ్రామ సందర్శనలో అధికారులతో మాట్లాడుతున్న వీరపాండియన్

అసాధారణ మరణాలపై అన్వేషణ

- రక్త పరీక్షల నివేదిక అనంతరం విశ్లేషణ
- తురకపాలెంలో పర్యటించిన వీరపాండియన్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు రూరల్ మండలం తురకపాలెంలో అసాధారణ మరణాలకు దారితీసిన అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి కారణాలను తెలుసుకునేందుకు రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్ ఆధ్వర్యంలో అధికారుల బృందం గురువారం గ్రామంలో పర్యటించింది. గత రెండునెలల్లో స్పష్టమైన కారణం లేకుండా పెద్ద సంఖ్యలో ప్రజలు మరణిస్తుండడంతో ప్రభుత్వం ఎట్టకేలకు స్పందించింది. జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీతో కలసి గ్రామంలో కమిషనర్ పర్యటించారు. తొలుత గ్రామంలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంప్‌ను పరిశీలించి, బాధితులకు అందిస్తున్న వైద్య సేవలను, పరీక్షల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. మీడియాతో కమిషనర్ మాట్లాడుతూ... మెలైడియోసిస్ అనే ఇన్‌ఫెక్షన్ కారణంగా మరణాలు సంభవించాయని చెబుతున్నప్పటికీ, రక్త నమూనాల పరీక్షల నివేదిక అనంతరం కారణాలను విశ్లేషిస్తామన్నారు. 12 ఏళ్ల పైబడిన ప్రతి ఒక్కరి నుండి రక్తం, యూరిన్ శాంపిల్స్ తీసుకుని 45 పారామీటర్స్ క్రింద టెస్ట్ చేయాలని ఆదేశించామన్నారు. ఎవరికైనా జ్వరం ఉంటే బ్లడ్ కల్చర్ చేస్తున్నామని, ఇప్పటి వరకు 32 మందికి బ్లడ్ కల్చర్‌కి నమూనాలు సేకరించామన్నారు. జ్వరం ఉన్నవారు మెడికల్ క్యాంపుకు వచ్చి రక్త నమూనాలు అందించాలని, రాలేని వారు తెలియజేస్తే వైద్య బృందమే మీ ఇంటికి వచ్చి రక్తనమూనాలను సేకరిస్తుందని చెప్పారు. కల్చర్ టెస్ట్ రిపోర్ట్‌కు 72 గంటల సమయం పడుతుందన్నారు. రిపోర్ట్స్ వచ్చిన తరువాత తగిన నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే బి.రామాంజనేయులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

'తురకపాలెం' మరణాలపై సమగ్ర అధ్యయనం

- మంత్రి సత్యకుమార్ యాదవ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గుంటూరు జిల్లా తురకపాలెం గ్రామంలో మరణాలకు దారితీసిన కారణాలను సమగ్రంగా పరిశీలించాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ అధికారులను ఆదేశించారు. సాధారణ సరళికి భిన్నంగా ఈ ఏడాది జూలై నుంచి ఈ నెల 3వ తేదీ మధ్య 23 మరణాలు జరిగినప్పుడు సరైన రీతిలో అప్రమత్తం కాలేదన్నారు. సచివాలయంలో ఈ అంశంపై వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులతో గురువారం మంత్రి సమీక్షించారు. గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాల ల్యాబ్ నుంచి వచ్చే బాధితుల రక్త నమూనాల పరీక్షల ఫలితాలను పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామంలో ప్రజలందరికీ కిడ్నీల పనితీరు, హెచ్‌బిఎ 1సి (షుగర్) బిపి పరీక్షలు నిర్వహించాలని సూచించారు. తురకపాలెం ఘటన నేపథ్యంలో సర్వైలెన్స్ వ్యవస్థలో తగిన మార్పులు చేయాలన్నారు. సమాచార సేకరణలో లోపం ఉండకూడదని తెలిపారు. మరణాల వివరాలు, తగిన కారణాల విశ్లేషణ చేపట్టే అవకాశం ప్రస్తుత వ్యవస్థలో లేదని, క్షేత్రస్థాయిలో వైద్య సిబ్బంది లేనందున తగిన సమయంలో పసిగట్టలేకపోయారని అధికారులు మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఎంటి కృష్ణబాబు మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో మరణాల వివరాలు, కారణాల నమోదుకు చర్యలు చేపడతామన్నారు. క్షేత్రస్థాయిలో గుర్తించిన అంశాలను డిఎంఇ జి.రఘునందన్ మంత్రికి వివరించారు. తురకపాలెంలో జూలైలో 10 మంది, ఆగస్టులో 10 మంది, సెప్టెంబరు 3వ తేదీలోపు ముగ్గురు మరణించినట్లు తెలిపారు. పరిస్థితి అదుపులో ఉందన్నారు. ఈ సమావేశంలో ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ వీరపాండియన్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఎస్‌సి, ఎస్‌టి పారిశ్రామికవేత్తలకు బకాయిలు విడుదల చేయండి

- కెవిపిఎస్ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎస్‌సి, ఎస్‌టి పారిశ్రామికవేత్తలకు రాయితీ బకాయిలను వెంటనే విడుదల చేసి ఆదుకోవాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) డిమాండ్ చేసింది. రాయితీ బకాయిలు విడుదల కాకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఎస్‌సి, ఎస్‌టి పారిశ్రామికవేత్తలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సంఘం రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఒ.నల్లప్ప, ఆండ్ర మాల్యాద్రి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత నాలుగు ఏళ్లుగా రాయితీలు చెల్లించే విషయంలో తీవ్ర జాప్యం జరగటం వల్ల అనేకమంది పారిశ్రామికవేత్తలు పరిశ్రమలు మూసివేసే పరిస్థితి నెలకొందన్నారు. దీంతో వేలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోయే పరిస్థితి నెలకొంటుందని తెలిపారు. రాష్ట్రంలో పారిశ్రామికవేత్తలకు రూ.16 వేల కోట్లు రాయితీ బకాయిలు చెల్లించాల్సి ఉండగా, అందులో ఎస్‌సి, ఎస్‌టి పారిశ్రామికవేత్తలకు దాదాపు 1,200 కోట్లు వరకూ చెల్లించాల్సి ఉందన్నారు.

ఏడాది కాలంగా అదుగో.. ఇదుగో అంటూ కాలక్షేపం చేస్తున్నారని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి ఎస్, ఎస్‌టి పారిశ్రామికవేత్తలకు రాయితీ బకాయిలను వెంటనే చెల్లించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలి

- సిఎంకు ప్రజారోగ్య వేదిక లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ వైద్య కళాశాలను, ఆరోగ్య సంరక్షణ సేవలను ప్రైవేటీకరించాలనే ప్రతిపాదనలను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని ప్రజారోగ్య వేదిక డిమాండ్ చేసింది. ఈ రంగంలో నిపుణులు, ప్రజల నుంచి ఈ విషయంలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతున్నందున ఇటువంటి ప్రతిపాదనలకు దూరంగా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు, వేదిక రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం.వి రమణయ్య, టి.కామేశ్వరరావు గురువారం లేఖ రాశారు. కొత్తగా మంజూరైన వైద్య కళాశాలల నిర్మాణాన్ని, నిర్వహణను ప్రభుత్వం ఆధ్వర్యంలోనే చేపట్టాలని కోరారు. వైద్య విద్యను అభ్యసించే విద్యార్థుల అవసరాలకు తగినట్లుగా వైద్య కళాశాలల్లో సీట్లు పెంచేందుకు జాతీయ వైద్య మండలిపై ఒత్తిడి తేవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన వైద్య కళాశాలలను పిపిపి విధానంలో చేపట్టేందుకు ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేసిందన్నారు. ప్రజల ఆరోగ్య హక్కును పరిరక్షించడంలో ప్రభుత్వ జవాబుదారీతనంపై ఇది తీవ్ర ప్రభావాన్ని చూపుతుందన్నారు. ఈ చర్యను ప్రజారోగ్య వేదిక తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. ఈ విషయంపై రాష్ట్రవ్యాప్తంగా సెమినార్లు, రౌండ్ టేబుల్ సమావేశాలు ప్రజారోగ్య వేదిక ఆధ్వర్యాన నిర్వహించి ఈ రంగంలో నిపుణులు, ప్రజల నుంచి అభిప్రాయాలు తీసుకోవడంతోపాటు, సంతకాలు సేకరించినట్లు పేర్కొన్నారు. వీరంతా వైద్య కళాశాలల ప్రైవేటీకరణను ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. మరోవైపు ప్రైవేటు వైద్య కళాశాలల్లో విచ్చలవిడిగా జరుగుతున్న అవినీతిని సిబిఐ ఇటీవల బహిర్గతం చేసిన నేపథ్యంలో ప్రజాప్రయోజనాలను కాపాడటానికి ఈ ప్రైవేటీకరణ ప్రతిపాదనను తక్షణమే వెనక్కి తీసుకోవాలని లేఖలో పేర్కొన్నారు. ప్రజారోగ్యవేదిక ఈ విషయంపై అనేక పర్యాయాలు తన ఆందోళనను వ్యక్తం చేసిందన్నారు. వైద్యవిద్యను ప్రైవేటీకరించడం వల్ల తలెత్తే సమస్యలు, జరిగే నష్టాలను ఎత్తి చూపుతూ ముఖ్యమంత్రికి, మంత్రికి, అధికారులకు లేఖలు రాసినట్లు తెలిపారు. గత నెల 24వ తేదీన విజయవాడలో జరిగిన జాతీయ ఆరోగ్య సదస్సులో పెద్ద సంఖ్యలో నిపుణులు, మేధావులు, ప్రజలు ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకించినట్లు చెప్పారు. వైద్య విద్యను ప్రైవేటీకరించడం వల్ల పేదల వర్గాలకు చెందిన విద్యార్థులకు వైద్య విద్య అందని ద్రాక్షగా మిగిలిపోతుందన్నారు. ప్రైవేటు సంస్థలకు ప్రభుత్వ వైద్య కళాశాలల నియంత్రణను అప్పగించడం వల్ల ఫీజులు అధికమవడం, జవాబుదారీతనం తగ్గడం, సేవ కంటే ఆదాయానికే ప్రాధాన్యత ఇవ్వడంతో పేద విద్యార్థులకు విద్య, రోగులకు వైద్యం అందుబాటులో ఉండవని లేఖలో స్పష్టం చేశారు.

మీడియాతో మాట్లాడుతున్న ముజఫర్ అహ్మద్, కె.పోలారి తదితరులు

ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి

- ఎపి ఆటో, ట్రాలీ డ్రైవర్స్ యూనియన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలని ఎపి ఆటో, ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజఫర్ అహ్మద్ డిమాండ్ చేశారు. విజయవాడలోని సిఐటియు రాష్ట్ర కార్యాలయంలో ఎపి ప్రగతిశీల ఆటో మోటార్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.పోలారి కలిసి విలేకర్ల సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్న ఆటో, టాటా మ్యాజిక్ డ్రైవర్లు ప్రభుత్వం అమలు చేసిన స్త్రీ శక్తి పథకంలో మరింత నష్టపోతున్నారని తెలిపారు. భారత న్యాయ సంహిత 2023 లో డ్రైవర్లను జైలు పాలు చేసే ప్రమాదకర 'హిట్ అండ్ రన్' చట్టంలో సెక్షన్ 106 - 1, 2 లను అమలు చేయడం వల్ల పొరపాటున ప్రమాదం జరిగితే డ్రైవర్లకు రూ.పది లక్షల వరకూ జరిమాన, జీవిత ఖైదు విధించాలని చెబుతుందన్నారు. ఆటో, క్యాబ్, టాటా ఏస్ డ్రైవర్లు, కార్మికుల కుటుంబాలు నష్టపోకుండా ప్రతి డ్రైవర్‌కు ఏడాదికి రూ.25 వేల చొప్పుల చెల్లించాలని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఎన్నికల హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అవినీతికి నిలయాలుగా మారిన ఎటిసి సెంటర్లలను రద్దు చేయాలని, డ్రైవర్లను జైలు పాలు చేసే హిట్ అండ్ రన్ చట్టంలోని ప్రమాదకర సెక్షన్లు తొలగించాలని కోరుతూ ఈ నెల 8న కలెక్టర్లకు, ఎమ్మెల్యేలకు, మంత్రులకు వినతి పత్రాలు ఇవ్వాలని, అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యే 18వ తేదీన ఛలో విజయవాడ కార్యక్రమం చేపట్టాలని ఎపి ఆటో, ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ (సిఐటియు), ఎపి ప్రగతిశీల ఆటో మోటార్ వర్కర్స్ ఫెడరేషన్ (ఐఎఫ్‌టియు), ఎపి ప్రొగెసివ్ మోటార్ అండ్ వెహికల్ డ్రైవర్స్ యూనియన్ (ఏఐటియుసి), హెచ్‌ఎంసి మిని ట్రక్కు అసోసియేషన్, టాటా ఏస్, మ్యాజిక్ డ్రైవర్స్ యూనియన్ తదితర సంఘాలు పిలుపునివ్వడం జరిగిందన్నారు. విలేకర్ల సమావేశంలో యూనియన్ నాయకులు ఎన్.శివాజి, కె.దుర్గారావు, మునిశంకర్, ఈశ్వరరావు, భాష తదితరులు పాల్గొన్నారు.

47 వేల మంది రైతులకు రూ.23.58 కోట్లు జమ

- మంత్రి కె.అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

'అన్నదాత సుఖీభవ - పిఎం కిసాన్' పథకంలో భాగంగా 47,161 మందికి మొదటి విడత మొత్తం రూ.5 వేలు చొప్పున రూ.23.58 కోట్లు గురువారం విడుదల చేసినట్లు వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు తెలిపారు. ఈ మేరకు గురువారం విడుదల చేసిన ప్రకటనలో గత నెలలో స్వీకరించిన వినతులను పరిష్కరించి కొత్తగా 36,722 మందిని అర్హులుగా గుర్తించినట్లు తెలిపారు. తొలి జాబితాలోనే అర్హులై ఉండి ఇ-కెవైసి, ఎన్‌పిసిఐ యాక్టివేషన్ సమస్యలతో నిధులు జమ చేయని మరికొందరికి తాజాగా నిధులను వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేసినట్లు పేర్కొన్నారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని యూరియా సరఫరా, పంపిణీని ప్రభుత్వం పూర్తి పారదర్శకంగా నిర్వహిస్తుందని తెలిపారు. గతానికి భిన్నంగా మార్క్‌ఫెడ్‌కు అధిక మొత్తంలో యూరియాను కేటాయించి, ప్రైవేటు వ్యాపారస్తులకు తగ్గించినట్లు పేర్కొన్నారు. గతంలో పోలిస్తే ఈ ఏడాది యూరియా సరఫరా 31 శాతం ఎక్కువగా ఉందన్నారు. విజిలెన్స్, రెవెన్యూ అధికారులతో నిరంతరం నిఘా, క్రమం తప్పని తనిఖీలు నిర్వహిస్తూ అందుబాటు ధరల్లోనే మార్కెట్‌లో యూరియా లభించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకూ గత ఏడాది కంటే 87,880 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులు వినియోగించారని తెలిపారు. రాష్ట్రంలో యూరియా సరఫరా, పంపిణీలో ఎటువంటి ఇబ్బంది లేకుండా చేస్తున్నామన్నారు.

పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌ను పరిశీలిస్తున్న కెఆర్ఎంబి చైర్మన్ పిబి.పాండె, ఇతర అధికారులు

పోతిరెడ్డిపాడును పరిశీలించిన కెఆర్ఎంబి చైర్మన్

ప్రజాశక్తి - నందికొట్కూరు

నంద్యాల జిల్లా జూపాడు బంగ్లా మండలం పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌ను గురువారం కృష్ణానది యాజమాన్య బోర్డు చైర్మన్ పిబి.పాండే పరిశీలించారు. పోతిరెడ్డిపాడు ప్రాజెక్టు నిర్మాణం, నీటిలభ్యత, ప్రాజెక్టు నుంచి నీటి తరలింపు గురించి ప్రాజెక్టు అధికారులను అడిగి తెలుసుకున్నారు. గత 20 ఏళ్లలో కృష్ణానదికి జులైలో వరద వచ్చేదని, జులై చివర, ఆగస్టు మొదటి వారంలో పోతిరెడ్డిపాడు ప్రాజెక్టు నుంచి నీటిని దిగువకు విడుదల చేసేవారమని అధికారులు పాండేకు వివరించారు. ఈ ఏడాది జూన్‌లోనే కృష్ణానదికి వరదలు ప్రారంభమయ్యాయన్నారు. 20 ఏళ్ల తర్వాత జులై మొదటి వారంలో పోతిరెడ్డిపాడు నుంచి నీటి విడుదల చేశామని తెలిపారు. అనంతరం పోతిరెడ్డిపాడు పాత రెగ్యులేటర్‌ను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఎన్‌సిఎల్ పవర్ ప్రాజెక్ట్ గెస్ట్‌హౌస్‌లో తెలంగాణ ఇంజనీర్లతో సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో కెఆర్ఎంబి సభ్యులు కెకె.జాన్ గ్రిడ్, పోతిరెడ్డిపాడు ప్రాజెక్టు ఎస్ఇ ప్రతాప్, ఇఇ నాగేంద్ర, డిఇలు సుబ్రహ్మణ్యం రెడ్డి, నగేష్ రఘురామిరెడ్డి, తెలంగాణ ఎడిఇ పవన్, ఎఇ రాజశేఖర్, జెఇ విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

చెవిరెడ్డి ఇంట్లో రెండవ రోజూ 'సిట్' తనిఖీలు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

మద్యం కేసులో స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్) తనిఖీలు గురువారమూ కొనసాగాయి. తిరుపతి గ్రామీణం పరిధిలోని తుమ్మలగుంటలో చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఇంట్లో గురువారం మధ్యాహ్నం వరకూ సిట్ అధికారులు తనిఖీ చేశారు. సుమారు పది మంది అధికారులు ఈ తనిఖీల్లో పాల్గొన్నారు. గెస్ట్‌హోస్, హైదరాబాద్‌లోనూ తనిఖీ చేపట్టినట్లు సమాచారం.

డిజె సౌండ్‌తో ఆగిన గుండె

- యువకుడి మృతి

ప్రజాశక్తి - విజయనగరం కంటోన్మెంట్

వినాయక ఊరేగింపులో డిజె సౌండ్స్ కారణంగా విజయనగరంలోని బొబ్బాదిపేటకు చెందిన బొబ్బాది హరీష్ (22) గుండె ఆగి మృతిచెందాడు. బుధవారం రాత్రి వినాయక ఊరేగింపు సందర్భంగా తన స్నేహితులతో కలిసి హరీష్ డాన్స్ చేస్తూ ఒక్కసారిగా కుప్ప కూలిపోయాడు. వెంటనే జిల్లా సర్వజన ఆస్పత్రికి తరలించగా అక్కడ వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. డిగ్రీ పూర్తి చేసిన హరీష్ క్యాంపస్ సెలక్షన్‌లో ఒక ప్రైవేట్ కంపెనీకి ఎంపికయ్యారు.

మార్కెట్లలో జిఎస్‌టి జోష్ అంతంతే..!

- సెన్సెక్స్ 150 పాయింట్ల పెరుగుదల

ముంబయి : వస్తు సేవల పన్ను (జిఎస్‌టి) శ్లాబు రేట్లను రెండింటికి కుదించడం ద్వారా భారత స్టాక్ మార్కెట్లు దూసుకుపోవచ్చని నిపుణులు, మార్కెట్ వర్గాలు వేసిన అంచనాలు ప్రతిఫలించలేదు. గురువారం సెషన్‌లో సాధారణ లాభాలతోనే సరిపెట్టుకున్నాయి. బిఎస్‌ఇ సెన్సెక్స్ 150 పాయింట్లు లేదా 0.19 శాతం పెరిగి 80,718కి చేరింది. ఇంట్రాడేలో 81,456.67 పాయింట్లకు చేరిన సూచీ మధ్యాహ్నం తర్వాత అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కోవడం సాధారణ లాభాలతో ముగిశాయి. జిఎస్‌టి సంస్కరణల ఆశలతో ఉదయం ఓ దశలో 700 పాయింట్లు పైగా పెరిగింది. బిఎస్‌ఇలో దాదాపు 140 స్టాక్‌లు 52 వారాల గరిష్టానికి చేరాయి. ఎన్ఎస్ఇ నిఫ్టీ తుదకు 19.25 పాయింట్లు లేదా 0.08 శాతం పెరిగి 24,734 వద్ద ముగిసింది. బిఎస్ఇ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు ఒక్కొక్కటి 0.6 శాతం నష్టపోయాయి. నిఫ్టీలో ఎంఅండ్ఎం, బజాజ్ ఫైనాన్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, అపోలో హాస్పిటల్స్, నెస్లే లాభాల్లో ముగియగా.. హెచ్‌డిఎఫ్‌సి లైఫ్, టాటా కన్స్యూమర్, విప్రో, భారత్ ఎలక్ట్రానిక్స్, ఇండస్‌ఇండ్ బ్యాంక్ సూచీలు అధికంగా నష్టపోయాయి.

యూరియా కొరతపై ఆందోళనలు

- రైతు సేవా కేంద్రాల వద్ద పడిగాపులు

ప్రజాశక్తి - యంత్రాంగం

సరిపడా యూరియా సరఫరా కాకపోవడంతో రైతులు గురువారం ఆందోళనకు దిగారు. రాస్తారోకో నిర్వహించారు. రైతు సేవా కేంద్రం వద్ద ఆందోళన చేపట్టారు. అధిక ధరకు కొనుగోలు చేయాల్సి రావడం, నానో యూరియా బాటిల్ కొంటేనే 2 యూరియా బస్తాలు ఇస్తామంటూ లింకు పెట్టడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

విజయనగరం జిల్లాలోని పూసపాటిరేగ మండలంలోని కుమిలి రైతు సేవా కేంద్రం వద్ద 400 మంది రైతులు ఉంటే కేవలం 268 బస్తాలు మాత్రమే ఈ కేంద్రానికి రావడంతో మిగిలిన రైతులకు ఎరువులు అందక ఎపి రైతు సంఘం ఆధ్వర్యాన రైతులు రాస్తారోకో నిర్వహించారు. నెల్లిమర్ల మండలం రామతీర్థం, సీతారామునిపేట, బొప్పడాం రైతు సేవా కేంద్రాల్లో వచ్చిన ఎరువులు పట్టుమని పదిశాతం మంది రైతులకు సరిపోకపోవడంతో ఉదయం నుంచి రైతు సేవా కేంద్రం వద్ద బారులు తీరిన రైతులు అధికారులపై మండిపడ్డారు. బొప్పడాం రైతు సేవా కేంద్రంలో 133 యూరియా బస్తాలు వచ్చాయని అధికారులు చెబుతున్నారు. రామతీర్థం ఆర్ఎస్‌కెలో కేవలం 70 బస్తాలు యూరియా పంపిణీ జరిగింది. సీతారాముని పేట ఆర్ఎస్‌కెలో 133 యూరియా బస్తాలు ఉండగా వాటిలో సీతారాముని పేటకు 100, సారిపల్లికి 23, నెల్లిమర్లకి 10 బస్తాలు చొప్పున కేటాయించారు. రైతులందరికీ సరిపోకపోవడంతో తీవ్ర నిరాశతో ఇంటిముఖం పట్టారు. గజపతినగరం మండలం ఎం.గుమడాం గ్రామంలో 65 బస్తాలు యూరియా పంపిణీ

విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలంలో రైతు సేవా కేంద్రం వద్ద బారులు తీరిన రైతులు

చేసినట్టు అధికారులు తెలిపారు. గజపతినగరంలోని సత్యా ట్రేడర్స్‌లో 12 టన్నులు, శివశక్తి ఆగ్రో కెమికల్స్ 4 టన్నులు అందుబాటులో ఉన్నప్పటికీ అధిక ధరలు వసూలు చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనకాపల్లి జిల్లా కె.కోటపాడు మండలం, ఎ.కోడూరు గ్రామంలో అనకాపల్లి గవరపాలెం గౌరీ పిఎసిఎస్ పరిధిలో 44 మెట్రిక్ టన్నులు యూరియాకు ఇండెంట్ పెట్టగా, 32 టన్నులు మాత్రమే ప్రభుత్వం నుండి వచ్చింది. ఒకటి నానో యూరియా బాటిల్ కొంటేనే రెండు యూరియా బస్తాలు ఇస్తున్నారని, రూ.260 విలువ గల యూరియా బస్తా బయట మార్కెట్‌లో రూ.500కు కొనుగోలు చేయాల్సి వస్తోందని, భూమి పాస్ పుస్తకం ఉంటే తప్ప యూరియా ఇవ్వడం లేదని పలు గ్రామాలకు చెందిన రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. కృష్ణాజిల్లా అవనిగడ్డ మండల పరిధిలోని వేకనూరు గ్రామానికి చెందిన రైతులు రైతు భరోసా కేంద్రంలో ఎరువులు ఇవ్వకుండా వారికి అవనిగడ్డ పిఎసిఎస్ వద్ద మన గ్రోమోర్ షాప్ వద్ద నుంచి తీసుకు వెళ్లాలని చెప్పడంతో అక్కడే పడిగాపులు కాశారు. ఎంత పొలం ఉన్నా ఒక్క రైతుకు ఒక యూరియా బస్తా మాత్రమే ఇవ్వడంతో రైతులు లబోదిబోమన్నారు.

స్టీల్‌ప్లాంట్ ఇఒఐ, ప్రైవేటీకరణ రద్దుకు 11న బహిరంగ సభ

- ముఖ్యఅతిథులుగా ఎంఎ.బేబి, వి.శ్రీనివాసరావు
- సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు

ప్రజాశక్తి- కలెక్టరేట్ (విశాఖపట్నం)

ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రస్ట్ (ఇఒఐ) పేరుతో విశాఖ స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని ప్రభుత్వాలు ఆపాలని డిమాండ్ చేస్తూ 11న పాతగాజువాకలో బహిరంగ నిర్వహించనున్నట్లు సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు తెలిపారు. జగదాంబ సమీపంలోని సిఐటియు కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో బహిరంగ సభకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జగ్గునాయుడు మాట్లాడుతూ... సొంత గనులు కేటాయించాలని, ప్లాంట్‌లోని ఆరు వేల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలని, నిర్వాసితులకు పర్మినెంట్ ఉద్యోగాలు ఇవ్వాలని, కార్మిక పోరాటాలు, దీక్షలపై పోలీస్ నిర్బంధం నిలిపివేయాలని కోరారు. ఉద్యోగులకు, కార్మికులకు పూర్తి జీతాలు ఇవ్వాలని పేర్కొన్నారు. బహిరంగ సభకు సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబి, రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. ఈ నెల 1 నుండి 11వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా సిపిఎం ప్రచారోద్యమాన్ని నిర్వహిస్తోందని చెప్పారు.

స్టీల్‌ప్లాంట్ విషయమై రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం ప్రకటన చేశారని, తెలుగువారి మనోభావాలు

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జగ్గునాయుడు, తదితరులు

గౌరవించి కేంద్ర ప్రభుత్వం రూ.12 వేల కోట్ల ప్యాకేజీ ఇచ్చిందని, గతంలో తీసుకున్న నిర్ణయంపైన పునరాలోచన చేసిందని, కొన్ని సేవలు ప్రైవేటీకరిస్తే మొత్తం ప్రైవేటుకు ఇస్తున్నారని తప్పుడు ప్రచారం చేస్తున్నారని ముఖ్యమంత్రి పేర్కొన్నారని తెలిపారు. విశాఖ ఉక్కుకు కేంద్రం ఇచ్చిన రూ.11,440 కోట్ల ఆర్థిక ప్యాకేజీలో రూ.9842 కోట్లు జిఎస్‌టి, బ్యాంకుల రుణాల పేరున కేంద్రం తిరిగి లాగేసుకుందన్నారు. మిగిలిన నిధులు కూడా స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తికి, ముడి సరుకు, యంత్రాలకు, కార్మికుల జీతభత్యాలకు వినియోగించరాదని ఆంక్షలు పెట్టిందని తెలిపారు. ప్యాకేజీ నిధులతో ప్లాంట్ అప్పులు తీర్చారన్నారు. 2,200 మంది పర్మినెంట్ ఉద్యోగులను విఆర్ఎస్ పేరుతో, 5 వేల మంది కాంట్రాక్టు కార్మికులను చట్టవిరుద్ధంగా తొలగించారని తెలిపారు. మీడియా సమావేశంలో సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, పి.మణి, బి.జగన్, వి.కృష్ణారావు పాల్గొన్నారు.

డాక్టర్ పాటిబండ్లకు సిఐఐ అవార్డు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అంతర్జాతీయ సైబర్ సెక్యూరిటీ నిపుణులు డాక్టర్ పాటిబండ్ల ప్రసాదుకు గ్లోబల్ ఆరిఫిషియల్ ఇంటలిజెన్స్‌లో ప్రతిష్టాత్మక అవార్డు దక్కింది. ఆయన సమర్పించిన ఎఐ సైబర్ సెక్యూరిటీ, డిజిటల్ ఫోరెన్సిక్, ఇన్సిడెంట్ రెస్పాన్స్, లా ఎన్ఫోర్స్‌మెంట్ తదితర విభాగాల్లో సిఐఐ ఆయనకు ఈ అవార్డును బహూకరించింది. గుంటూరు జిల్లా మోపర్రుకు చెందిన ఈయన అంతర్జాతీయ ఇంటర్‌పోల్, కోలంబో సెక్యూరిటీ, యుఎస్ఎ డిప్లోమాట్ సెక్యూరిటీ, ఎఐఎఫ్‌సిఐ తదితర సంస్థలకు శిక్షణ ఇచ్చారు. యుఎస్ఎ, ఇజ్రాయిల్, మారిషస్, శ్రీలంక, కాంబోడియా, యూరప్ దేశాల్లో అంతర్జాతీయ సంస్థలకు పరిశోధనలో శిక్షణ ఇచ్చారు. వేర్వేరు యూనిర్శిటీల సిలబస్ రూపకల్పనలోనూ ఆయన కీలకపాత్ర పోషించారు.

సమీక్షలో మంత్రి ఆనం, దుర్గగుడి ఇఒ శీనా నాయక్, తదితరులు

11 రోజుల పాటు దసరా ఉత్సవాలు

- సెప్టెంబర్ 22 నుంచి అక్టోబర్ 2 వరకు నిర్వహణ
- ఏర్పాట్లపై మంత్రి ఆనం సమీక్ష

ప్రజాశక్తి - విజయవాడ సిటీ

శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం దసరా మహోత్సవం 2025 ఏర్పాట్లపై రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అధ్యక్షతన గురువారం జమ్మిదొడ్డి మీటింగ్ హాల్‌లో సమావేశం జరిగింది. ఈ సమీక్షా సమావేశంలో నగర పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు, దేవాదాయశాఖ కమిషనర్ రామచంద్ర మోహన్, జాయింట్ కలెక్టర్ ఇలక్కియ, దేవస్థానం ఇఒ శీనా నాయక్‌తో పాటు తదితర అధికారులు పాల్గొన్నారు. ఉత్సవాలకు విచ్చేసే యాత్రికుల సౌకర్యార్థం తీసుకుంటున్న చర్యలు, దసరా ఉత్సవాల్లో రద్దీ నియంత్రణ, క్యూలైన్ల నిర్వహణలో సాంకేతికత వినియోగం వంటి అంశాలపై అధికారులతో మంత్రి సమీక్ష జరిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారంగా యాత్రికుల సౌకర్యాలను మెరుగుపర్చే చర్యలపై అధికారులు మంత్రికి ఈ సందర్భంగా వివరించారు. ఈ నెల 22 నుంచి అక్టోబర్ రెండు వరకు ఉత్సవాలు జరగనున్నాయని తెలిపారు. ఈ ఏడాది 11 రోజుల పాటు 11 అలంకారాల్లో దుర్గమ్మను అలంకరించనున్నట్లు పేర్కొన్నారు. ఈ దసరాలో కమాండ్ కంట్రోల్ రూమ్ కీలకం కావాలని, తిరుమలలో యాత్రికుల రద్దీ నియంత్రణలో ఏ విధానం ఉందో అదే విధానాన్ని పాటించాలని, సందర్శకులకు సరైన సమాచారం అందించేందుకు అన్ని చర్యలూ తీసుకోవాలని మంత్రి సూచించారు. మూలా నక్షత్రం రోజు దుర్గమ్మకు సిఎం పట్టు వస్త్రాలు సమర్పించేందుకు అన్ని ఏర్పాట్లూ చేస్తున్నామని తెలిపారు. స్త్రీ శక్తి పథకం అమలు నేపథ్యంలో ఈ ఏడాది దసరా ఉత్సవాలకు మహిళా యాత్రికుల సంఖ్య పెరిగే అవకాశం ఉందన్నారు. దసరా సమయంలోనే విజయవాడ ఉత్సవ్ నిర్వహిస్తుండటంతో సందర్శకుల సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశం ఉన్నట్లు భావిస్తున్నామన్నారు. దసరా ఉత్సవాల్లో అన్ని శాఖల సమన్వయం అవసరమని, అధికారులు, సిబ్బంది మధ్య కమ్యూనికేషన్ కీలకమని దేవదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్ అన్నారు. 15వ తేదీ లోపు పనులు పూర్తి కావాలని, దేవదాయ శాఖ నుండి కావలసిన అన్ని అనుమతులు ఎప్పటికప్పుడు మంజూరు చేస్తున్నామని రామచంద్ర మోహన్ పేర్కొన్నారు. నగర పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు మాట్లాడుతూ.. కొత్త హోల్డింగ్ ఏరియాలు, కంట్రోల్ రూమ్ వినియోగం, వెస్ట్ బైపాస్ వినియోగించుకొని ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

మారుతి సుజుకి కొత్త విక్టోరిస్ విడుదల

న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద కార్ల తయారీ కంపెనీ మారుతి సుజుకి కొత్తగా విక్టోరిస్‌ను విడుదల చేసింది. ఈ ఎస్‌యువి ఏరీనా డీలర్‌షిప్‌ల్లో అందుబాటులో ఉంటుందని పేర్కొంది. దీని ఎక్స్‌షోరూం ధరల శ్రేణి రూ.12లక్షలు - 20 లక్షలుగా ఉంది. ఈ కారును 100 దేశాలకు ఎగుమతి చేస్తున్నామని మారుతి సుజుకి సిఇఒ హిసషి టెకిచి పేర్కొన్నారు. దీనిని రూ.11వేలతో ఏరీనా షోరూం లేదా తమ వెబ్‌సైట్‌లో బుకింగ్ చేసుకోవచ్చన్నారు.

రాజధానిలో ప్రభుత్వ యూనివర్సిటీలు ఏర్పాటు చేయాలి

- రౌండ్‌టేబుల్ సమావేశంలో విద్యావేత్తలు, ప్రజాసంఘాల డిమాండ్

రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి-గుంటూరు

రాజధాని అమరావతిలో ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు, కళాశాలలు ఏర్పాటు చేయాలని విద్యావేత్తలు, విద్యార్థి, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. రాజధాని అభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో గుంటూరు నగరం బ్రాడీపేటలోని జాషువా విజ్ఞాన కేంద్రంలో వేదిక కన్వీనర్, మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ రాజధానిలోని విట్, ఎస్ఆర్ఎంకు మొదట 200 ఎకరాల చొప్పున, ఇప్పుడు వంద ఎకరాల చొప్పున ఇచ్చారని, కానీ స్థానిక ప్రజల పిల్లలకు ఎలాంటి రాయితీలు లేవన్నారు. అమరావతి విశ్వవిద్యాలయం ఏర్పాటు చేసి, సామాజిక శాస్త్రాలకు, హ్యూమానిటీస్‌కు చోటు కల్పించాలన్నారు. ప్రొఫెసర్ డిఎఆర్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ తుళ్లూరు ప్రాంతంలో అధునాతన కోర్సులతో డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయాలని కోరారు. రాజ్యాంగ చర్చావేదిక నాయకులు అవధానుల హరి మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) యూనివర్సిటీని ప్రైవేటు రంగంలో కాకుండా ప్రభుత్వ రంగంలో ఏర్పాటు చేయాలన్నారు. విద్యావేత్త ఆర్ రాము మాట్లాడుతూ కేంద్ర గ్రంథాలయాన్ని, పోటీ పరీక్షల కోసం స్టడీ సెంటర్‌ను రాజధానిలో ఏర్పాటు చేయాలన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి షేక్.సమీర్ మాట్లాడుతూ ప్రైవేటు యూనివర్సిటీలకు ఇబ్బడిముబ్బడిగా భూములిస్తున్న ప్రభుత్వం ఆయా యూనివర్సిటీలపై ఎలాంటి నియంత్రణా లేకపోవడంతో ఫీజులు, సౌకర్యాలు వారి ఇష్టారాజ్యంగా మారిందన్నారు. రాజధాని ప్రాంత నాయకులు ఎం రవి మాట్లాడుతూ ల్యాండ్ పూలింగ్ యాక్ట్ హామీ ప్రకారం భూములు ఇచ్చిన రైతుల పిల్లలకు, ఉపాధి కోల్పోయిన పేదల పిల్లలకు ఉచితంగా విద్యను అందిస్తామన్న ప్రభుత్వ హామీని ఇంత వరకూ అమలు చేయలేదన్నారు. ప్రొఫెసర్ ఎం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్యలో నాణ్యతను పెంపొందించాలన్నారు. సమావేశంలో రైతు సంఘం నాయకులు కె అజయ్‌కుమార్, రాజధాని ప్రాంత నాయకులు భాగ్యరాజు, నవీన్‌ప్రకాష్, ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి చిష్టీ, అవగాహన సంస్థ కార్యదర్శి కె శివరామిరెడ్డి, భావన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు, ఏజెంట్‌ను అడ్డుకుంటున్న గిరిజనులు

హైడ్రో పవర్ సర్వే అధికారుల అడ్డగింత

ప్రజాశక్తి - హుకుంపేట (అల్లూరి జిల్లా)

అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలం బూర్జ పంచాయతీ మజ్జివలస గ్రామంలో హైడ్రో పవర్ ప్రాజెక్టు సర్వేకు వచ్చిన ప్రభుత్వ అధికారులను, నవయుగ కంపెనీ ఏజెంట్‌ను గిరిజనులు, పోరాట కమిటీ నాయకులు అడ్డుకున్నారు. గురువారం ఉదయం మజ్జివలస గ్రామానికి విఆర్ఒ, మండల సర్వేయర్‌తో పాటు హైడ్రోపవర్ ప్రాజెక్టుకు చెందిన నవయుగ కంపెనీ ఏజెంట్ గిడ్డి అప్పలనాయుడు వచ్చారు. సర్వే కోసం వచ్చిన అధికారులను, కంపెనీ ఏజెంట్‌ను గ్రామ సరిహద్దుల్లోనే గిరిజనులు అడ్డుకున్నారు. దీంతో వారు వెనుదిరిగి వెళ్లిపోయారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ కన్వీనర్ సురేష్ కుమార్, నాయకులు కృష్ణంరాజు, కొండలరావు మాట్లాడుతూ.. గతంలో కూడా నవయుగ కంపెనీ ఏజెంట్ అప్పలనాయుడు గ్రామానికి వచ్చి రాళ్లు, దిమ్మలు వేసి సర్వే పనులు చేపట్టాడని, రోడ్డు నిర్మాణం పేరుతో ప్రజలను మభ్యపెట్టిన విషయాన్ని గుర్తు చేశారు. ఇకపై హైడ్రోపవర్ ప్రాజెక్టు పేరుతో గ్రామాలకు వచ్చే ఏజెంట్లను అడ్డుకోవాలని, వారిని కమిటీ వద్దకు తీసుకురావాలని గ్రామ ప్రజలకు సూచించారు. అధికారులు మినహా ఎవరైనా గ్రామంలోకి వస్తే అడ్డుకుంటామని కమిటీ నాయకులు హెచ్చరించారు. హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణ ఆలోచనను పూర్తిగా విరమించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

విమానాన్ని ఢీకొట్టిన పక్షి

- తృటిలో తప్పిన ప్రమాదం
- గన్నవరంలో విమానం నిలుపుదల

ప్రజాశక్తి - గన్నవరం (కృష్ణాజిల్లా)

టేకాఫ్ అవుతుండగా విమానాన్ని పక్షి ఢీ కొట్టడంతో రన్‌వే పైనే విమానాన్ని నిలిపివేశారు. ఈ సంఘటన గురువారం ఉదయం కృష్ణాజిల్లా గన్నవరం (విజయవాడ) విమానాశ్రయంలో జరిగింది. విమానం రెక్కల నుంచి ఒక్కసారిగా మంటలు రావడంతో లోపల ఉన్న ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. వివరాల్లోకి వెళితే.. బెంగళూరు నుంచి విజయవాడ విమానాశ్రయానికి ఉదయం 7:15 గంటలకు ఎయిర్ ఇండియా విమానం వచ్చింది. ప్రయాణికులు దిగి వెళ్లిపోగా, మరో 90 మంది ప్రయాణికులు లోపలకు వచ్చారు. 8 గంటలకు విమానం బయలుదేరేందుకు రన్‌వేపైకి వచ్చింది. ఇంతలో ఎదురుగా వేగంగా వచ్చిన ఓ పక్షి విమానం రెక్కలోకి దూసుకెళ్లిపోయింది. రెప్పపాటులో ఏం జరిగిందో ఎవరికీ అర్థం కాలేదు. పైలెట్ కాస్త ఆలోచించి పక్షి విమానాన్ని ఢీకొట్టినట్లు గమనించారు. విమానం రెక్కలోకి పక్షి వెళ్లడం వల్ల లోపలి నుంచి పొగలు రావడం గమనించారు. వెంటనే అప్రమత్తమై విమానాన్ని వెనక్కి తిప్పి అప్రాన్ మీదకు తీసుకువచ్చాడు. ఆ తర్వాత ఇంజనీర్లు వచ్చి విమానాన్ని తనిఖీ చేయగా పక్షి ఢీకొట్టిన రెక్కలో ఫ్యాన్ బ్లేడులు వంకర పోయినట్లుగా గుర్తించారు. దాని మరమ్మతుకు సమయం పడుతుందని, తాత్కాలికంగా విమానాన్ని నిలుపుదల చేస్తున్నట్లుగా అధికారులు ప్రకటించారు. ప్రయాణికులను మరో విమానంలో గమ్యస్థానాలకు పంపారు.

ఓలా ఎలక్ట్రిక్‌లో సాఫ్ట్‌బ్యాంక్ వాటా తగ్గింపు

- 2.15 శాతం వాటా విక్రయం

బెంగళూరు : ద్విచక్ర విద్యుత్ వాహనాల కంపెనీ ఓలా ఎలక్ట్రిక్‌లో జపాన్‌కు చెందిన సాఫ్ట్‌బ్యాంక్ 2.15 శాతం వాటాలను విక్రయించింది. దీంతో సాఫ్ట్‌బ్యాంక్ తన హోల్డింగ్ వాటాను 17.83 శాతం నుంచి 15.68 శాతానికి కుదించుకుందని ఓలా ఎలక్ట్రిక్ గురువారం రెగ్యులేటరీ సంస్థలకు సమాచారం ఇచ్చింది. జూలై 15 నుండి సెప్టెంబర్ 2 మధ్య జరిగిన వరుస విక్రయాల్లో ఓలా ఎలక్ట్రిక్ మొబిలిటీ లిమిటెడ్‌లోని కొన్ని ఈక్విటీ షేర్లను విక్రయించిందని పేర్కొంది. 2025 జూన్ 30 నాటికి ఓలా ఎలక్ట్రిక్‌లో సాఫ్ట్ బ్యాంక్ 17.83 కోట్ల షేర్లను కలిగి ఉంది. ఇది 78.65 కోట్ల ఈక్విటీ షేర్లలో 17.83 శాతం వాటాకు సమానం. మార్కెట్ల ముగింపునకు కొద్ది సేపు ముందు ఓలా ఈ విషయాన్ని వెల్లడించింది. మరోవైపు ఓలా ఎలక్ట్రిక్ షేర్లు 7 శాతం పతనమై రూ.64.49 వద్ద ముగిశాయి. 350సిసి లోపు ఇంజన్ సామర్థ్యం కలిగిన ద్విచక్ర వాహనాలపై జిఎస్‌టిని 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గించడం ఓలా ఎలక్ట్రిక్ షేర్లపై ఒత్తిడిని పెంచింది.

కంపెనీలు జిఎస్‌టి ఫలాలను వినియోగదారులకు బదిలీ చేయాలి

- వాణిజ్య శాఖ మంత్రి పియూష్ గోయల్

న్యూఢిల్లీ : జిఎస్‌టి కౌన్సిల్ తగ్గించిన పన్ను రేట్లను కంపెనీలు వినియోగదారులకు బదిలీ చేయాలని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పియూష్ గోయల్ అన్నారు. జిఎస్‌టి తగ్గింపు ద్వారా ఆదా అయిన ప్రతీ రూపాయిని వినియోగదారులకు అందించాలన్నారు. అదే విధంగా దేశీయ ఉత్పత్తులకు ఎక్కువ ప్రచారం కల్పించాలని సూచించారు. భారతీయుల కష్టార్జితంతో ఇక్కడి భూమిలో పండిన ఉత్పత్తులకు మద్దతును అందించాలన్నారు. స్వదేశీ ఉత్పత్తులు దేశంలోని ప్రతీ మూలకు చేరినప్పుడు అవి ఆర్థిక విలువతో పాటు దేశ స్వావలంబనను సూచిస్తాయన్నారు. జిఎస్‌టి శ్లాబులను 5, 18 శ్లాబులకు పరిమితం చేస్తూ బుధవారం జిఎస్‌టి కౌన్సిల్ తీర్మాణం చేసిన విషయం తెలిసిందే. కొత్త పన్ను రేట్లు సెప్టెంబర్ 22 నుంచి అమల్లోకి రానున్నాయి. ఈ నేపథ్యంలోనే మంత్రి పియూష్ గోయల్ తగ్గిన రేట్లను వినియోగదారులకు బదిలీ చేయాలని కంపెనీలకు, విక్రేతలకు సూచించారు.

రుణాల విస్తరణకు డిమాండ్ : ఎస్‌బిఐ ఛైర్మన్

జిఎస్‌టి కౌన్సిల్ పన్ను రేట్లను 5 శాతం, 12 శాతానికి పరిమితం చేయడం పరోక్ష పన్ను సంస్కరణల్లో ఒక మైలురాయి అని ఎస్‌బిఐ ఛైర్మన్ సిఎస్ శెట్టి అన్నారు. గతంలో 12 శాతం, 18 శాతం పన్ను విధించబడిన గృహోపకరణాలు ఇప్పుడు 5 శాతంలోకి వచ్చాయన్నారు. ఇది తక్కువ ఆదాయం కలిగిన వారికి ఉపశమనం అందిస్తుందన్నారు.. ఎక్కువ వినియోగ శక్తితో, డిమాండ్, రుణ విస్తరణ పెరిగి ఆర్థిక వృద్ధికి దోహదం చేయనుందని సిఎస్ శెట్టి అన్నారు. బీమా రంగం తక్కువ ప్రీమియంతో మెరుగైన రక్షణ కవరేజీ సహా బీమా వినిమయం విస్తరణకు దోహదం చేయనుందన్నారు. రాబోయే త్రైమాసికాల్లో జిడిపి వృద్ధికి సానుకూల ప్రభావం చూపుతుందన్నారు.

నిర్మాణ వ్యయం తగ్గనుంది : అన్‌రాక్

కేంద్ర ప్రభుత్వం జిఎస్‌టిలో మార్పులు చేస్తూ తీసుకున్న నిర్ణయం ద్వారా రియల్ ఎస్టేట్‌కు ఊతం లభించనుందని ఆ వర్గాలు పేర్కొన్నాయి. నిర్మాణ రంగంలోని పలు వస్తువుల ధరలకు సంబంధించిన శ్లాబులను మార్చడం ద్వారా ముడి సరుకుల వ్యయం తగ్గనుందని ఆన్‌రాక్ గ్రూప్ ఛైర్మన్ అనుజ్ పూరి పేర్కొన్నారు. సిమెంట్‌పై పన్నులు తగ్గడం ద్వారా నిర్మాణ వ్యయం 3-5 శాతం వరకు తగ్గనుందన్నారు.

ప్రత్యక్ష రుణ వ్యాపారంలోకి అమెజాన్

- ఆక్సియో స్వాధీనంతో ప్రవేశం

ముంబయి : ప్రముఖ ఇ-కామర్స్ కంపెనీ అమెజాన్ ఇండియా ప్రత్యక్ష రుణ జారీ వ్యాపారంలోకి అడుగుపెట్టింది. బెంగళూరు కేంద్రంగా పని చేస్తోన్న బ్యాంకింగేతర విత్త సంస్థ ఆక్సియోను స్వాధీనం చేసుకుంది. అయితే దీన్ని ఎంత మొత్తానికి కొనుగోలు చేసిందనే విషయాన్ని వెల్లడించలేదు. ఈ ఒప్పందానికి జూన్‌లోనే ఆర్‌బిఐ ఆమోదం తెలిపిందని అమెజాన్ వైస్ ప్రెసిడెంట్ మహేంద్ర నెరుర్కర్ తెలిపారు. ఫిన్‌టెక్ లెండర్ ఆక్సియో, రిటైల్ కస్టమర్లు, చిన్న వ్యాపారాలకు డిజిటల్ రుణాలు, మనీ మేనేజ్‌మెంట్ సొల్యూషన్లను అందిస్తుంది. "తమ కస్టమర్లు, చిన్న, మధ్యస్థ వ్యాపారాల అవసరాలకు కొత్త రుణ ప్రొడక్టులను ఆవిష్కరిస్తాము." అని మహేంద్ర తెలిపారు.

తగ్గిన రూపాయి విలువ

న్యూఢిల్లీ : అంతర్జాతీయ మార్కెట్‌లో రూపాయి విలువ రోజు రోజుకు పడిపోతోంది. అమెరికాతో వాణిజ్య ఒప్పందం అనిశ్చితికి తోడు దిగుమతిదారుల నుంచి డాలర్లకు డిమాండ్ పెరగడం, స్టాక్ మార్కెట్ల నుంచి ఎఫ్ఐఐలు తరలిపోవడం రూపాయి విలువ మరింత ఒత్తిడికి గురి చేసింది. ఈ పరిణామాలతో గురువారం డాలర్‌తో రూపాయి మారకం విలువ ఏకంగా 12 పైసలు క్షీణించి 88.14కు దిగజారింది. ఇంటర్‌బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజీలో డాలర్‌తో రూపాయి విలువ 88.09 వద్ద ప్రారంభమైంది. ఇంట్రాడేలో 87.85-88.19 మధ్య ట్రేడింగ్ అయ్యింది. ముడి చమురు బ్యారెల్ ధర 1.07 శాతం తగ్గి 66.88 వద్ద ముగిసింది. స్టాక్ మార్కెట్ల నుంచి ఇటీవల నిరంతరం విదేశీ సంస్థాగత పెట్టుబడుల నిధుల ఉపసంహరణ, వాణిజ్య సుంకాలపై అనిశ్చితి పెట్టుబడిదారుల విశ్వాసాన్ని దెబ్బతీసినట్లు విదేశీ మారక ద్రవ్య ట్రేడర్లు తెలిపారు.

केंद्रीय पेट्रोरसायन अभियांत्रिकी एवं प्रौद्योगिकी संस्थान (सिपेट)
(रसायन और पेट्रोरसायन विभाग रसायन और उर्वरक मंत्रालय भारत सरकार)
सिपेट CIPET

Central Institute of Petrochemicals Engineering & Technology (CIPET)

(Department of Chemicals & Petrochemicals, Ministry of Chemicals & Fertilizers, Govt. of India) Head Office, Guindy, Chennai – 600032.

Advertisement No: CIPET/CSTS/VJA/CL/2025-26/01 Dt:05-09-2025

ADVERTISEMENT FOR ENGAGEMENT OF VARIOUS MANPOWER FOR LIMITED OR FIXED PERIOD ON CONTRACT BASIS AT CIPET: CSTS, VIJAYAWADA

The Central Institute of Petrochemicals Engineering & Technology (CIPET) is a Premier National Institution in the field of Polymer Science & Technology with a focus on Academic, Technology Support, Research & Application Development. CIPET offers UG and PG programmes at its Centres located at Ahmedabad, Bhubaneswar, Chennai, Lucknow and Kochi. CIPET also offers AICTE approved Diploma, Post Diploma & Post Graduation Diploma programmes in the field of Plastics Technology, Mould Technology, Mould Design with CAD/CAM and Plastics Processing & Testing.
CIPET: CSTS, Vijayawada invites applications from the eligible candidates for contractual engagement on below mentioned positions.

Sl. No	Position(S)	Remuneration payable per month	No. of positions
1	Lecturer (Mathematics)	Rs.30,000/- to Rs.35,000/-PM	1
2	Lecturer(Plastics Engineering and Technology)		1
3	Lecturer (Physics)		1
4	Lecturer(Computer Science)		1
5	Lecturer (Chemistry)		1
6	Lecturer (English)		1
7	Placement Consultant	Rs.40,000/-PM (Consolidated Pay)	1

For detailed information on eligibility criteria, educational qualifications, experience, general terms& conditions and application form etc., please visit our website **www.cipet.gov.in.** Candidates may submit their application in online mode by logging into the link **https://cbtexam.co.in/cipet-Vijayawada/**
Date of opening of link: 07.09.2025
Date of Closing of link: 28.09.2025
Sd/, Director & Head

సంపాదకీయం

వాతలపై వెన్నపూత

ఒళ్లంతా వాతలు పెట్టి, ఆ తరువాత తీరిగ్గా ఏదో ఒక దగ్గర లేపనం రాసినట్టు- కేంద్ర ప్రభుత్వం వస్తు సేవల పన్ను (జిఎస్టీ) విధానంలో కొన్ని మార్పులు ప్రకటించింది. ఇదేదో గొప్ప ఉపశమనం, కానుక అన్నట్టుగా గత రెండు నెలల నుంచి కేంద్ర మంత్రులు మొదలు ప్రధాని మోడీ వరకూ ఊరిస్తూ వచ్చారు. బుధవారం జరిగిన 56వ జిఎస్టీ కౌన్సిల్ సమావేశంలో ఆర్థికమంత్రి కొన్ని కీలక నిర్ణయాలు ప్రకటించారు. ఇంతవరకూ నాలుగు శ్లాబుల్లో 5, 12, 18, 28 శాతాలుగా ఉన్న పన్ను విధింపును 5, 18 శాతాలకు కుదించారు. ఈ మార్పుల వల్ల రూ.48 వేల కోట్ల ఆదాయాన్ని ప్రభుత్వం కోల్పోతుందని, ఆమేరకు ప్రజలకు మేలు జరుగుతుందని చెప్పుకొచ్చారు. 'ఒకే దేశం - ఒకే పన్ను' పేరిట మోడీ ప్రభుత్వం అన్ని రకాల పన్నులను జిఎస్టీ పరిధిలోకి తీసుకొచ్చి 2017 జులై 1 నుంచి వసూలు చేస్తోంది. ఏటా 8 నుంచి 11 శాతం పెరుగుతూ 2024 - 25 సంవత్సరానికి జిఎస్టీ వసూలు రూ.22.08 లక్షల కోట్లకు చేరింది. ఐదేళ్లలో రెట్టింపు అయింది. రాష్ట్రాల నుంచి ఇంత పెద్దఎత్తున ఆదాయం పొందుతున్నా- తిరిగి ఇవ్వటంలో తీవ్ర వివక్షను ప్రదర్శిస్తున్నదన్న విమర్శలు మొదటినుంచి వినిపిస్తున్నాయి. జిఎస్టీపై రాష్ట్రాలతో తగిన సంప్రదింపులు, హామీ లేకుండానే కేంద్రం ఈ తతంగాన్ని కొనసాగిస్తోంది. అమలు మొదలై ఎనిమిదేళ్లు పూర్తయినప్పటికీ- రాష్ట్రాలు ఏకరువు పెడుతున్న సమస్యలపై సమాధానం ఇవ్వటం లేదు.

భిన్నమైన వాతావరణం, పంటలు, ఉత్పత్తులు, ప్రాధాన్యాలూ ఉన్న విశాల దేశంలో స్థానిక అవసరాలకు తగ్గట్టుగా పన్నులు తగ్గించటం, మినహాయించటం, పెంచటం వంటి అధికారం రాష్ట్రాల పరిధిలో ఉండాలన్న వాదనను మోడీ ప్రభుత్వం ఏకపక్షంగా కొట్టి పారేసి, జిఎస్టీని తీసుకొచ్చింది. తన వాటాగా సమకూరిన పన్నును ఏ రాష్ట్రానికి ఎంత ఇవ్వాలన్న అధికారాన్ని తన చేతిలో పెట్టుకొంది. ప్రతిపక్ష రాష్ట్రాలను పక్కనపెట్టి, తన రాజకీయ అవసరాలకు తగ్గట్టుగా బిజెపి పాలక రాష్ట్రాలకు అధిక నిధులు మళ్లించటం విధిగా పెట్టుకొంది. దీనిపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నా - తిట్టిపోదురు గాక నాకేటి వెరపు అన్న చందంగా వ్యవహరిస్తోంది.

జిఎస్టీ గురించి మోడీ ప్రభుత్వం గొప్పగా చెప్పుకుంటున్నా- దాన్నిండా అస్పష్టత, అమానవీయత అలముకొని ఉందని ఆర్థిక నిపుణుల విమర్శ. బతుక్కి భరోసానిచ్చుకునే మధ్య తరగతి, సామాన్య ప్రజల జీవిత బీమా, ఆరోగ్య బీమా చెల్లింపుల మీద 18 శాతం జిఎస్టీపై పలు విమర్శలు వచ్చాయి. వెన్న, నెయ్యి, పాలు వంటి వాటిపైనా 18 శాతం పన్ను విధించటం దుర్మార్గం. ఆరోగ్య రక్షణకు వాడే మందులు, వినికిడి యంత్రాల రిపేర్ల పైనా అధిక పన్నులు వసూలు చేయడం అమానవీయం. ఆఖరికి పిల్లల పుస్తకాలు, పెన్సిళ్లు, ఎరేజర్ల మీదా కర్కశంగా పన్ను పిండుకున్న ఘనత మోడీ ప్రభుత్వానిది. ఎనిమిదేళ్లుగా ఇలాంటి అన్యాయపు వసూళ్లపై రాష్ట్రాలు అభ్యంతర పెట్టినా, సామాన్యులు విన్నవించుకున్నా కేంద్ర ప్రభుత్వం మనసు ఇసుమంత కూడా కరగలేదు. ఇప్పుడు అలాంటి కొన్ని వస్తువులపై పన్ను తీసేయడమో, 5 శాతం శ్లాబులోకి మార్చటమో చేసి, ఇదంతా తమ ఘనతని, మానవీయ దృక్పథమని చెప్పుకోవటం సిగ్గుచేటు. ఈ తగ్గింపు, మినహాయింపు ఇప్పుడు న్యాయమైంది అయితే- ఇన్నేళ్లూ అన్యాయంగా వాటిపై వసూలు చేసినట్టే కదా? పొగాకు ఉత్పత్తులపై అధిక పన్ను ద్వారా వాటి వాడకాన్ని తగ్గించవొచ్చని చెబుతున్న కేంద్రం- పొగాకు వినియోగం నుంచి బయటపడ్డానికి ఉపయోగించే నికోటిన్ పోలాక్రిలెక్స్ గమ్స్‌పైనా 18 శాతం జిఎస్టీ విధించటం మతి లేని తనమే కదా? జిఎస్టీ జాబితాలో ఇప్పటికీ ఇలాంటి అర్థరహితాలు అనేకం ఉన్నాయి.

రాష్ట్రాల పరిధిలో జరిగే క్రయవిక్రయాలపై పన్ను పెత్తనం చేస్తున్న కేంద్రం - రాష్ట్రాలు కోల్పోయే ఆదాయానికి పరిహారం చెల్లింపుపై ఈ విడత కౌన్సిల్‌లోనూ తగిన హామీ ఇవ్వలేదు. విపక్ష రాష్ట్రాల ఆర్థికమంత్రులు లేవలెత్తిన ప్రశ్నలకు, సందేహాలకు సమాధానం ఇవ్వకుండానే సమావేశం ముగించారు. ఆదాయం తగ్గితే దాన్నెలా భర్తీ చేస్తారన్న చర్చకు జవాబు లేదు. ఏ రాష్ట్రమైనా తన ప్రజల అవసరాలకు తగ్గట్టుగా కొన్ని పథకాలను అమలు చేస్తుంది. రాయితీలు ఇస్తుంది. నిధులకు గ్యారంటీ లేనప్పుడు చీటికీ మాటికీ కేంద్రం దయాదాక్షిణ్యాల కోసం చేతులొగ్గి నిలబడాల్సి రావటం దేశ సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం. ఈ నెల 22 నుంచి కొన్ని వస్తువుల మీద పన్ను భారం తగ్గటం స్వాగతించదగిందే అయినప్పటికీ- రాష్ట్రాల వాటాపై స్పష్టతనివ్వకపోవటం గర్హనీయం.

మహనీయుల మాట

నువ్వు ఎంత ఇస్తున్నావనేది కాదు.
ఎంత ప్రేమగా ఇస్తున్నావనేది ముఖ్యం.

- మదర్ థెరిసా

సందర్భం

ఆధ్యాత్మికత అంటే మత విద్వేష రాజకీయం కాదని చాటిన సర్వేపల్లి

ఎం.వి.ఎస్. శర్మ

నేడు డా॥సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి. దేశమంతటా ఉపాధ్యాయుల దినోత్సవంగా ఈ రోజును పాటిస్తారు. "మా అధ్యాపక రంగం నుంచే ఆయన దేశానికి రాష్ట్రపతి అయ్యారు తెలుసా!" అంటూ గొప్పలు పోతారు. ముఖ్యంగా అధికారులు, రాజకీయ నాయకులు ఉపాధ్యాయ వృత్తి పవిత్రత గురించి ప్రసంగాలు చేస్తారు. కాని డా॥సర్వేపల్లి రాధాకృష్ణన్ భావాల గురించి, బోధనల గురించి ఎక్కువగా ఎవరూ ప్రస్తావించరు. కాని గతంలో ఎప్పటికన్నా కూడా ఇప్పుడు సర్వేపల్లి భావాల, బోధనల ప్రాధాన్యత ఎక్కువగా ఉంది. ముఖ్యంగా నేటి విద్యా వ్యవస్థలో మోడీ ప్రభుత్వం జొప్పిస్తున్న శాస్త్ర వ్యతిరేకమైన భావనల నేపథ్యంలో, అవాస్తవాల చరిత్రతో భవిష్యత్తు తరాల మెదళ్లను పాడుచేస్తున్న వాతావరణంలో ఉపాధ్యాయులు ఎటువంటి దృక్పథంతో, ఎటువంటి విలువలతో వ్యవహరించాలన్నది సర్వేపల్లి దార్శనికత నుంచి తెలుసుకోవచ్చు.

డా॥రాధాకృష్ణన్ 1888-1975 మధ్య కాలంలో జీవించారు. 1954లోనే ఆయనకు భారతరత్న బిరుదు ప్రదానం అయింది. ఆ తర్వాత 1962లో భారతదేశపు రెండవ రాష్ట్రపతిగా వ్యవహరించారు. అంతకు ముందు ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో తత్వశాస్త్ర ప్రొఫెసర్‌గా పని చేశారు. ఆయన 33వ ఏటనే భారతీయ తత్వశాస్త్రం అన్న గ్రంథాన్ని రచించారు. అప్పటివరకూ బ్రిటిష్ పాలకులు తమ విద్యా విధానం ద్వారా ఎక్కించిన ఆత్మన్యూనత నుండి భారతీయులు బైట పడడానికి కావలసిన తాత్విక భూమికను ఈ గ్రంథం ఏర్పరిచింది. డా॥రాధాకృష్ణన్ వ్యక్తిగతంగా ఆధ్యాత్మికవాది. ప్రముఖ జర్మన్ తత్వవేత్త హెగెల్ ప్రతిపాదించిన 'అఖండ భావం' అన్న దానికి, మన ప్రాచీన ఉపనిషత్తులలో సూచించిన పరమాత్మ భావానికి చాలా సామ్యం ఉందని రాధాకృష్ణన్ భావించారు. ఆయన ఆధ్యాత్మికవాది అయినా, ప్రాచీన భారతదేశంలోని తాత్విక సాంప్రదాయాలను తన గ్రంథంలో వివరించేటప్పుడు ఆ యా తత్వవేత్తల భావనలను యథాతథంగా వివరించారు. బౌద్ధం, జైనం, సాంఖ్యం, లోకాయతం వంటి భౌతికవాద దర్శనాలను కూడా అదేవిధంగా వివరించారు. అందుకే ఆ గ్రంథం విదేశీ, స్వదేశీ విశ్వవిద్యాలయాల్లో తత్వశాస్త్ర విద్యార్థులకు ఒక రిఫరెన్స్ గ్రంథంగా కొనసాగుతోంది.

> మనం గతం నుండి స్ఫూర్తిని పొందవచ్చు. అందులో నిబిడీకృతమైన భావాలు శక్తివంతమైనవి. కాని మన శరీరం, మన హృదయ స్పందన ప్రస్తుత కాలానికి సంబంధించినవి. ఈ రోజు మనం చూస్తున్న మతం అనేక యుగాలుగా సాగుతున్న మార్పుల పర్యవసానమే. కాని ఆ సంగతి మనం మరిచిపోతున్నాం. అందుచేత నేడు మనం చైతన్యవంతంగా ప్రవర్తించి ఆ మతంలో మనం కోరుకునే మార్పులను ఎందుకు తీసుకురాకూడదో సనాతనవాదులు చెప్పాలి.

ఈ మధ్య మన రాష్ట్రంలో, దేశంలో కూడా సనాతన ధర్మం గురించి చర్చ జరుగుతోంది. ఈ చర్చను హిందూ మతస్తులకు, తక్కినవారికి మధ్య చర్చ లాగా, లేక భక్తులకు, నాస్తికులకు మధ్య చర్చ లాగా దిగజార్చేందుకు కొందరు శక్తివంచన లేకుండా తాపత్రయ పడుతున్నారు. వాస్తవంగా ప్రగతికి, అభివృద్ధి నిరోధకత్వానికి మధ్య చర్చ జరగాలి. ఈ పరిస్థితుల్లో ఒక ఆధ్యాత్మికవాది అయిన డా॥ రాధాకృష్ణన్ సనాతనవాదుల గురించి ఏం రాశారో తెలుసుకోవడం అవసరం. ముఖ్యంగా ఉపాధ్యాయులు ఆ ప్రాతిపదికన తమ కర్తవ్యాన్ని నిర్ణయించుకుని నెరవేర్చడం అవసరం.

తాత్విక చింతన మానవ ప్రగతికి తోడ్పడేదిగా ఉండాలి

"తాము సాంప్రదాయ రక్షకులం అనుకునే సనాతనవాదులు 'సత్యం అనేది కాలం బట్టి మారిపోదు' అనే వాదనను ముందుకు తెస్తారు. ఒక సాయంసంధ్యలో ఉండే సౌందర్యం మాదిరిగా, బిడ్డ పట్ల తల్లి ప్రేమ మాదిరిగా అది కాలాతీతమైనదని వారు అంటారు.

సత్యం కాలంతోబాటు మారకపోవచ్చు. కాని ఏ యే రూపాల్లో ఆ సత్యం వ్యక్తం ఔతూవుంటుందో ఆ రూపాలు నిరంతరం మారుతూనే వుంటాయి. మనం గతం నుండి స్ఫూర్తిని పొందవచ్చు. అందులో నిబిడీకృతమైన భావాలు శక్తివంతమైనవి. కాని మన శరీరం, మన హృదయ స్పందన ప్రస్తుత కాలానికి సంబంధించినవి. ఈ రోజు మనం చూస్తున్న మతం అనేక యుగాలుగా సాగుతున్న మార్పుల పర్యవసానమే. కాని ఆ సంగతి మనం మరిచిపోతున్నాం. అందుచేత నేడు మనం చైతన్యవంతంగా ప్రవర్తించి ఆ మతంలో మనం కోరుకునే మార్పులను ఎందుకు తీసుకురాకూడదో సనాతనవాదులు చెప్పాలి. మన ప్రాచీన గ్రంథాలలో, ధర్మాలలో పేర్కొన్న విషయాలను యథాతథంగా పదే పదే తిరిగి ఉచ్చరిస్తూ ఆ క్రమంలో వాటి వెనుక ఉన్న స్ఫూర్తిని వదిలేయకూడదు.

నేడు ఉపాధ్యాయ దినోత్సవం

రెండు వేల సంవత్సరాల క్రితం జీవించిన మన హిందూ పెద్దలు విజ్ఞానం తక్కువ స్థాయిలో కలిగి వున్నా, చాలా కాంతివంతమైన దార్శనికతను కలిగివుండేవారు. వాళ్ళే గనుక, ఇన్ని శతాబ్దాల తర్వాత మళ్ళీ మన గడ్డ మీదకి వస్తే ఆనాడు తాము ప్రవచించిన బోధనలను నిజంగా అప్పటి స్ఫూర్తితో ఆచరిస్తున్న అనుచరులు ఒక్కరు కూడా వారికి కనపడరు.

మన చైతన్య ప్రవాహం స్వేచ్ఛగా ముందుకు సాగడానికి వీలు లేకుండా అనేక నిర్జీవ భావాలు మనల్ని ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. ఇటువంటి స్థితిలో జీవం లేని భావరూపాలను, వాటిలో ఏ కీలక సత్యమూ లేకపోయినప్పటికీ అతి పవిత్రమైనవిగాను, ఆరాధ్యదాయకమైనవి గాను పరిగణిస్తూ వాటిని ఏమాత్రమూ సవరించడానికి వీలు లేదని పట్టుబట్టడం అంటే భావాల స్వేచ్ఛా ప్రవాహాన్ని మరింత ఆటంకపరచడమే. గత కాలపు చెత్తతో విషమయమైన రోగిని (ఆ చెత్తనంతటినీ తొలగించే బదులు యథాతథంగా దానిని కాపాడితే) మరింత ఎక్కువ బాధలకు గురి చేయడమే ఔతుంది. మార్పు అవసరం అన్న సంగతి సనాతనవాదులు గ్రహించాలి. ఈ గ్రహింపు తగినంతగా వారిలో కనిపించడం లేదు. అందువలన మన తాత్విక రంగంలో ఒక పక్క లోతుల్లోకి పోయి అన్వేషించి జ్ఞానాన్ని తెలుసుకోవాలనే పట్టుదల వ్యక్తం ఔతూంటే, మరోపక్క తాత్విక రంగానికి సంబంధం లేని గందరగోళం వ్యక్తం ఔతోంది. మన ప్రాచీన విజ్ఞాన శాస్త్ర మూలాలను, ప్రాచీన విశ్వాసాల మూలాలను గ్రహించడానికి వీలు లేకుండా గందరగోళపరిచే విధంగా మధ్యలో పేరుకున్న చెత్తను తొలగించడం, శాస్త్ర విజ్ఞానపు స్ఫూర్తితో మతాన్ని సమన్వయ పరచడం నేటి భారతీయ మేధావుల ప్రధాన కర్తవ్యం.

> ఇతర ప్రజల సంస్కృతిని మనం స్వీకరించడం తప్పేమీ కాదు. వాటిని మనం జీర్ణించుకుని మనకు కావలసిన రీతిలో మలుచుకోగలగాలి. వాటిని మన స్వంత సంస్కృతితో మేళవించాలి.

> దురదృష్టవశాత్తూ కొన్ని పరిషత్‌లు సమాజం ముందున్న ప్రస్తుత సవాళ్ళను పక్కన బెట్టి, గత కాలంలోకి ఏ విధంగా జారిపోదామా అని చర్చిస్తున్నాయి. మత జ్ఞాన వ్యాప్తి ఇప్పుడు విశాల దృక్పథంతో నిర్వహించడం లేదు. గత కాలపు విజ్ఞాన వారసత్వం ఇప్పుడు ఇక ఎంతమాత్రమూ కొద్దిమంది పెట్టి పుట్టినవారి స్వంతం కాదని వారు గుర్తించాలి.

కాని దురదృష్టవశాత్తూ కొన్ని పరిషత్‌లు సమాజం ముందున్న ప్రస్తుత సవాళ్ళను పక్కన బెట్టి, గత కాలంలోకి ఏ విధంగా జారిపోదామా అని చర్చిస్తున్నాయి. మత జ్ఞాన వ్యాప్తి ఇప్పుడు విశాల దృక్పథంతో నిర్వహించడం లేదు. గత కాలపు విజ్ఞాన వారసత్వం ఇప్పుడు ఇక ఎంతమాత్రమూ కొద్దిమంది పెట్టి పుట్టినవారి స్వంతం కాదని వారు గుర్తించాలి. భావాలు శక్తివంతమైనవి. వాటిని వ్యాపించనివ్వాలి. వర్తమానం తన మృత్యువును తానే చూడకుండా ఉండాలంటే ఇది చాలా అవసరం. ఉపనిషత్తులు, గీత, బుద్ధుని బోధనలు మానవ మేధస్సును అనేక అంశాలలో సున్నితంగా స్పృశించగలిగాయి. అవి ఇప్పుడు అదే విధమైన ప్రభావాన్ని సనాతన వాదం కారణంగా చూపించలేక పోతున్నాయి. ఈ ఎండిపోయిన చెట్లకు ఇప్పుడు పూలు పూయమంటే ఏ విధంగా పూస్తాయి? ఏ విధంగా వాటినుండి ఫలాలు లభిస్తాయి?

ఒకవైపు విమానాలు, పొగ ఓడలు, రైలుబళ్ళు, టెలిగ్రాఫ్‌లు ప్రపంచంలోని మనుషులందరినీ ఒక్కటిగా చేస్తున్న కాలంలో మనం ఆ ప్రపంచంతో సంబంధం లేకుండా విడిగా మనగలమా? అందుచేత మన భావచైతన్యం ప్రపంచం సాధిస్తున్న ప్రగతికి ప్రతిస్పందించాలి. మనవంతుగా దానిని ముందుకు నడిపించాలి. నీటి ప్రవాహం లేని చెరువులు, కుంటలు నాచు, చెత్త పేరుకుపోయి పనికిరాని, హానికరమైన జీవులకు నిలయాలౌతాయి. అదే ప్రవహించే నదిని చూడండి! అనునిత్యం ముందుకు సాగుతూ కొత్త ఊటల నుండి ప్రేరణ పొందుతూ కొత్త శక్తిని పొందుతూనే వుంటుంది. ఇతర ప్రజల సంస్కృతిని మనం స్వీకరించడం తప్పేమీ కాదు. వాటిని మనం జీర్ణించుకుని మనకు కావలసిన రీతిలో మలుచుకోగలగాలి. వాటిని మన స్వంత సంస్కృతితో మేళవించాలి. ఒక జాతీయ స్థాయిలో ఈ ప్రక్రియ ఏవిధంగా జరగాలో మనకు గాంధీ, టాగూర్, అరబింద ఘోష్, భగవాన్ దాస్ వంటి నేతల రచనలు సూచిస్తున్నాయి. మన ప్రాచీన విజ్ఞానంలోని గొప్పదనాన్ని గ్రహిస్తూ, దాని నుండి ప్రేరణ పొందుతూనే పాశ్చాత్య భావనల పట్ల కూడా అమిత శ్రద్ధ ప్రదర్శిస్తూ వాటిని అధ్యయనం చేసి ఇముడ్చుకోవాలి. వర్తమాన జీవితాన్ని ఉన్నది ఉన్నట్లు చూసి అందులో జీవించే బదులు, గతంలోనే జీవించాలని కోరుకునే సనాతనవాదులకు భవిష్యత్తు ఎక్కడిది?

ఒక మూఢాచారంగా దిగజారిపోతూ, తన పరిధిని కుదించుకుంటూ వర్తమాన పరిస్థితులకు ఏ మాత్రమూ ఉపయోగపడనిదిగా మన తాత్విక చింతన ఉండాలా లేక సజీవంగా, వాస్తవికంగా, మానవ ప్రగతికి దోహదపడే అంతర్భాగంగా ఉండాలా? అన్నది మనముందున్న సవాలు. ఎంతో ఉన్నతంగా అభివృద్ధి చెందిన ఆధునిక విజ్ఞానాన్ని ప్రాచీన తత్వవేత్తల సమున్నత ఆదర్శాలను రెండింటినీ మేళవించడం మన కర్తవ్యం. వర్తమాన సమాజాన్ని ఉన్నతంగా తీర్చి దిద్దగలిగినప్పుడే, పురోగతికి తోడ్పడినప్పుడే భారతీయ తాత్వికతకు సార్థకత చేకూరుతుంది. యాజ్ఞవల్క్యుడు, గార్గి, బుద్ధుడు, మహావీరుడు, గౌతముడు, కపిలుడు, శంకరుడు, రామానుజుడు, మాధవుడు, వల్లభుడు, ఇంకా మరెందరో మహా రుషులు, మేధావులు చేసిన కృషి ఈ కర్తవ్యాన్ని మనం సాధించగలం అన్న ఆత్మవిశ్వాసాన్ని ఇస్తోంది." (ఇండియన్ ఫిలాసఫీ-వాల్యూం 2 ఆక్స్‌ఫర్డ్ ఇండియా ప్రచురణ 2008, పేజీలు 724 నుండి 727 వరకు)

తన గ్రంథం ముగింపులో డా॥రాధాకృష్ణన్ నిర్దేశించిన కర్తవ్యం ఇది. ఇదే మన ఉపాధ్యాయ, అధ్యాపక లోకానికి ముందున్న తక్షణ కర్తవ్యం. ★

అభిప్రాయం

స్కూళ్లలో 'షుగర్ బోర్డులు' పెట్టడంతో సరిపెట్టుకోవద్దు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విద్యాశాఖ ఇటీవల (ఆగస్టు 21న) రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్ళన్నిటిలో 'షుగర్ బోర్డులు' పెట్టాలని ఒక ఆదేశాన్ని జారీ చేసింది. కేంద్ర ప్రభుత్వ సి.బి.ఎస్.ఇ బోర్డు గతంలో (మే 14న) విడుదల చేసిన సర్క్యులర్ అమలులో భాగంగానే తెలుగు రాష్ట్రాల్లో కూడా ఈ బోర్డులు పెట్టేందుకు పూనుకుంటున్నారు.

పంచదార అధిక మోతాదులో వున్న జంక్ ఫుడ్స్ (అనారోగ్యకర ఆహారాలు) తినడం వల్ల పిల్లలలో ఊబకాయం, మధుమేహం ఆందోళనకర స్థాయిలో పెరిగిన రీత్యా ఈ చర్య తీసుకున్నారు. పంచదార అధిక సేవనం వల్ల కలిగే ప్రమాదాన్ని గుర్తించి, ఆ మేరకు హెచ్చరికలు జారీ చేయడాన్ని మేం స్వాగతిస్తున్నాం (ఎందుకంటే ఇప్పటి వరకు కొవ్వు ఆహారాల వల్లే జీవనశైలి వ్యాధులు వస్తున్నట్లుగాను-కొవ్వులు తగ్గించడమే సమస్యకు పరిష్కారం అన్న తప్పుడు ప్రచారం తీవ్ర స్థాయిలో వుంది.). రోజువారీగా పిల్లలు తీసుకుంటున్న కేలరీలలో పంచదార నుండి వచ్చే కేలరీలు 5 శాతానికి మించకూడదన్నది వైద్య వర్గాల సూచన కాగా మన పిల్లలు తీసుకుంటున్న ఆహారంలోని కేలరీలలో 13 నుండి 15 శాతం (3 రెట్లు) ఉన్నట్లు గుర్తించారు.

ఈ అధిక పంచదార వినియోగం బాల్యంలోనే మన భావి భారత పౌరులను రోగగ్రస్తులుగా చేసే దుస్థితి రావడం విచారకరం. 2010లోనే ఢిల్లీ హైకోర్టులో ఉదయ్ ఫౌండేషన్ అనే స్వచ్ఛంద సంస్థ ఒక ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని దాఖలు చేసి జంక్ ఫుడ్స్‌ను నిషేధించమని కోరడంతో ఈ చర్చ మొదలైంది. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ, జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్, భారతీయ ఆహార భద్రతా ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్.ఎస్.ఎస్.ఎ.ఐ), జాతీయ పోషకాహార సంస్థ వంటివి కోర్టు ముందుకు వచ్చి సంజాయిషీ ఇచ్చుకోవాల్సి వచ్చింది. 2015లో కోర్టు ఇచ్చిన తీర్పులో ఇందుకు సంబంధించిన నిర్దిష్ట నిబంధనలను రూపొందించమని పై సంస్థలను ఆదేశించింది.

నిజానికి పంచదార దట్టించిన ఆహారాలు పిల్లలలో ఊబకాయం, మధుమేహాలనే గాక దంత క్షీణత, గుండె జబ్బులు, బి.పి., మతిమరుపు, మెదడు పనితనం దెబ్బతినడం, మానసిక కుంగుబాటు (డిప్రెషన్) వంటి ఆరోగ్య సమస్యలకు కారణం అవుతున్నట్లు అనేక పరిశోధనల్లో నిర్ధారణ అయింది. అనారోగ్య సమస్యలతో పిల్లలు క్లాసు రూముల్లో అభ్యసనంపై శ్రద్ధ పెట్టలేక పోతున్నారు. మరోవైపు మన స్కూళ్ళన్నీ ఇంజనీర్లు, డాక్టర్లుగా తయారు చేసేలా ర్యాంకులు సాధించాలనే హడావిడి పెట్టి ఆటలను, వ్యాయామాలనీ వదిలివేశాయి. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలన్నీ పిల్లల శారీరక సామర్థ్యాలను పెంచాలన్న స్పృహను కోల్పోయాయి.

మే 25న మన ప్రధాని మోడీ నిర్వహించిన 'మన్ కీ బాత్' కార్యక్రమంలో షుగర్ బోర్డుల విషయాన్ని ప్రముఖంగా ప్రస్తావించి 'ఫిట్ ఇండియా' (పటుత్వం/దేహదారుఢ్యంగల పౌరులతో కూడిన భారత్)ను నిర్మించాలని పిలుపు ఇచ్చారు.

'మద్యపానం ఆరోగ్యానికి హానికరం', 'పొగ తాగడం ప్రమాదం' లాంటి హెచ్చరికలు చేస్తూనే సినిమాల్లో, టీవీలలో వాటిని మరింత ఎక్కువగా చూపుతున్నారు. 'షుగర్ బోర్డులు' కూడా ఇలాంటి మొక్కుబడి కార్యక్రమం కాకూడదని మేం భావిస్తున్నాం. స్కూళ్ళ ఆవరణల్లో జంక్‌ఫుడ్ అమ్మకాలను ఆపడంతో సరిపెట్టుకోకుండా ఈ కింది చర్యలను చేపట్టమని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరుతున్నాం.

● స్కూలు ఆవరణ, 50 మీటర్ల దూరం వరకు వీటి అమ్మకం నిషేధిస్తే సరిపోదు. ప్రమాదకరమైన ఈ ఆహారాల తయారీనే కట్టడి చేయాలి/నిషేధించాలి. ● పోషకాహార అంశాల్ని స్కూల్ సిలబస్‌లో భాగం చేయాలి. ఆహారం వండే/తయారు చేసే వర్క్ షాపులు కనీసం వారానికొకటి పిల్లలచే చేయించాలి. తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు పోషకాహార పరిజ్ఞానం తప్పనిసరిగా అందించాలి. ● మన శరీరాలకు బయో క్లాక్ వుంది. హార్మోన్లు విడుదలయ్యే క్రమానికి అనుగుణంగా ఆహార వేళలు, నిద్ర వేళలు ఉండాల్సిన అవసరాన్ని చెప్పడమే గాదు అమలుపరచాలి. అర్ధరాత్రి వరకు 'ఈట్ స్ట్రీట్'లకు రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలి. అక్కడ అమ్ముతున్న వాటిలో అత్యధికం అనారోగ్యకరమైనవే. ● స్కూలులో ఆటాడుకునే స్థలం తప్పనిసరిగా ఉండాలన్న నియమాన్ని అమలుపరచాలి. ప్రతిరోజు ఆటలకు, వ్యాయామానికి తగిన సమయం స్కూల్ టైమ్ టేబుల్‌లో కేటాయించాలి. వ్యాయామ విద్య చదువులో అంతర్భాగం కావాలి. దేహ దారుఢ్యంతోనే, మనో వికాసం ముడిపడి వుందన్న అంశానికి ప్రాధాన్యత ఇవ్వాలి.

ప్రజారోగ్య రంగంలో పనిచేస్తున్న వైద్యులుగా, పిల్లల సమగ్ర అభివృద్ధి పట్ల శ్రద్ధ వున్న వారిగా మేం ఈ విజ్ఞాపనను ముందు పెడుతున్నాం. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ఆరోగ్యకర పిల్లలతో కూడిన దేశ నిర్మాణం కోరే వారంతా మాతో గొంతు కలపాలని కోరుతున్నాం.

- **డా॥ కె.శంకర్,** పూర్వ రిజిస్ట్రార్, ఎన్‌టిఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, విజయవాడ.
- **డా॥ పి.వి.సత్యనారాయణ,** కార్డియో థొరాసిక్ సర్జన్, ఎల్‌సిహెచ్‌ఎఫ్ డైట్ ప్రచారకులు, హైదరాబాద్.
- **డా॥ ఘంటా వెంకట్రావు,** సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్, విజయవాడ.
- **డా॥ గోపాలం శివన్నారాయణ,** న్యూరాలజిస్టు, విజయవాడ. రాష్ట్రవ్యాపిత మెడికల్ క్యాంపుల నిర్వాహకులు.
- **డా॥ దాసరి రామకృష్ణ ప్రసాద్,** ప్రజా వైద్యులు, స్వచ్ఛ చల్లపల్లి నిర్వాహకులు.
- **డా॥ బి. రాజేశ్వరరావు,** సూపరింటెండెంట్, పీపుల్స్ పాలీక్లినిక్, నెల్లూరు.

మరియు పలువురు వైద్యులు, పిల్లల ప్రేమికులు.

సెటైర్

బాబయ్యా! యూరియా!!

"మనుసున్న మా రాజా! బస్తా యూరియా.. బాబయ్యా! "

"ఈ బిచ్చ అరుపులే నాకు నచ్చవు. నేను ఎప్పుడో చెప్పాను.. వ్యవసాయం దండగ అని.. నా మాట ఎప్పుడూ విని చచ్చారు గనక మీరు! "

"పొరపాటైపోయింది బాబయ్యా.. అందుకేనా బాబయ్య.. 99 పైసలకే ఎకరా ఇచ్చేస్తున్నారు! ఇసిత్రం బాబయ్యా.. మీ పెద్ద మనసు మాకు అర్థం కాలేదు. మా ప్రేంతంలోనైతే బాబయ్యా.. ఎకరా 10 నుంచి పాతిక లచ్చల వరకూ పలుకుతోంది బాబయ్యా! "

"చాల్లే.. బోడి లక్షలు.. కోట్ల రూపాయల విలువ గల భూములే తీసుకుంటున్నాం లే "

"అన్నేయం బాబయ్యా! కాకుల్ని కొట్టి గద్దలకేసేస్తున్నారు. "

"ఓయ్..ఏంటా పెంకి మాటలు..తోక కత్తిరించేస్తాను జాగ్రత్త! పంటలు తగ్గిపోవాలి.. ఫ్యాక్టరీలు, కంపెనీలు పెరిగిపోవాలి.. బంగారు ఆంధ్రను చేయాలన్నదే నా తపన. మీలాంటి వాళ్లకు నా ఆలోచనలు ఏం అర్థమవుతాయిలే! "

"అవునా! బాబయ్యా.. బంగారాంధ్రా! తమరు తల్సుకున్న నుంచే గావాలా! బంగారం ధర లచ్చ రూపాయలు దాటేసింది. బాబయ్యా.. బంగారం.. సింగారం మాకొద్దు.. బస్తా యూరియా ఇప్పించండయ్యా! "

"చూడూ! నీ అమాయకత్వం చూస్తుంటే నాకు జాలేస్తుంది. ప్రశాంతంగా చెబ్తాను.. నువ్వూ అంతే ప్రశాంతంగా విను"

"హమ్మయ్య.. మీరు శాంతంగా.. సిట్టి సిట్టి నవ్వులతో మాట్లాడితేనే అందంగా ఉంటారయ్యా!.. సందమామ మొకం కందగడ్డ లాగా అయిపోతే, సూడగలమా!? "

"చూడు, నీ పేరేంటి? "

"అప్పన్న బాబయ్య.. సిమ్మాద్రప్పన్న "

"చూడు అప్పన్నా! నేనూ రైతు బిడ్డనే.. నాకు రైతు కష్టాలు తెలుసు "

"ఎన్నెకరాలుండేవి బాబయ్యా? "

"రెండెకరాలు "

"ఉంచారా.. ఏ ఫేక్టరీ వాడికో.. కంపెనీ వాడికో ఇచ్చీసినారా!? "

"ఉంచాను లేవయ్యా! తల్లితండ్రుల కష్టార్జితం కదా! వాళ్ల గుర్తుగా ఉంచాను.. కొంచెం పెంచాను లే!"

"అద్గదీ.. కొడుకంటే అలాగుండాల.. మా గుంటలూ ఉన్నారు! డాక్టేరు సదువుతానని ఒకడు.. ఇంజనీరు అయిపోతానని మరొకడు.. భూముల అమ్మీసి మదుపెట్టీమంటన్నారు. పెట్టడానికి ఇదేటి పంటా! కాదు పొమ్మనీసినాను."

"నీకెంత భూమి ఉందయ్యా!"

"పదెకరాలుండీది బాబయ్యా.. ఇరవై సమచ్చరాలు అయిపోతుంది గావాలా! ఏదో కంపెనీకని పెబుత్వం వారు, ఆయిదెకరాలు లాక్కున్నారు."

"అది లాక్కోవడం కాదు. ల్యాండ్ అక్విజిషన్ అంటారు. మేము ల్యాండ్ పూలింగ్ అనే కొత్త ఆలోచన కూడా చేశాంలే!"

"ఇంకా, ఇలాంటి గొప్ప ఆలోసనలు ఎన్ని ఉన్నాయో తమ బుర్రలో! అయితే బాబయ్యా.. ఏళ్లు గడిసి పోతున్నాయి గానీ, ఎవుడూ వచ్చి అక్కడ తట్టడు ఇటుక బిడ్డలు ఎయ్యడు.. పోనీ, కంపెనీ కట్టకపోతే, తిరిగి మా భూములు మాకు ఇచ్చెయ్యండి.. ఆనాడు మాకు ఇచ్చిన డబ్బు మీకు తిరిగి ఇచ్చేస్తాము.. అని నెత్తి బాదుకుంటన్నా.. ఎవుడూ కుయ్ అనడూ..కయ్ అనడూ"

"సరే సరే.. ఇప్పుడు ఆ టాపిక్ ఎందుకు గానీ.. నేను చెప్పే కొన్ని మంచి మాటలు విను అప్పన్నా! వింటే, నువ్వే కాదు.. మన రాష్ట్రంలో రైతులందరూ బాగుపడతారు"

"అంతకన్నా మా రాజా"

"మా తాత పొగాకు పండించాడు.. మా తండ్రి మిరప పండించాడు.. మా పినతండ్రి ఉల్లిపాయలు పండించాడు.. మేమూ అవే వేస్తాం.. అంటే కుదరదు.. వేసినవి వేసేసి.. మా పంటకు గిట్టుబాటు ధర లేదు.. అని, రోడ్డెక్కి కేకలేస్తే అస్సలు కుదరదు"

"మరేటి పండించాలి బాబయ్యా? "

"డబ్బులు వచ్చే పంటలే పండించాలి. దేనికి డిమాండ్ ఉందో, అదే పండించాలి. ప్రభుత్వం మీద పడి ఏడవకూడదు. అర్థమైందా! "

"కాలేదు గానీ.. కాలేదంటే తమరు ఒప్పుకుంటారేటి! సరే బాబయ్య.. మిగిలిపోయిన ముక్కలేమైనా .. ఉంటే సెప్పీయండి "

"వ్యవసాయం గిట్టుబాటు కాదని ఎన్నిసార్లు చెప్పినా, రైతులు వినిపించుకోవడం లేదు.. అందుకే, ఫ్యాక్టరీలు.. కంపెనీలు.. ఇతర రంగాల కోసం పెద్ద ఎత్తున భూములు స్వాధీనం చేసుకుని వ్యవసాయాన్ని తగ్గిస్తున్నాను"

"అయితే, మేమేటైపోవాలి బాబయ్యా?"

"మీ భూములకు నష్టపరిహారం ఇస్తాం.. దాంతో వ్యాపారాలు చేసుకోవచ్చు.. మీ పిల్లలకు ఉపాధి కల్పిస్తాం.. మీ కుటుంబం కలకాలం సంతోషంగా బతకొచ్చు "

"మా గుంటల్లో ఒకడు ఇంటరూ, మరొకడు డిగ్రీ సదివి.. మూడుసార్లు డింకి కొట్టేసినారు.. ఆళ్ళకి ఏమి ఉజ్జోగాలొత్తాయి బాబయ్యా?"

"గేటు ఎత్తడం, దించడం నుంచి.. కాఫీ, టీలు అందించడం వరకూ.. ఎన్నో ఉద్యోగాలు.. ఉపాధి అవకాశాలు.. నో ప్రాబ్లం.. డోంట్ వర్రీ.. "

"మా భూములు మాకు ఉంచితే, మా గుంటలు గవురవుంగా... మాలాగా, యెవసాయం సేసుకుంటారు గదా!"

"అదిగో.. మళ్లీ అదే మాట.. వ్యవసాయం అనే మాట మరచిపోవాలని చెప్పాను కదా.. ఇంకా ఎంతకాలం సాయం? ఇంటికి ఒక లక్షాధికారిని తయారు చేయడమే నా లక్ష్యం.."

"శానా గొప్ప బుర్ర బాబయ్యా తమది.. అవన్నీ తర్వాత.. ముందు యూరియా ఇప్పించండి బాబయ్యా "

"అదిగో.. మళ్లీ అదే మాట! మీకు ఎవరికి తెలియదు ఒక విషయం.. సైంటిస్టులు నాకు చెప్పారు"

"ఏటి బాబయ్యా అది! "

"పంటలకు ఎక్కువగా యూరియా వాడితే, ప్రజల ఆరోగ్యానికి ప్రమాదం అని!"

"అందుకేనా బాబయ్యా! దొరక్కుండా సేసేస్తున్నారా!! "

"చివరిగా ఒక మాట చెప్పి వెళ్ళిపోతాను.. అవతల నాకు చాలా మీటింగులున్నాయి "

"సెప్పండి బాబయ్యా "

"వరి పండించడం కూడా బాగా తగ్గించాలి "

"ఓరి దేముడా! మరి పెజలేటి తిని బతకాల! .. బియ్యమిచ్చి గెంజి అడుక్కున్నట్టే ! బాబయ్యా.. ఎలిపోతున్నారా! యూరియా బాబయ్యా.. బస్తా యూరియా బాబయ్యా..బాబయ్యా!!!"

- 'నల్లి' కుట్టు

కరేడు రైతులకు మద్దతు తెలపొచ్చు

• రామచంద్ర యాదవ్‌కు హైకోర్టు అనుమతి

ప్రజాశక్తి-అమరావతి

నెల్లూరు జిల్లా ఉలవపాడు మండలం కరేడు గ్రామపరిధిలో ఏర్పాటు చేస్తున్న ఇండోసోల్ పరిశ్రమ కోసం చేపట్టిన భూసేకరణ ప్రక్రియను వ్యతిరేకిస్తున్న రైతులకు మద్దతుగా కరేడుకు వెళ్లేందుకు భారత చైతన్య యువజన పార్టీ అధ్యక్షుడు బోడే రామచంద్ర యాదవ్‌కు హైకోర్టు షరతులతో కూడిన అనుమతి ఇచ్చింది. కరేడులోని రైతులకు సంఘీభావం తెలిపేందుకు, జైలులోవున్న వారిని పరామర్శించేందుకు పోలీసులు అనుమతినివ్వకపోవడాన్ని సవాలు చేస్తూ బోడే రామచంద్రయాదవ్ సవాల్ చేసిన పిటిషన్‌లో జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప గురువారం ఉత్తర్వులను జారీ చేశారు. ఈ నెల 14న ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల మధ్య గ్రామస్తులతో సమావేశం అవ్వొచ్చు. యాదవ్‌తోపాటు ఆరు కార్లకు అనుమతిచ్చింది. వందమందికి మించకుండా గుమిగూడరాదని చెప్పింది. సమావేశాన్ని పోలీసులు వీడియో రికార్డింగ్ చేయాలని తెలిపింది. రెచ్చగొట్టే ప్రసంగాలు, కుల ప్రస్తావనలు చేయరాదని పేర్కొంది.

భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక

ధవళేశ్వరం వద్ద స్వల్పంగా పెరుగుదల

ధవళేశ్వరం కాటన్‌బ్యారేజీవద్ద సముద్రంలోకి విడుదలవుతున్న వరద నీరు

ప్రజాశక్తి - యంత్రాంగం

గోదావరికి వరద తగ్గినట్లు తగ్గి మరలా క్రమంగా పెరుగుతోంది. గురువారం తెల్లవారుజామున 43.2 అడుగులకు నీటి మట్టం చేరుకోవడంతో అధికారులు మళ్లీ మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. మధ్యాహ్నానికి 44.2 అడుగులకు చేరి, అనంతరం తగ్గుముఖం పట్టింది. సాయంత్రానికి 43.10 అడుగులకు చేరుకుంది. ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద స్వల్పంగా వరద ప్రవాహం పెరిగింది. ప్రస్తుతం బ్యారేజీ వద్ద 11.10 అడుగుల నీటి మట్టం నమోదైంది. బ్యారేజీకి చెందిన 175 గేట్లను ఎత్తి 8,90,669 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. సాగు, తాగునీటి అవసరాల నిమిత్తం తూర్పు, మధ్య, పశ్చిమ డెల్టా ప్రధాన కాలువలకు 12,200 క్యూసెక్కులు విడిచి పెడుతున్నారు. గోదావరి ఎగువన వర్షాలు కురుస్తుండడంతో రెండు, మూడు రోజుల పాటు ఇదే పరిస్థితి ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు వద్ద శబరి నీటి మట్టం బుధవారం కంటే మూడు అడుగులు తగ్గి 31 అడుగుల వద్ద నిలకడగా ఉంది. కుయుగూరు వాగు ఉధృతి తగ్గడంతో ఆంధ్ర, ఒడిశా రహదారి సౌకర్యం మెరుగుపడింది. ఏలూరు జిల్లాలోని కుక్కునూరు మండలంలో కుక్కునూరు-దాచారం మధ్య గుండేటి వాగు కాజ్వే, ముత్యాలంపాడు-వింజరం మధ్య పాలవాగు కాజ్‌వే, వేలేరుపాడు మండలంలోని ఎద్దువాగు కాజ్‌వే ముంపులోనే ఉన్నాయి. పోలవరం ప్రాజెక్టులోకి అదనంగా వస్తున్న 9,31,017 క్యూసెక్కుల జలాలను అధికారులు దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు స్పిల్‌వే ఎగువన 32.350 మీటర్లు, స్పిల్‌వే దిగువన 23.740 మీటర్లు, ఎగువ కాఫర్‌డ్యామ్ ఎగువన 33.100 మీటర్లు, దిగువ కాఫర్ డ్యామ్ దిగువన 23.300 మీటర్లు, ఎగువ, దిగువ కాఫర్ డ్యాముల మధ్య 16.020 మీటర్ల నీటిమట్టం నమోదైనట్లు జలవనరుల శాఖాధికారులు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లాలో ఉగ్రరూపం దాల్చిన వశిష్ట గోదావరి క్రమంగా తగ్గుముఖం పడుతోంది.

శ్రీశైలం మూడుగేట్ల ద్వారా నీరు విడుదల

శ్రీశైలం జలాశయానికి ఎగువ ప్రాంతాల నుండి వరద ప్రవాహం కొనసాగుతోంది. జూరాల నుండి 97,252 క్యూసెక్కులు, సుంకేసుల ద్వారా 67,872 క్యూసెక్కులతో కలిపి శ్రీశైలానికి 1,65,124 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. నీటి నిల్వలను పాటిస్తూ మూడు గేట్లను పది అడుగుల మేర ఎత్తి 82,710 క్యూసెక్కులను దిగువ సాగర్‌కు విడుదల చేస్తున్నారు. జలాశయ నీటిమట్టం 885 అడుగులకు గాను ప్రస్తుతం 883.90 అడుగులకు చేరింది. నీటి నిలువ సామర్థ్యం 216 టిఎంసిలకు గాను ప్రస్తుతం 209.15 79 టిఎంసిలుగా నమోదయింది.

రిలయన్స్‌కు భూములు అప్పగించండి

• కలెక్టర్లకు సిఎస్ ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో రిలయన్స్ ఆధ్వర్యంలో రూ.65 వేల కోట్లతో కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్లు ఏర్పాటుకు అవసరమైన భూములను త్వరితగతిన అప్పగించాలని జిల్లా కలెక్టర్లను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఆదేశించారు. సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ.. రిలయన్స్ సంస్థకు 9 జిల్లాల్లో 2.34 లక్షల ఎకరాల భూమిని అప్పగించాలని చెప్పారు. వృధాగా పోతున్న వర్షపు నీటిని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకుని అన్ని చెరువులను పూర్తిగా నింపేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వర్షపు నీటి సంరక్షణ భూగర్భ జలాలు పెంపును కలెక్టర్లు బాధ్యతగా తీసుకోవాలని చెప్పారు. యూరియా, పరిశ్రమలు, గురుకులాలు, కెజిబివిలు తదితర అంశాలపై ఈ సమావేశంలో కలెక్టర్లకు సూచనలు ఇచ్చారు. వర్చువల్‌గా జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ హాజరయ్యారు, వ్యవసాయ శాఖ స్పెషల్ సిఎస్ బి.రాజశేఖర్, డైరెక్టర్ ఢిల్లీరావు, సమాచార శాఖ డైరెక్టర్ హిమాన్షు శుక్లా, ఆర్టీజిఎస్ సిఇఒ ప్రఖర్‌జైన్ పిఆర్ అండ్ ఆర్డీ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యూరియాకోసం ఆందోళన చేసినా తప్పేనా?

• సజ్జల రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో యూరియా లేక రైతులు ఆందోళన చేస్తుంటే దాన్ని కూడా ఫేక్ న్యూస్‌గా ప్రచారం చేయడం ఎంతవరకు సమంజసమని వైసిపి రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి ప్రశ్నించారు. గురువారం తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కృష్ణాజిల్లా చినముత్తేవిలో రైతులు రోడ్డుపై బైఠాయించి ఆందోళన నిర్వహించి అక్రమంగా తరలిస్తున్న యూరియా లారీని ఆపారని పేర్కొన్నారు. పోలీసులు లారీని సీజ్ చేశారని పేర్కొన్నారు. విజిలెన్స్ చేయాల్సిన పనిని రైతులు చేశారని పేర్కొన్నారుజ ఈ ఆందోళనలో టిడిపి, జనసేన నాయకులు కూడా ఉన్నారని తెలిపారు. దీన్ని కూడా ఫేక్ న్యూస్‌గా ప్రచారం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అలాగే సజ్జల భార్గవరెడ్డిపై లిక్కర్ స్కాములో సిఐడి అధికారులు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో ప్రజల సమస్యలపై ప్రభుత్వానికి దృష్టిలేదని రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని మాత్రమే అమలు చేస్తున్నారన్నారు.

ఆర్‌టిడి రెన్యువల్ లేదు : తలారి రంగయ్య

అనంతపురంలో రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు (ఆర్‌డిటి)ని రెన్యువల్ చేయలేదని, జిల్లాకు నీళ్లు కూడా ఇవ్వలేదని, ఏమి చూసుకుని సక్సెస్ మీట్ నిర్వహిస్తున్నారో చెప్పాలని మాజీ ఎంపి తలారి రంగయ్య ప్రశ్నించారు. ఏం సక్సెస్ సాధించారని బహిరంగ సభ నిర్వహిస్తున్నారో చెప్పాలన్నారు. కుప్పానికి నీళ్లు తీసుకెళుతూ అనంతపురానికి మొండిచేయి చూపారన్నారు. ఎయిమ్స్‌ను మంగళగిరికి తరలించారని విమర్శించారు. టికెట్లు, పదవుల పంపకాలకే టైము సరిపోతోందని, ప్రజా సమస్యల పరిష్కారం పట్టడం లేదని వివరించారు.

హత్యాయత్నం కేసు కొట్టేయండి

• మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి పిటిషన్

ప్రజాశక్తి-అమరావతి

నెల్లూరు జిల్లా జలదంకి పోలీసులు నమోదు చేసిన హత్యాయత్నం కేసును కొట్టేయాలని కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు గురువారం విచారించింది. కేసు డైరీ, ఇతర వివరాలను కోర్టు ముందుంచాలని పోలీసులను ఆదేశించింది. విచారణను ఈ నెల 10కి వాయిదా వేస్తూ జస్టిస్ యడవల్లి లక్ష్మణరావు ఆదేశాలను జారీ చేశారు. లాయర్ విఆర్ మాచవరం వాదిస్తూ, రాజకీయ కక్షతో దురుద్దేశంతో కేసు బనాయించారని చెప్పారు. హత్యాయత్నంతోపాటు ఎస్‌సి, ఎస్‌టి చట్టం నమోదు చేసిన సెక్షన్లు వర్తించవని, సంబంధం లేని కేసులో నిందితుడిగా చేర్చారని అన్నారు. పోలీసుల తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ ప్రతివాదన చేస్తూ, సిట్టింగ్ ఎమ్మెల్యేను హత్య చేయించేందుకు పిటిషనర్ కుట్ర పన్నారనేది తీవ్ర అభియోగమని, ఆధారాలు ఉన్నాయని చెప్పారు. ఫిర్యాదుదారుడి వాదనలు వినాల్సివుందన్నారు. పిటిషనర్ శ్రీలంకలో ఉన్నట్లు పోలీసులు గుర్తించారన్నారు.

సైన్స్‌కోర్సుల్లో అంధ విద్యార్థులకు అనుమతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అంధ విద్యార్థులు ఇంటర్మీడియట్‌లో సైన్స్ కోర్సులు చదివేందుకు రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఇందుకు సంబంధించిన జిఒ 278ను పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ గురువారం విడుదల చేశారు. ఈ విద్యాసంవత్సరం నుంచి అంధ విద్యార్థులు ఇంటర్మీడియట్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, మేథమేటిక్స్ వంటి కోర్సుల్లో చదువుకోవచ్చునని పేర్కొన్నారు. ప్రాక్టికల్స్ స్థానంలో విద్యార్థులకు బహుళ ఎంపిక ప్రశ్నాపత్రం అందిస్తామని పేర్కొన్నారు. దృష్టిలోపం విద్యార్థుల భవిష్యత్తుకు అడ్డు కాకూడదని, మిగిలిన విద్యార్థులతో వీరికి సమానంగా అవకాశాలు కల్పించడానికి మంత్రి నారా లోకేష్ ప్రత్యేక చొరవ చూపారని మంత్రి కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. సైన్స్ కోర్సుల్లో అవకాశం కల్పించాలని విద్యార్థులు కోరడంతో మంత్రి ఈమేరకు చొరవ తీసుకున్నారని పేర్కొంది.

'ప్రీతి' కుటుంబాన్ని బెదిరించిన వారిపై చర్యలు

మహిళా సంఘాల ఐక్యవేదిక డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సుగాలి ప్రీతి కుటుంబ సభ్యులను బెదిరిస్తూ, కులం పేరు ప్రస్తావిస్తూ అవమానించిన జనసేన నాయకుడిపై కేసు నమోదు చేసి, తక్షణమే చర్యలు తీసుకోవాలని మహిళా సంఘాల ఐక్య వేదిక డిమాండ్ చేసింది. బాధిత కుటుంబం న్యాయం కోసం ప్రశ్నిస్తే కులం పేరిట హేళన చేసిన జన సేన నాయకులు గాదె వెంకటేశ్వరరావుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి, మహిళా కాంగ్రెస్ నాయకులు సుంకర పద్మశ్రీ, ఎన్ఎఫ్ఐడబ్ల్యు రాష్ట్ర కార్యదర్శి పి.దుర్గాభవాని, పిఒడబ్ల్యు రాష్ట్ర నాయకులు పి.పద్మ, వాసవ్య మహిళా మండలి ప్రతినిధి కీర్తి, ఐప్వా రాష్ట్ర కార్యదర్శి నాగమణి గురువారం సంయుక్త ప్రకటన విడుదల చేశారు. ప్రీతి తల్లి ఆవేదన అన్ని కుటుంబాలకు ఆవేదనగా ఉందని పేర్కొన్నారు. 10వ తరగతి చదివే బాలిక వసతి గృహంలో చనిపోయిందని, పోస్ట్‌మార్టంలో హత్యగా చెప్పినా, విచారణలో సాక్ష్యాలను మాయం చేశారని విమర్శించారు. మాయం చేసిన వారిని విచారించకుండా బాధితులకు భూమిచ్చామని, డబ్బులిచ్చామని, ఉద్యోగం ఇచ్చామని, వాటిని తిరిగి ఇచ్చేయాలనే హక్కు నాయకులకు ఎవరిచ్చారని ప్రశ్నించారు. న్యాయం అడగకుండా ఉండేందుకే పరిహారం, ఉద్యోగం ఇచ్చారా? నిందితులను అరెస్టు చేయాలని కోరడం నేరమా? అని ప్రశ్నించారు. ఇష్టం వచ్చినట్లు నోరు పారేసుకోవడం సరైంది కాదన్నారు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తన పర్యటనలో ప్రీతి కుటుంబానికి పరిహారం ఇచ్చామని చెప్పడం దిగజారుడుతనానికి నిదర్శనమని పేర్కొన్నారు.

వృద్ధుని హత్య కేసులో ఎనిమిదిమంది అరెస్టు

ప్రజాశక్తి - పలాస

శ్రీకాకుళం జిల్లా పలాస మండలంలోని కేశుపురంలో చేతబడి నెపంతో వృద్ధుడు ఉంగ రాములు హత్య ఘటనలో ఎనిమిది మంది నిందితులను అరెస్టు చేశామని కాశీబుగ్గ సిఐ పి.సూర్యనారాయణ తెలిపారు. కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. కేశుపురానికి చెందిన అంబలి తులసీరావు కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఎవరో చేతబడి చేశారని భావించి... రాములు ఇంటి వైపు చూపించి ఈ వీధిలో ఉన్న వ్యక్తే చేతబడి చేశాడని చెప్పాడు. దీంతో కోపోద్రిక్తులైన తులసీరావు కుటుంబీకులు, బంధువులు అయిన సరియావల్లి రాజ్ కుమార్, అంబలి తులసీరావు, అంబలి చంద్రశేఖర్, అంబలి భీమారావు, బుడ్డ తేజేశ్వరరావు, బుడ్డ లక్ష్మీకాంతం, కోనారి సూర్యనారాయణ, అంబలి వెంకటలక్ష్మి రాములు ఇంటికి వెళ్లి ఈడ్చుకుంటూ బయటకు తీసుకొచ్చి రాళ్లు, కర్రలతో విచక్షణారహితంగా దాడి చేశారు. రాములు మనవడు చరణ్ కుమార్ ఎంత వారించినా పట్టించుకోకుండా దాడికి పాల్పడ్డారు. ఎనిమిది మందిని అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరుస్తున్నట్లు తెలిపారు. తొమ్మిదో నిందుతుడు పొందూరు గణపతి అలియాస్ రెయ్యమ్మ దాసుడును విచారణ అనంతరం అరెస్టు చేయాల్సి ఉందన్నారు. సమావేశం లో కాశీబుగ్గ ఎస్ఐ నర్సింహమూర్తి పాల్గొన్నారు.

ICICI Bank | రిజిస్టర్డు ఆఫీసు: ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్, ల్యాండ్‌మార్క్, రేస్ కోర్స్ సర్కిల్, వడోదర-390007.
కార్పొరేట్ ఆఫీసు: ఐసిఐసిఐ బ్యాంక్ టవర్స్, బంద్ర-కుర్ల కాంప్లెక్స్, బంద్ర (ఈస్ట్), ముంబయి-400051.
బ్రాంచి ఆఫీసు: ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్, 4/10, మైత్రీ టవర్, బొమ్మన్‌హల్లి హొసర్ మెయిన్ రోడ్, కర్నాటక-560068.

మరణించిన రుణగ్రహీత యొక్క చట్టబద్ధ వారసుల డిస్‌క్లోజర్ కొరకు నోటీసు
బహిరంగ ప్రకటన.

ఇందుమూలంగా ప్రకటన ఇవ్వడమేమనగా, గృహ రుణం LBGTR00006414625 (రుణ సదుపాయం)ను ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ (ది బ్యాంక్)వారిచేత మరణించిన రుద్ర శ్రీనివాస రావు తోపాటు రుద్ర నరసింహా రావుకు మంజూరుచేయబడినది.
మేము మీకు తెలియజేయదలచినది ఏమనగా, రుద్ర శ్రీనివాస రావు మరణించారని బ్యాంకు అధికారులచేత నిర్వహించబడిన ఫీల్డ్ విజిట్స్ లో మరియు రిజిస్టరైన ఫోన్ నంబర్లులో మా దృష్టికి వచ్చింది. ఈ విషయంలో మరణించిన రుణగ్రహీత యొక్క చట్టబద్ధ వారసులుకు సంబంధించిన సమాచారం సమకూర్చుట కొరకు మరణిచిన రుద్ర శ్రీనివాస రావు మరియు రుణగ్రహీతల రిజిస్టర్డు చిరునామాలకు తేది 03.09.2025నాటి లేఖ పంపబడినది.
కావున, ఈ ప్రకటన ప్రచురణ యొక్క 15 రోజుల్లోగా, బ్యాంకు వారి రికార్డుల అప్‌డేటింగ్ కొరకు మద్దతు పత్రాలతో మరణించిన రుద్ర శ్రీనివాస రావు యొక్క చట్టబద్ధ వారసుల వివరాలను మాకు తెలియజేయగలరు.
మీరు పై-పేర్కొన్న వివరాలను ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్, డోర్ నం.37-1-187, కొత్త వీధి, బాపూజి కాంప్లెక్ష్ ఎదురుగా, అడ్డంకి బస్టాప్, ఒంగోలు, ఆం.ప్ర-523001 ను దర్శించుట ద్వారా సయ్యద్. ఎ కు దాఖలుచేయగలరు.

తేది: సెప్టెంబర్ 05, 2025, | అధికృత అధికారి,
ప్రదేశం: గుంటూరు. | ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ తరపున.

ICICI Bank | రిజిస్టర్డు ఆఫీసు: ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్, ల్యాండ్‌మార్క్, రేస్ కోర్స్ సర్కిల్, వడోదర-390007.
కార్పొరేట్ ఆఫీసు: ఐసిఐసిఐ బ్యాంక్ టవర్స్, బంద్ర-కుర్ల కాంప్లెక్స్, బంద్ర (ఈస్ట్), ముంబయి-400051.
బ్రాంచి ఆఫీసు: ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్, 4/10, మైత్రీ టవర్, బొమ్మన్‌హల్లి హొసర్ మెయిన్ రోడ్, కర్నాటక-560068.

మరణించిన రుణగ్రహీత యొక్క చట్టబద్ధ వారసుల డిస్‌క్లోజర్ కొరకు నోటీసు
బహిరంగ ప్రకటన.

ఇందుమూలంగా ప్రకటన ఇవ్వడమేమనగా, గృహ రుణం LBTEN00005185675 /LBTEN00005188701 (రుణ సదుపాయం)ను ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ (ది బ్యాంక్)వారిచేత మరణించిన అవుటు తేజశ్వర రెడ్డి తోపాటు అవుటు వెంకట పద్మావతి కు మంజూరుచేయబడినది.
మేము మీకు తెలియజేయదలచినది ఏమనగా, అవుటు తేజశ్వర రెడ్డి మరణించారని బ్యాంకు అధికారులచేత నిర్వహించబడిన ఫీల్డ్ విజిట్స్ లో మరియు రిజిస్టరైన ఫోన్ నంబర్లులో మా దృష్టికి వచ్చింది. ఈ విషయంలో మరణించిన రుణగ్రహీత యొక్క చట్టబద్ధ వారసులుకు సంబంధించిన సమాచారం సమకూర్చుట కొరకు మరణిచిన అవుటు తేజశ్వర రెడ్డి మరియు రుణగ్రహీతల రిజిస్టర్డు చిరునామాలకు తేది 03.09.2025నాటి లేఖ పంపబడినది.
కావున, ఈ ప్రకటన ప్రచురణ యొక్క 15 రోజుల్లోగా, బ్యాంకు వారి రికార్డుల అప్‌డేటింగ్ కొరకు మద్దతు పత్రాలతో మరణించిన అవుటు తేజశ్వర రెడ్డి యొక్క చట్టబద్ధ వారసుల వివరాలను మాకు తెలియజేయగలరు.
మీరు పై-పేర్కొన్న వివరాలను ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్, డోర్ నం.37-1-187, కొత్త వీధి, బాపూజి కాంప్లెక్ష్ ఎదురుగా, అడ్డంకి బస్టాప్, ఒంగోలు, ఆం.ప్ర-523001 ను దర్శించుట ద్వారా సయ్యద్. ఎ కు దాఖలుచేయగలరు.

తేది: సెప్టెంబర్ 05, 2025, | అధికృత అధికారి,
ప్రదేశం: గుంటూరు. | ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ తరపున.

ICICI Bank | **రిజిస్టర్ ఆఫీస్:** ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్. ల్యాండ్‌మార్క్, రేస్ కోర్స్ సర్కిల్, వడోదర- 390007
కార్పొరేట్ ఆఫీస్: ఐసిఐసిఐ బ్యాంక్ టవర్స్, బాంద్రా-కుర్లా కాంప్లెక్స్, బాంద్రా (ఈ), ముంబయి- 400051
బ్రాంచ్ ఆఫీస్: ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్, 4/10, మైత్రీ టవర్, బొమ్మన్‌హల్లి హౌస్ మెయిన్ రోడ్, కర్ణాటక- 560068

మరణించిన రుణగ్రహీత యొక్క చట్టపరమైన వారసులను బహిర్గతం చేయడానికి ప్రకటన
బహిరంగ ప్రకటన

ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ (ది బ్యాంక్) ద్వారా గృహ రుణం TBGTR00006652221 (క్రెడిట్ సౌకర్యం) మరణించిన శ్రీ.రుద్ర శ్రీనివాస రావుతో పాటు రుద్ర భూలక్ష్మికి మంజూరు చేయబడిందని ఇందుమూలంగా ప్రకటన ఇవ్వబడినది.
శ్రీ.రుద్ర శ్రీనివాస రావు మరణవార్త బ్యాంకు అధికారులు క్షేత్ర పర్యటనలు మరియు రిజిస్టర్డ్ కాంటాక్ట్ నెంబర్లకు టెలిఫోన్ ద్వారా మాకు తెలిసింది అనిమీకు తెలియజేస్తున్నాము. ఈ విషయంలో, రుణగ్రహీతల మరియు మరణించిన రుద్ర శ్రీనివాస రావు యొక్క రిజిస్టర్డ్ చిరునామాలకు మరణించిన రుణగ్రహీత యొక్క చట్టపరమైన వారసుల గురించి సమాచారం అందించడానికి 03.09.2025 తేదీ నాటి లేఖగతంలో పంపబడింది.
అందువలన ఈ నోటీసు ప్రచురించబడిన 15 రోజులలోపు, మరణించిన శ్రీ.రుద్ర శ్రీనివాస రావు యొక్క చట్టపరమైన వారసుల వివరాలను సహాయక పత్రాలతో బ్యాంక్ రికార్డులను నవీకరించడానికి పంచుకోవడానికి ఇందుమూలంగా ఈ నోటీసు ఇవ్వబడింది.
మీరు పైన పేర్కొన్న వివరాలను ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్, డి.నెం.37-1-187, కోట వీధి బాపూజీ కాంప్లెక్స్ ఎదురుగా, అదంకి బస్ స్టాప్, ఒంగోలు, ఆంధ్రప్రదేశ్-523001లో సందర్శించడం ద్వారా సయ్యద్ ఏ వారికి సమర్పించవచ్చు.

తేదీ: 05 సెప్టెంబర్, 2025 | అధికృత అధికారి
ప్రదేశం: గుంటూరు & విజయవాడ | ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్

ICICI Bank | నమోదిత కార్యాలయం : ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్, ల్యాండ్ మార్క్, రేస్ కోర్స్ సర్కిల్, వడోదర-390007
కార్పొరేట్ కార్యాలయం : ఐసిఐసిఐ బ్యాంక్ టవర్స్, బాంద్రా-కుర్లా కాంప్లెక్స్, బాంద్రా (తూ), ముంబై-400051
శాఖ కార్యాలయం : ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్, 4/10, మైత్రి టవర్, బొమ్మన్ హల్లి హొసూర్ మెయిన్ రోడ్డు-560068.

అనుబంధం 54
మరణించిన రుణగ్రహీత యొక్క చట్టపరమైన వారసుల బహిర్గతం కొరకు నోటీసు
బహిరంగ నోటీసు

ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ (ది బ్యాంక్) ద్వారా మరణించిన మాజేటి ఉమాదేవి తో పాటు మాజేటి సాంబశివరావు మంజూరు చేసిన హోమ్ లోన్ LBGTR00005907815/ LBGTR00005907816 (క్రెడిట్ సౌకర్యం) ఇక్కడ క్రింద నోటీసు ఇవ్వడమైనది.
బ్యాంక్ అధికారులు నిర్వహించిన ఆకస్మిక సందర్శనల ద్వారా మరియు నమోదిత కాంటాక్ట్ నంబర్లకు టెలిఫోనిక్ కమ్యూనికేషన్ల ద్వారా మాజేటి ఉమాదేవి మరణవార్త మాకు తెలిసిందని మేము మీకు తెలియజేస్తున్నాము. ఈ ప్రాంతంలో, తర్వాత తేది 03.09.2025, గతంలో రుణగ్రహీతల మరియు మరణించిన మాజేటి ఉమాదేవి యొక్క నమోదిత చిరునామాలకు, మరణించిన రుణగ్రహీత యొక్క చట్టపరమైన వారసుల గురించి సమాచారం అందించడానికి పంపబడింది.
ఆ తర్వాత, ఈ నోటీసు ప్రచురించబడిన 15 రోజులలోపు, బ్యాంక్ రికార్డులను నవీకరించడానికి సహాయక పత్రాలతో మరణించిన మాజేటి ఉమాదేవి యొక్క చట్టపరమైన వారసుల వివరాలను తెలుసుకోడానికి మీకు నోటీసు ఇవ్వడమైనది.
పైన పేర్కొన్న వివరాలను మీరు ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్, 5-82-2, 5-82-2, పిఎమ్‌జి కాంప్లెక్స్ లక్ష్మీపురం మెయిన్ రోడ్డు గుంటూరు-522002 వద్ద శ్రీ.గంట్ల కుమార్‌కు సమర్పించవచ్చు.

తేది: 05 సెప్టెంబరు, 2025 | అధికృత అధికారి
ప్రదేశం : గుంటూరు | ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ తరఫున

అనుబంధం IV-A
స్థిరాస్తి విక్రయం కొరకు అమ్మకం ప్రకటన

సెక్యూరిటి ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(6) మరియు 9(1)కి ప్రతిబంధంతో కలిపి చదవవలసిన ఆర్థిక ఆస్తుల సెక్యూరిటైజేషన్ మరియు పునర్నిర్మాణం మరియు సెక్యూరిటి ఇంటరెస్ట్ చట్టం, 2002 అమలు కింద స్థిరాస్తుల విక్రయం కొరకు ఈ-వేలం అమ్మకపు ప్రకటన.

ఇందుమూలంగా ప్రజానీకానికి సాధారణంగామరియు రుణగ్రహీత(ల)కు మరియు గ్యారంటార్(ల)కు ప్రత్యేకంగా తెలియజేయునది ఏమనగా సెక్యూర్‌డ్ క్రెడిటార్‌కి తనఖాపెట్టిన/చార్జ్‌చేసిన, **సమ్మాన్ క్యాపిటల్ లిమిటెడ్ (గతంలో ఇండియాబుల్స్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా పిలవబడేది) (CIN : L65922DL2005PLC136029)** (''సెక్యూర్‌డ్ క్రెడిటార్''), సెక్యూర్‌డ్ క్రెడిటార్ యొక్క అధీకృత అధికారి **భౌతిక స్వాధీనం** చేసుకున్న ఈ కింద వివరించిన స్థిరాస్తిని, **రావూరి శివ నాగరాజు మరియు రావూరి సుజాత** నుంచి సెక్యూర్‌డ్ క్రెడిటార్‌కి బకాయివున్న ఉన్న లీగల్ ఖర్చులు మరియు ఇతర చార్జీలతో పాటు **21.08.2025** నుంచి రుణ ఒప్పంద నిబంధనలతో ప్రకారం వర్తించే భవిష్యత్తు వడ్డీతో కలిపి అసలు, బకాయిలను (ప్రాప్తించిన ఆలస్య చార్జీలతో సహా) మరియు **20.08.2025** వరకు అయిన వడ్డీని రుణ ఖాతా నం. **HHLGUN00344671** కింద బాకీవున్న రూ. **49,15,747/-** (**నలభై తొమ్మిది లక్షల పదిహేను వేల ఏడు వందల నలభై ఏడు రూపాయలు మాత్రమే**) మొత్తాన్ని రికవరి చేసేందుకు ''ఎక్కడ ఉన్నది అక్కడ'', ''ఏది ఉంటే అది'' మరియు ''అక్కడ ఉన్నదేదైనా'' ప్రాతిపదికన **25.09.2025**న **05.00** పి.ఎం నుంచి **06.00** పి.ఎం గంటల మధ్య విక్రయించబడును.

సదరు స్థిరాస్తి వేలానికిరిజర్వు ధర రూ. **39,00,000/-** (ముప్పై తొమ్మిది లక్షల రూపాయలు మాత్రమే) మరియు ధరావతు సొమ్ము (''ఇఎండి'') రూ. **3,90,000/-** (మూడు లక్షల తొంభై వేల రూపాయలు మాత్రమే) అంటే రిజర్వు ధరలో 10%కి సమానం.

స్థిరాస్తి/స్థిరాస్తుల వివరాలు

గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా హద్దుల లోపల మరియు ఎస్.ఆర్.ఒ కొరిటెపాడు, గుంటూరు జిల్లా, గుంటూరు-522006, ఆంధ్రప్రదేశ్ హద్దుల లోపల డోర్ నం. 1-33-61 దగ్గర, డోర్ నం. 258/ఇ5, పాత డోర్ నం. 258తో కొరిటెపాడు గ్రామంలో మొత్తం 382.77 చ. గజాలు లేదా 319.40 చ. మీటర్ల విస్తీర్ణంలో ''అభయశ్రీ టవర్స్'' పేరుతో నిర్మించిన అపార్టుమెంట్‌లో ఇతర ఉమ్మడి ఈజ్‌మెంటరీ హక్కులన్నిటితో, వాటర్ టాప్ కనెక్షన్ మరియు మెట్లు మొదలైనవి, 1062.0 చ.అ ప్లింత్ ఏరియాతో నాలుగవ అంతస్తులో ఉన్న ఫ్లాట్ నం. 501కి గల 38.277 చ.గజాలు లేదా 32.00 చ.మీ అవిభక్త మరియు అనిర్దిష్టమైన ఉమ్మడి హక్కు వాటా మరియు దీనికి హద్దులు ఇలా ఉన్నాయి: సదరు భూమికి హద్దులు ఇలా ఉన్నాయి:-
తూర్పు : 33 అడుగుల మున్సిపల్ కార్పొరేషన్ రోడ్డు — దక్షిణం : పి. పూర్ణచంద్రరావు సైట్
పశ్చిమం : ఉదరాజు రాజ్యలక్ష్మి సైట్ — ఉత్తరం : గోవవరపు చిన్న బ్రహ్మానందం సైట్
ఫ్లాట్ నం. 501కి హద్దులు ఈ కింది విధంగా ఉన్నాయి:
తూర్పు : ఓపెన్ టు స్కై అబెట్టింగ్ మున్సిపల్ రోడ్డు — దక్షిణం : ఓపెన్ టు స్కై
పశ్చిమం : కామన్ కారిడార్ — ఉత్తరం : ఓపెన్ టు స్కై
రావూరి శివ నాగరాజు పేరు నిమ్మగడ్డ లావణ్య మరియు ఇతరులు కుదుర్చుకున్న రిజిస్టర్డు సేల్ డీడ్ నం. 2845/2017 ప్రకారం.

విక్రయం యొక్క సవివరమైన నియమ నిబంధనల కొరకు, దయచేసి సెక్యూర్‌డ్ క్రెడిటార్ యొక్క వెబ్‌సైట్‌లో ఇవ్వబడిన లింకు www.sammaancapital.com చూడండి. సంప్రదించవలసిన నం.: 0124 - 6910910, +91 7065451024; ఈ-మెయిల్ ఐడి : auctionhelpline@sammaancapital.com. బిడ్డింగ్ కోసం, www.auctionfocus.inకి లాగాన్ అవ్వండి.

సంతకం చేసినవారు
ఆథరైజ్‌డ్ ఆఫీసర్
తేదీ : 30.08.2025 | సమ్మాన్ క్యాపిటల్ లిమిటెడ్
స్థలం : గుంటూరు | (గతంలో ఇండియాబుల్స్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా పిలవబడేది)

motilal oswal Home Finance

మోతిలాల్ ఓస్వాల్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్
నమోదిత కార్యాలయం : మోతిలాల్ ఓస్వల్ టవర్, రహిమ్‌తుల్లా సయాని రోడ్, పారెల్ ఎస్‌టి డిపోట్ ఎదురుగా, ప్రభాదేవి, ముంబై-400 025.
సిఎస్: 8291889898 వెబ్సైట్: www.motilaloswalhf.com, ఇమెయిల్: hfquery@motilaloswal.com

స్వాధీనతా నోటీసు (స్థిరాస్తి/ల కొరకు)
(సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(1) క్రింద)

ఏదైతే దిగువసంతకందారుడైన మోతిలాల్ ఓస్వాల్ హోమ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ (గతంలో అస్పైర్ హోమ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్‌గా పేర్కొనబడింది) యొక్క అధీకృత అధికారి, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్, 2002 (2002 యొక్క 54) క్రింద మరియు సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువుతూ సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించి సదరు నోటీసు యొక్క రసీదు తేది నుండి 60 రోజులలోగా పేర్కొన్న మొత్తం తిరిగిచెల్లించమని క్రింద పేర్కొన్న రుణగ్రహీత/లు పిలుస్తూ డిమాండ్ నోటీసును జారీ చేయడమైనది.
రుణగ్రహీత/లు మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో విఫలమైనందున, రుణగ్రహీత/లు మరియు సాధారణ ప్రజలకు నోటీసు ఇవ్వడమేమనగా సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8తో చదువుతూ చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (4) క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ క్రింద వివరించబడిన ఆస్తిని దిగువసంతకందారుడు స్వాధీనం చేసుకోవడమైంది.

క్ర సం.	లోన్ ఒప్పందం నం./రుణగ్రహీత/ సహ రుణగ్రహీత/హామీదారుని పేరు	డిమాండ్ నోటీసు తేది మరియు బకాయి	స్వాధీనం చేసుకున్న తేది	స్థిరాస్తి వివరణ ఆస్తి కలిగి ఉన్న మొత్తం ఆ భాగం మరియు పార్శిల్
1	LXGUN04119-200075801 రుణగ్రహీత- పొరుమల్ల శివ నాగేశ్వరరావు, సహ రుణగ్రహీత- పొరుమల నాగ రాధిక	17-03-2025 For Rs.643060/-	01-09-2025	సర్వే నం.34/2, ఎసెస్మెంట్ నం.57-143/4 మింజుమలె చ.80 ఎస్ స్థలం, పాత మునిసిపల్ ఎసెస్మెంట్ నం. 57-143/4, గోరంట్ల రామాలయం గుడి దగ్గర, గుంటూరు ఎసెస్మెంట్ నం. 135176, ఆర్.సి.సి యొక్క డోర్ నం. 8-144, గుంటూరు ఆంధ్రప్రదేశ్ 5225034 తూర్పు: చిల్లర ప్రసాద్ యొక్క ఆస్తి - 13'0", పడమర: సిల్కార్ ప్రసాద్ -11'0", ఉత్తరం: పొరుమల్ల వెంకటేశ్వర్లు యొక్క ఆస్తి -60'0", దక్షిణం: పొరుమల్ల చంద్రశేఖర్ యొక్క ఆస్తి-60'0"

ప్రత్యేకించి రుణగ్రహీత/లు మరియు సాధారణ ప్రజలను హెచ్చరించడమేమనగా సదరు ఆస్తితో ఏవిధమైన లావాదేవీలు నిర్వహించరాదని, ఆస్తితో నిర్వహించబడు ఏవేని లావాదేవీలు **మోతిలాల్ ఓస్వాల్ హోమ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్** యొక్క చార్జ్‌కు లోబడి మాత్రమే జరుగవలెనని పేర్కొనడమైనది.
రుణగ్రహీత జాగ్రత్త వహించవల్సింది ఏమనగా సెక్యూర్డ్ అసెట్స్‌ను విడిపించుకొనుటకు మీకు లభించిన సమయం మేరకు చట్టం యొక్క సెక్షన్13 యొక్క సబ్ సెక్షన్ (8) నిబంధనలను ఆహ్వానించడమైనది.
ప్రదేశం : విజయవాడ, తేది : 0509.2025 | సం/- అధీకృత అధికారి, మోతిలాల్ ఓస్వాల్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్

Piramal Finance

పిరామల్ ఫైనాన్స్ లిమిటెడ్
సిఐఎన్ : L65910MH1984PLC032639
రిజిస్టర్డ్ ఆఫీసు: యూనిట్ నెం.601, 6వ అంతస్తు, పిరామల్ అమితి బిల్డింగ్, పిరామల్ అగస్త్యా కార్పొరేట్ పార్క్, కమాని జంక్షన్, ఫైర్ స్టేషన్ ఎదురుగా, ఎల్‌బిఎస్‌మార్గ్, కుర్లా (వెస్ట్), ముంబయి-400070. టెలి: +91 22 3802 4000.
బ్రాంచ్ ఆఫీసు: డోర్ నెం.7-1-615, 616 & 617/ఎ, ఇంపెరియల్ టవర్స్, 4వ అంతస్తు, అమీర్‌పేట్ మెయిన్ రోడ్, హైదరాబాద్-500016, తెలంగాణ.
సంప్రదించు వ్యక్తి: 1) రమణ రావు-9849271633, 3) చందన్ సాఖేల్కర్- 9820407168

ఇ- వేలం అమ్మకపు ప్రకటన- తాజా అమ్మకం

రుణగ్రహీత/ల నుండి బకాయి మొత్తాల రికవరీ కొరకు సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్సియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ చట్టం, **2002** క్రింద **పిరామల్ ఫైనాన్స్ లిమిటెడ్ (పిరామల్ క్యాపిటల్ & హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్)** యొక్క అధీకృత అధికారిచే దిగువ పేర్కొన్న సెక్యూర్డు అసెట్ యొక్క స్వాధీనం చేసుకునేందుకు అనుగుణంగా స్వాధీనంలోని దిగువ వివరించినట్లుగా స్థిరాస్తి యొక్క కొనుగోలు కొరకు **"ఎక్కడ ఎలా ఉన్నది' మరియు 'అక్కడ అది అలాగే ప్రతిపాదికన"** దిగువ సంతకం దారుడు ఆఫర్లను ఆహ్వానిస్తున్నారు, వివరాలు దిగువ విధంగా ఉన్నాయి.

లోన్ కోడ్/ బ్రాంచ్/ రుణగ్రహీత(ల)/ సహ-రుణగ్రహీత(ల)/ హామీదారు(లు)	డిమాండ్ నోటీసు తేది మరియు మొత్తం	ఆస్తి చిరునామా- ఫైనల్	రిజర్వు ధర	ధరావత్తు (ఈఎండి) (ఆర్‌పిలో 10%)	బాకీపడిన మొత్తం (01-09-2025)
లోన్ కోడ్ నెంబరు: M0079999 & M0079999TU, విజయవాడ (బ్రాంచ్), పాటిబళ్ల శివకుమార్ (రుణగ్రహీత), విశాలి చింతపల్లి (సహ-రుణగ్రహీత 1)	తేదీ:25-07-2024, రూ.17,50,469/-, (రూపాయలు పదిహేడు లక్షల యాభై వేల నాలుగు వందల అరవై తొమ్మిది మాత్రమే) & తేదీ: 25-07-2024, రూ.1,35,817/-, (రూపాయలు ఒకలక్ష ముప్పై ఐదు వేల ఎనిమిది వందల పదిహేడు మాత్రమే)	ఆస్తి విస్తీర్ణం కలిగియున్న మొత్తం భాగం: ఫ్లాట్ నెం.201, ఆర్ఎస్ నెం. 88, ప్లాట్ నెం.3, డోర్ నెం.1-158 దగ్గర, మొదటి అంతస్తు, డిపియు రెసిడెన్సీ, అంబాపురం, 4వ లేన్, షిర్డీ సాయి నగర్, కృష్ణ, అల్లూరి ఫుడ్ జంక్షన్ దగ్గర, కృష్ణ ఆంధ్రప్రదేశ్- 520011. సరిహద్దులు: ఉత్తరం: ఈ ఫ్లాట్ మరియు ఫ్లాట్ నెం.202 మధ్య ఉమ్మడి గోడ, దక్షిణం: ఓపెన్ టు స్కై, తూర్పు: మెట్లు & ఉమ్మడి కారిడార్, పడమర: ఓపెన్ టు స్కై.	రూ. 21,50,000/- (రూపాయలు ఇరవై ఒక లక్ష యాభై వేలు మాత్రమే)	రూ. 2,15,000/-, (రూపాయలు రెండు లక్షల పదిహేను వేలు మాత్రమే)	రూ.19,88,417/-, (రూపాయలు పంతొమ్మిది లక్షల ఎనభై ఎనిమిది వేల నాలుగు వందల పదిహేడు మాత్రమే) & రూ.1,60,073/-, (రూపాయలు ఒక లక్ష అరవై వేల డెబ్బై మూడు మాత్రమే)

ఇ-వేలం తేది: 10-10-2025, ఉ॥11.00గం.ల నుండి మ.1.00గం.ల వరకు (ప్రతి 5 నిమిషాల చొప్పున అపరిమిత పొడిగింపుతో),
బిడ్ దాఖలుచేయుటకు చివరి తేది:09-10-2025, సా.4.00 గం.లకు ముందు.

అమ్మకం యొక్క వివరణాత్మక నియమ నిబంధనల కొరకు దయచేసి, **www.piramalfinance.com/e-Auction.html** లో కల్పించిన లింక్‌ను చూడండి లేదా **piramal. auction@piramal.com** పై మాకు ఇమెయిల్ చేయండి.

రుణగ్రహీత/హామీదారు/ తాకట్టుదారుకు SARFAESI చట్టం క్రింద చట్టబద్ధమైన 30 రోజుల అమ్మకపు ప్రకటన

వేలం తేదీకి ముందు తేదీ వరకు వర్తించు వడ్డీతోసహా పూర్తిగా సెక్షన్13(2) నోటీసులో పేర్కొన్నట్లుగా పూర్తి బకాయిని చెల్లించవలసిందిగా పై పేర్కొన్న రుణగ్రహీత/ హామీదారును కోరబడుచున్నది, విఫలంచెందిన ఏదైతే, ఆస్తి వేలం చేయబడుతుంది మరియు మిగతా బకాయిల కొరకు రుణగ్రహీత /హామీదారుల నుండి వడ్డీ& ఖర్చులు ఏవేని ఉన్నట్లైతే వారి నుండే వసూలు చేయబడుతుంది.
సెక్యూర్డ్ ఆస్తిని రీడీమ్ చేయడానికి అందుబాటులోఉన్న సమయానికి సంబంధించి, చట్టంలోని సెక్షన్ 13లోని సబ్-సెక్షన్ 8 వైపు రుణగ్రహీతల శ్రద్ధను కోరుతున్నాం. ప్రధానంగా రుణగ్రహీతలు మరియు సాధారణంగా ప్రజలు దయచేసి గమనించండి, ఇక్కడ షెడ్యూల్ చేయబడిన వేలం ఏ కారణం చేతనైనా విఫలమైతే, సెక్యూర్డ్ క్రెడిటార్ ప్రైవేట్ ట్రీటీ ద్వారా తన సెక్యూరిటీలను అమలు చేయవచ్చు.

తేది: 05 సెప్టెంబర్, 2025, ప్రదేశం: క్రిష్ణా | సం/-(అధీకృత అధికారి), పిరామల్ ఫైనాన్స్ లిమిటెడ్

బహిరంగ ప్రకటన

ICICI Bank | **శాఖ కార్యాలయం :** ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్, 4/10, మైత్రి టవర్, బొమ్మన్ హల్లి హొసూర్ మెయిన్ రోడ్డు బెంగళూరు-560068

కింది రుణగ్రహీతలు బ్యాంక్ నుండి పొందిన రుణాల సదుపాయం యొక్క అసలైన మరియు వడ్డీని తిరిగి చెల్లించడంలో డీఫాల్ట్ అయ్యారు మరియు రుణాలు పని చేయని ఆస్తులు (ఎన్‌పిఎ) గా వర్గీకరించబడ్డాయి. సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్-2002 సెక్షన్ 13(2) కింద వారికి నోటీసు జారీ చేయబడింది, వారి చివరిగా తెలిసిన చిరునామాలపై అది అందించబడలేదు అందువల్ల ఈ పబ్లిక్ నోటీసు ద్వారా వారికి తెలియజేయడమైంది.

క్ర సం.	రుణగ్రహీత/సహ రుణగ్రహీత/హామీదారుల పేర్లు (లోన్ అకౌంట్ నెంబరు) మరియు చిరునామా	అమలు చేయబడిన సెక్యూర్డ్ అసెట్స్ వివరణ	నోటీసు పంపిన తేది/ నోటీసు తేది నాటికి బకాయి మొత్తం	ఎన్‌పిఎ తేది
1.	జోగి నాగమల్లేశ్వరమ్మ/ జోగి నాగమల్లేశ్వరరావు/ LBMCL00004972773/ LBMCL00005983312/ డో.నం.15/199-ఎ, ఆనంద్ పేట మచిలీపట్నం, కృష్ణ-521001.	(లోన్ డాక్యుమెంట్/ ఆస్తి డాక్యుమెంట్‌లో వివరించిన ప్రకారం కృష్ణాజిల్లా, మచిలీపట్నం, మాచవరం, ఆనంద్‌పేట వద్ద ఉన్న ఆర్.సి.సి. భవన స్థలం కొలత 99.89 చ.గ.లు. లేదా 82.77 చ.మీ.లు. పాత డో.నం.15/199, ప్రస్తుత డో.నం.15/199-ఎ, మున్సిపల్ వార్డు నం.15 మరియు క్రింది విధంగా ఉన్న హద్దులు : ఉత్తరం : మున్సిపల్ రోడ్డు-29 అ.లు., దక్షిణం : నత్తమారి సుమతి స్థలం- 29 అ.లు., తూర్పు : నత్త మారి సుమతి స్థలం- 31 అ.లు., పడమర : గోవద శామ్యూల్ స్థలం- 31 అ.లు.	08.07.2025 Rs. 23,42,997.80/-	03-06-2025
2.	మహమ్మద్ ఇర్ఫాన్ ఎస్/ షేక్ ఖాలిద/ LBMBN00005688688/ హౌ.నం.8-5-22, ఫ్లాట్ నం.506, 4వ అంతస్తు, టీచర్స్ కాలనీ, గోల్డెన్ హోమ్స్ అపార్టుమెంట్ మహబూబ్‌నగర్-509001.	ఆస్తి షెడ్యూల్ : కృష్ణాజిల్లా, ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అధికార పరిధి క్రింద ఇబ్రహీంపట్నం మండలం, ఇబ్రహీంపట్నం గ్రామంలో ఉన్న సర్వే నం.102/2 లో స్థిరాస్తి మొత్తం ఆ ముక్క మరియు పార్శిల్ ఖాళీ సైట్ కొలిచే మొత్తం పరిధి 859.55 చ.మీ.లు. మరియు వి.జి.టి.వై.యు.డి., వై.పి.నం.10/2011 క్రింద కవర్‌చేయబడిన పేర్కొన్న స్థలం కలిగి ఉన్న ప్లాట్ నం.5 (213.88 చ.మీ.లు.), ప్లాట్ నం.6 (213.88 చ.మీ.లు.) ప్లాట్ నం.15 (211.76 చ.మీ.లు.), ప్లాట్ నం.16 (220.03 చ.మీ.లు.) మరియు ఏర్పడిన ఇరత పాట్ల ప్రక్కన కలిపి పరిధి 859.55 చ.మీ.లు., ఈ ఆస్తి శాశ్వత నివాస ఉపయోగం కోసం ఉద్దేశించబడింది మరియు 48.29 చ.మీ.లు. అదనపు పొడిగింపులో అవిభక్త, ఉమ్మడి మరియు విడదీయలేని హక్కును కలిగి ఉన్న లే అవుట్. ఎ-షెడ్యూల్ స్థలం సరిహద్దులు : తూర్పు : 40'-0" వెడల్పు రోడ్డు- పొడవు 70'-2", దక్షిణం : ప్లాట్ నం.లు. 4 మరియు 17 పొడవు : 112'-6", పడమర : 40'-0" వెడల్పు రోడ్డు- పొడవు : 70'-0", ఉత్తరం: ప్లాట్ నం.7 మరియు 14వ అంతస్తు ఆస్తి- పొడవు : 108'-3". ఆస్తి-బి షెడ్యూల్ : ఎ షెడ్యూల్ ఆస్తి పై నిర్మించబిన "శ్రీ గోద రంగనాథ నిలయం" గా తెలిసిన రెసిడెన్షియల్ అపార్టుమెంట్ నిర్మాణం క్రింద గ్రౌండ్ ఫ్లోర్ లోని ఫ్లాట్ నం.102 మొత్తం స్థలం ఏరియా 859.55 చ.మీ.లు. పేర్కొన్న ఫ్లాట్ కలిగి ఉన్న ప్లింత్ ఏరియా 960 చ.మీ.లు., నియమించబడిన కార్ పార్కింగ్ ఏరియా 125 చ.మీ.లు., సాధారణ ఏరియాలు 200 చ.మీ.లు. బాల్కనీ మరియు ఎ-షెడ్యూల్ భూమి యొక్క పరిమితుల్లో ఉన్న నివాస నిర్మాణంలో భాగం. ఫ్లాట్ నం.102 బి-షెడ్యూల్ సరిహద్దులు : తూర్పు : లిఫ్ట్ మరియు ఓపెన్ టుస్కై, దక్షిణం : ఓపెన్ టుస్కై, పడమర : మెట్లకేస్ మరియు ఓపెన్ టుస్కై, ఉత్తరం : కామన్ కారిడార్.	15.07.2025 Rs. 35,81,989.00/-	03-06-2025

నోటీసు యొక్క ప్రత్యామ్నాయ సేవ కోసం చర్యలు తీసుకోబడుతున్నాయి. పై రుణగ్రహీతలు/మరియు/లేదా వారి హామీదారులు (వర్తించే విధంగా) ఈ నోటీసును ప్రచురించిన తేదీ నుండి 60 రోజుల వ్యవధిలోపు బకాయి ఉన్న చెల్లించాలని సూచించారు. లేకపోతే సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్-2002 నిబంధన ప్రకారం తదుపరి చర్యలు తీసుకోబడతాయి.

తేది : సెప్టెంబర్ 05, 2025, | అధీకృత సెక్రెటరీ
ప్రదేశం : విజయవాడ | ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ తరపున

GRIHUM HOUSING FINANCE

గృహం హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్
(గతంలో పూనావాలా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా తెలిసినది)
రిజిస్టర్డు ఆఫీసు: 6వ అంతస్తు, బి- బిల్డింగ్, గంగా ట్రూనో, లోహెగావ్, పూణే, మహారాష్ట్ర-411014
బ్రాంచ్ ఆఫీసు యూనిట్: 1వ అంతస్తు, డోర్ నెం.6-10-27, 10/1, అరుండల్‌పేట, గుంటూరు, ఆంధ్రప్రదేశ్- 522002.
ఇ-వేలం-అమ్మకపు ప్రకటన
SARFAESI చట్టం క్రింద
సెక్యూర్డ్ స్థిరాస్తి అమ్మకం

సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోనిరూల్ 8 మరియు 9 తో చదువుతూ సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్, 2002 (ది "యాక్ట్") క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ వేలం విక్రయ నోటీసు. దిగువ వివరించిన స్థిరాస్తులు **గృహం హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో పూనావాలా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ గా పేర్కొనబడిన పూనావాలా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ 17 నవంబర్, 2023 నుండి గృహం హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా మార్చబడింది) (గతంలో మాగ్మా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్‌**గా పేర్కొనబడింది మరియు వాస్తవంలో జిఇ మనీ హౌసింగ్ ఫైనాన్స్ పబ్లిక్ అన్‌లిమిటెడ్ కంపెనీతో విలీనం చేయబడింది) (ఇకపై చట్టం ప్రకారం "సెక్యూర్ క్రెడిటార్" గాపేర్కొనబడును) కి తనఖాపెట్టబడ్డాయని రుణగ్రహీత/సహ-రుణగ్రహీత/తనఖాదారు(లు)/హామీదారు(లు) మరియు ప్రత్యేకంగా సాధారణ ప్రజలకు దీనిద్వారా తెలియజేయడమైనది. చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద నోటీసు ప్రకారం సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్‌లోని రూల్ 8&9 తో చదువుతూ చట్టంలోని 13(12) క్రింద సెక్యూర్డ్ క్రెడిటార్ అతనికి అందించిన అధికారాలను వినియోగించుకుంటూ అధీకృత అధికారి ద్వారా స్వాధీనం చేసుకోవడమైనది. సెక్యూర్డ్ అసెట్స్‌ను **06.10.2025న "ఎక్కడ ఉందో అలాగే", "ఉన్నది ఉన్నట్లుగా" మరియు "ఏదైతే ఉన్నదో అలాగే'** ప్రాతిపదికన ఇ-వేలం ద్వారా విక్రయించబడుతుంది. అమ్మకపు వివరణాత్మక షరతులు మరియు నియమాల కొరకుఇ-వేలం ప్లాట్‌ఫారం అందించినవెబ్‌సైట్: https://www.bankeauctions.com వద్ద నిర్వహించబడునని సాధారణ ప్రజలకు దీనిద్వారా తెలియజేయడమైనది. దయచేసి జిహెచ్ఎఫ్ఎల్‌లు/సెక్యూర్డ్ క్రెడిటార్స్ అందించిన లింక్ వెబ్‌సైట్ అనగా www.grihumhousing.com లో చూడగలరు.

క్ర సం.	ప్రతిపాదన నెం. ఖాతాదారు పేరు (ఎ)	డిమాండ్ నోటీసు తేది మరియు బకాయి మొత్తం (బి)	స్వాధీనత స్వభావం (సి)	ఆస్తి వివరణ (డి)	రిజర్వు ధర (ఇ)	ఇఎమ్‌డి (ఆర్‌పి 10 శాతం) (ఎఫ్)	ఇఎమ్‌డి సమర్పణ తేది (జి)	బిడ్ పెంపుదల (హెచ్)	ఆస్తి తనిఖీ తేది మరియు సమయం (ఐ)	వేలం తేది & సమయం (జె)	తెలిసిన భారాలు/ఏవైనా కోర్టు కేసులు (కె)
1	Loan No. HM0219H16100214 1)రిజ్వానా షేక్ (రుణగ్రహీత) 2) జాని బాషా షేక్ (సహ-రుణగ్రహీత)	నోటీసు తేదీ: 13/09/2019 మొత్తం బకాయిలు: 13/09/2019 నాటికి చెల్లించవలసిన మొత్తం బకాయిలు రూ.17,61,710/- (రూపాయలు పదిహేడు లక్షల అరవై ఒకటి వేల ఏడు వందల పది మాత్రమే) రియలైజేషన్ వరకు @ 14.66% వడ్డీతోసహా.	భౌతికంగా	డి.నెం.759, డోర్ నెంబరు: 19-270, బ్లాక్ నెం: 19, మంత్రి కొండయ్య వీధి, బొమ్మిడిపాలెం రోడ్, చిలకలూరిపేట మునిసిపాలిటీ, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్, చిలకలూరిపేట పిన్-522616	Rs.1970161/- (రూపాయలు పంతొమ్మిది లక్షల డెబ్బై వేల నూట అరవై ఒకటి మాత్రమే)	Rs. 197016.1/- (రూపాయలు ఒకలక్ష తొంభై ఏడు వేల పదహారు పది పైసలు మాత్రమే)	29/09/2025 Before 5 PM	10,000/-	24/09/2025 (11AM – 4PM)	06/10/2025 (11 AM- 2PM)	NIL

ఆసక్తిగల బిడ్డరుదారులు/కొనుగోలుదారులు సెక్యూర్డ్ క్రెడిటార్ బ్రాంచ్ మరియు వేలం ప్రొసర్టీలను సందర్శించి, తన స్వంత విచారణ చేసి, అదనపు ఛార్జీలు, భారాలు మరియు ఏవైనా థర్డ్ పార్టీ ఆసక్తులను నిర్ధారించుకోవాలని మరియు బిడ్‌లను సమర్పించే ముందు అన్ని అంశాలలో తనను తాను/ఆమెను/తానే సంతృప్తి చెందాలని సూచించారు. ఆస్తి పన్నులు, విద్యుత్/ నీటి బకాయిలు మరియు ఏవైనా ఇతర బకాయిలు వంటి అన్ని చట్టబద్ధమైన బకాయిలు, ఏదైనా ఉంటే విజయవంతమైన బిడ్డర్ నిర్ధారించి చెల్లించాల్సిన ఆస్తికి జతచేయబడుతుంది. ఆసక్తిగల బిడ్డర్లు తమను తాము పోర్టల్‌తో నమోదు చేసుకోవాలి మరియు లాగిన్ ఐడి & పాస్‌వర్డ్‌ను ముందుగానే పొందవలసి ఉంటుంది, ఇది వేలం సర్వీస్ ప్రొవైడర్ సి1 ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ చిరునామా: ప్లాట్ నెం.68, 3వ అంతస్తు, గుర్గామ్ హర్యానా-122003 నుండి ఇ-బిడ్డింగ్‌కు తప్పనిసరి. హెల్ప్‌లైన్ నెం.:7291981124, 25, 26, సపోర్ట్ ఇ-మెయిల్ ఐడి: Support@bankeauctions.com. సంప్రదించాల్సిన వ్యక్తి: ధరణి పి, ఇ మెయిల్ ఐడి: dharani.p@c1india.com, సంప్రదించాల్సిన నెం.+91 9567626050. నిర్ణీత బిడ్డర్లు వారి నుండి మాత్రమే ఇ-వేలంపై ఆన్‌లైన్ శిక్షణను పొందవచ్చని దయచేసి గమనించండి. ఉద్దేశించిన కొనుగోలుదారు/బిడ్‌దారు "గృహం హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్", బ్యాంక్-ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ ఖాతాలో ఎన్ఇఎఫ్‌టి/ఆర్‌టిజిఎస్ ద్వారా ధరావత్తు (ఇఎమ్‌డి) మొత్తాన్ని సమర్పించాలి. ఖాతా నెం.091551000028 మరియు ఐఎఫ్ఎస్‌సి కోడ్-ICIC0000915, ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్, పంచశీల్ టెక్ పార్క్, గణపతి చౌక్ దగ్గర, 43/44 విమన్ నగర్-411014 వారికి ఏదైనా జాతీయం చేయబడిన లేదా షెడ్యూల్ చేయబడిన బ్యాంకులో 29.09.2025న లేదా అంతకు ముందు తీయాలి మరియు https://www.bankeauctions.com వద్ద తమ పేరు నమోదు చేయించుకోవాలి మరియు యూజర్ ఐడి & పాస్‌వర్డ్‌ను ఉచితంగా పొందండి మరియు సర్వీస్ సర్వీస్ ప్రొవైడర్ నుండి ఇ వేలం శిక్షణ పొందండి. వెబ్‌సైట్‌లో నమోదు చేసుకున్న తర్వాత, కొనుగోలుదారు/బిడ్‌దారు కింది పత్రాల కాపీలను అప్‌లోడ్ చేసి, ఇ మెయిల్ పంపి స్వీయ-ధృవీకరించిన హార్డ్ కాపీని పొందవలసి ఉంటుంది. **చిరునామా: 1వ అంతస్తు, డోర్ నెం.6-10-27, 10/1, అరుండల్‌పేట, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522002,** మొబైల్ నెం. +91 95676 26050, ఇ-మెయిల్ ఐడి: rahul.r1@grihumhousing.com. తదుపరి వివరాలు షరతులు మరియు నిబంధనల కొరకు దయచేసి https://www.bankeauctions.com & www.grihumhousing.com ద్వారా ఇ వేలంలో భాగం అయ్యేందుకు సందర్శించండి.
సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్ 2002 యొక్క రూల్ 8(6) క్రింద రుణగ్రహీత/సహ-రుణగ్రహీత/తనఖాదారు(లు)/హామీదారు(ల)కు 30 రోజుల నోటీసుగా కూడా పరిగణించాలి.

ఏదైనా సందర్భంలో స్థానిక భాషా ప్రచురణ మరియు ఆంగ్ల వార్తాపత్రిక ప్రచురణ యొక్క విషయాల మధ్య ఏదైనా తేడా ఉంటే, బిజినెస్ స్టాండర్డ్‌లో ప్రచురించబడిన ఆంగ్ల వార్తాపత్రిక భాష యొక్క కంటెంట్ చెల్లుతుంది.

తేది : 05-09-2025, ప్రదేశం: ఆంధ్రప్రదేశ్ | సం/- అధీకృత అధికారి, గృహం హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో పూనావాలా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా తెలిసినది)

దేశ ప్రగతికి డబుల్ డోస్ జిఎస్‌టి 2.0 !

- ప్రధాని మోడీ

న్యూఢిల్లీ : దేశ ప్రగతికి, అభివృద్ధికి జిఎస్‌టి 2.0 డబుల్ డోస్ వంటిదని ప్రధాని నరేంద్ర మోడీ వ్యాఖ్యానించారు. 21వ శతాబ్దంలో భారతదేశ పురోగతికి మద్దతుగా తదుపరి తరం సంస్కరణలను తీసుకువచ్చామన్నారు. గురువారం జాతీయ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలతో మాట్లాడుతూ ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. జిఎస్‌టి సంస్కరణల ద్వారా భారతదేశ చురుకైన ఆర్థిక వ్యవస్థకు ఐదు కొత్త పంచరత్నాలను జత చేసినట్లు చెప్పారు. జిఎస్‌టి మరింత సులభమైందన్నారు. నవరాత్రి మొదటి రోజు ఈ నెల 22 నుండి కొత్తరేట్లు అమల్లోకి వస్తాయన్నారు. సకాలంలో తీసుకోవాల్సిన చర్యలు, మార్పులు చేపట్టకపోతే, మనం ఈనాటి అంతర్జాతీయ పరిస్థితుల్లో మన దేశానికి సరైన దిశా నిర్దేశాన్ని చేయలేమని మోడీ పేర్కొన్నారు. భారత్‌ను స్వయం స్వావలంబనగా తీర్చిదిద్దాలంటే కొత్త తరం సంస్కరణలు చేపట్టక తప్పదని, ఇవి అత్యంత కీలకమని స్వాతంత్ర్య దినోత్సవం నాడు చెప్పామని, దీపావళి, ఛాత్‌పూజలకు ముందుగానే ఈసారి డబుల్ ధమాకా అందుతుందని దేశ ప్రజలకు హామీ ఇచ్చామని గుర్తు చేశారు. కాంగ్రెస్ పాలనలో రోజువారీ అవసరమైన వస్తువులపై కూడా భారీగా పన్నులు పడేవన్నారు. సామాన్యుడికి సంతోషం కలిగేలా ఆ సమస్యలను పరిష్కరించేందుకు తమ ప్రభుత్వం కృషి చేసిందని చెప్పుకున్నారు.

42 కేజీల గంజాయి స్వాధీనం

- పలాసలో నలుగురు, ఇచ్ఛాపురంలో ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి - పలాస, ఇచ్ఛాపురం

పలాస, ఇచ్ఛాపురంలో గంజాయిని తరలిస్తూ ఆరుగురు పోలీసులకు పట్టుబడ్డారు. పలాసలో నలుగురి నుంచి 21 కేజీలు, ఇచ్ఛాపురంలో ఇద్దరి నుంచి 21 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిఐ సూర్యనారాయణ కేసు వివరాలను వెల్లడించారు. ఒడిశా నుంచి కేరళకు గంజాయిని సరఫరా చేసేందుకు ఒడిశాలోని గంజాం జిల్లా తంబరాడకు చెందిన అరబింద్ ఆనంద్, అదే గ్రామానికి చెందిన అభినాష్‌తో పాటు గంజాం జిల్లా కృష్ణచంద్రపూర్‌కు చెందిన ప్రతిమా లిమ్మా ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇందులో భాగంగా ద్విచక్ర వాహనంపై 16 కిలోల గంజాయితో పలాస రైల్వేస్టేషన్‌కు రాగా, పోలీసులు ఆ ముగ్గురిని పట్టుకున్నారు. వారిని అరెస్టు చేసి 16 కిలోల గంజాయితో పాటు ద్విచక్ర వాహనం, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో ఎస్ఐ నర్సింహమూర్తి పాల్గొన్నారు. పలాస రైల్వేస్టేషన్‌లో ఆర్‌పిఎఫ్, జిఆర్ పోలీసుల సంయుక్త తనిఖీల్లో ఐదు కిలోల గంజాయి కలిగి ఉన్న వజ్రపుకొత్తూరు మండలం నువ్వులరేవుకు చెందిన బెహరా కామేశ్వరరావును అరెస్టు చేశారు. ఒడిశాలో గంజాయిని కొనుగోలు చేసి పలాసలో సాధువులకు విక్రయించేందుకు తీసుకురాగా, బ్యాగు తనిఖీ చేయగా పట్టుబడ్డాడు.

ఒడిశా నుంచి గుజరాత్‌కు గంజాయి తరలిస్తున్న ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లాకు చెందిన సాగర్ బెహరా, మైనర్ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి, వారి నుంచి 21.030 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఇచ్ఛాపురం సిఐ మీసాల చిన్నంనాయుడు తెలిపారు. స్థానిక సిఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. కవిటి మండలం కొజ్జీరియా ఫ్లైఓవర్ వద్ద ఇచ్ఛాపురం నుంచి కంచిలి వైపు వెళ్తే జాతీయ రహదారిపై తనిఖీల్లో కవిటి పోలీసులకు పట్టుబడ్డారు. వీరి నుంచి 21.030 కేజీల గంజాయి, రెండు మొబైల్ ఫోన్లు, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో కవిటి ఎస్ఐ పాల్గొన్నారు.

నేపాల్‌లో సామాజిక మాధ్యమాలపై నిషేధం

ఖాట్మండు : ఫేస్‌బుక్, ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్, యూ ట్యూబ్‌లతో సహా మొత్తంగా 26 సామాజిక మాధ్యమ వేదికలను నిషేధించాలని నేపాల్ ప్రభుత్వం గురువారం నిర్ణయించింది. ఈ మేరకు సమాచార సాంకేతిక శాఖ ఒక బహిరంగ నోటీసు జారీ చేసింది. రిజిస్టర్ కానీ సామాజిక మాధ్యమ వేదికలన్నింటినీ అవి తిరిగి నమోదు చేసుకునేవరకు నిషేధించాల్సిందిగా టెలికమ్యూనికేషన్ అధికార యంత్రాంగాన్ని ఆదేశించింది. నేపాల్‌లో వాటిని నమోదు చేసుకోవడానికి అవసరమైన రిజిస్ట్రేషన్ నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించడంలో విఫలమైనందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు కె.పి.శర్మ ఓలి ప్రభుత్వం చెబుతోంది. కాగా, అసమ్మతిని అణచివేసేందుకే ఈ చర్యలని విమర్శకులు వ్యాఖ్యానిస్తున్నారు. కాగా, భావ ప్రకటనా స్వేచ్ఛను పరిరక్షించే కార్యకర్తలు ఈ చర్య పట్ల నిరసన వ్యక్తం చేస్తున్నారు. సర్వీసుల క్రమబద్ధీకరణ కన్నా అసమ్మతి వాణిని అణచివేయడమే లక్ష్యంగా వుందని విమర్శిస్తున్నారు. రిజిస్ట్రేషన్ కోసం ప్రభుత్వం విధిస్తున్న షరతులు చాలా కఠినంగా వున్నాయని, సోషల్ మీడియా కంపెనీలపై దాడిచేస్తున్న రీతిలో అత్యంత అవాస్తవికంగా వున్నాయని వారు విమర్శిస్తున్నారు. నేపాల్ ప్రజాస్వామిక దేశమన్న భావనను పణంగా పెట్టి ఈ చర్య తీసుకున్నారని సెంటర్ ఫర్ మీడియా రీసెర్చ్ డైరెక్టర్ ఉజ్వల్ ఆచార్య వ్యాఖ్యానించారు.

సాంకేతిక విజ్ఞానం అందిపుచ్చుకోవాలి

- జెఎన్‌టియు రిజిస్ట్రార్ ఎస్. కృష్ణయ్య

ప్రజాశక్తి- అనంతపురం

కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్టులు విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి దోహదం చేస్తాయని జెఎన్‌టియు రిజిస్ట్రార్ ఎస్. కృష్ణయ్య పేర్కొన్నారు. అనంతపురం జెఎన్‌టియు, ఉన్నత విద్యాశాఖ, బీసీడీఈ, యూనిసెఫ్, విగ్యన్ ఆశ్రం సంయుక్తంగా మూడు రోజు పాటు నిర్వహించిన ట్రింకరింగ్ ల్యాబ్ వర్క్ షాపు గురువారం ముగిసింది. కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య చెన్నారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ముగింపు సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన కృష్ణయ్య మాట్లాడుతూ... ఈ వర్క్‌షాప్ యువ విద్యార్థులలో నైపుణ్యాలను, ఆవిష్కరణను, మార్గదర్శకతను పెంపొందించడానికి దోహదం చేస్తుందన్నారు. విద్యార్థుల కోసం, నూతన ఆవిష్కరణలు, సాంకేతికతలు గురించి అవగాహన పెరుగుతుందని తెలిపారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ... ప్రస్తుత పరిస్థతుల్లో సాంకేతిక విజ్ఞానం ఎప్పటికప్పుడు విద్యార్థులు అందిపుచ్చుకోవాలన్నారు. ఇది యువతలో ఆలోచనాశక్తిని ప్రోత్సహించి, భారతదేశాన్ని "ఇన్నోవేషన్-ఆధారిత ఆర్థికవ్యవస్థగా" మలచడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుం దని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ఆచార్య ఎస్. వసుంధర, బిసిడిఇకోఆర్డినేటర్ డాక్టర్ జె. శ్రీనివాసులు, యూనిసెఫ్ కన్సల్టెంట్ సుదర్శన్, విజ్ఞాన్ అశ్రం ప్రతినిధులు పవన్, వెంకటేష్, రమేష్ , జెఎన్‌టియు ఇంజనీరింగ్ కళాశాల విభాగాధిపతులు, అధ్యాపకులు, భోధన, భోధనేతర సిబ్బంది, వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

పోర్టు రోడ్డు నిర్మాణం... పంట ముంచింది

- రైతులు ముందుగానే హెచ్చరించినా పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - సంతబొమ్మాళి

అల్పపీడనం ప్రభావంతో గత రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు సంతబొమ్మాళి మండలంలోని వందలాది ఎకరాల వరి పంట పొలాలు నీట మునిగాయి. మూలపేట పోర్టు నుంచి టెక్కలి వరకు నిర్మిస్తున్న రహదారి మార్గం, దండుగోపాలపురం వరకు నిర్మిస్తున్న రైల్వే మార్గం నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. రోడ్డు, రైల్వే మార్గాలు నిర్మిస్తున్న పోర్టు అధికారులు మాత్రం వరద నీరు వెళ్లేందుకు ఎటువంటి చర్యలు చేపట్టలేదు. తాత్కాలికంగా ఒకటో, రెండో చోట్ల పైపుల ద్వారా కల్వర్టులు ఏర్పాటు చేసి వదిలేశారు. దీంతో గరీబుల గెడ్డ ద్వారా ఎగువ నుంచి వచ్చిన వరద ఉధృతికి కాకరాపల్లి, గొడలాం, బోరుభద్ర, వడ్డివాడ, మేఘవరం, మరువాడ, వడ్డితాండ్ర, కోటపాడు, ఆకాశలక్కవరం, కేలింగుడు, మూలపేట, నౌపడ పంచాయతీల్లోని పొలాలు ముంపునకు గురయ్యాయి. ఎగువ నుంచి వచ్చిన వరద నీరు పొలాల్లోని కాలువల ద్వారా నౌపడ మీదుగా సీతానగరం గడ్డ నుంచి సముద్రంలోకి వెళ్లేది. నీటి ప్రవాహానికి అడ్డంగా గ్రావెల్ వేసి రోడ్ల నిర్మాణం చేపడుతుండడంతో కాకరాపల్లి పవర్‌ప్లాంట్ పరిసర ప్రాంతాలు మొత్తం గత రెండు రోజులుగా ముంపులోనే ఉంది. పోర్టు రోడ్డు నిర్మాణం చేపడుతున్నప్పుడే ఈ ప్రాంత రైతులు టెక్కలి ఆర్‌డిఒకు పలుమార్లు వినతిపత్రం ఇచ్చి తమ సమస్యను వివరించారు. పోర్టు అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని ఆర్‌డిఒ చెప్పినా, ఇప్పటివరకు కల్వర్టులు గానీ అండర్ పాస్ నిర్మాణాలకు గానీ చర్యలు చేపట్టలేదని రైతులు విమర్శిస్తున్నారు. పోర్టు కోసం ఇటీవల తంపరపై నిర్మించిన కొత్త రహదారి కారణంగానే వరద నీరు సముద్రంలో కలవక పంట పొలాల్లోనే నిలిచిపోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో పోర్టు రహదారి లేప్పుడు ఎంత వరద వచ్చినా సముద్రంలో కలిసిపోయేదని, ఇప్పుడు కేవలం అక్కడక్కడా బొండీలు వేసి రోడ్డు నిర్మించడంతో నీటి ప్రవాహం ఆగిపోయి తీవ్ర నష్టాలు వాటిల్లుతున్నాయని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తంపర వద్ద వంతెన నిర్మించి భవిష్యత్‌లో వరద నీరు సముద్రంలో కలిసేలా చూడాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

పేలుడు పదార్థాల ఫ్యాక్టరీలో విస్ఫోటనం

ముంబయి : మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌జిల్లాలో పేలుడు పదార్థాల ఫ్యాక్టరీలో పేలుడు జరిగింది. ఈ ఘటనలో ఒకరు మరణించగా, 14మంది గాయ పడ్డారని అధికారులు గురువారం తెలిపారు. పేలుడు ధాటికి భవనం కూలిపోయిందని అన్నారు. జిల్లా ప్రధాన కార్యాలయం నుండి సుమారు 30కి.మీ దూరం లో ఉన్న బజార్‌గావ్‌లోని సోలార్ గ్రూప్‌కి చెందిన ప్లాంట్‌లో బుధవారం అర్ధరాత్రి 12.30 గంటలకు పేలుడు జరిగిందని అధికారులు తెలిపారు. గాయ పడిన వారిలో ఏడుగురి పరిస్థితి విషమంగా ఉందని అన్నారు. పెట్రోలియం మరియు పేలుడు పదార్థాల భద్రతా సంస్థ (పెసో) దర్యాప్తు చేపడుతోందని అన్నారు.

ఉపాధి హామీకి కేంద్రం తూట్లు.. ప్రతీఏటా బడ్జెట్‌లో కోతలు

న్యూఢిల్లీ : గ్రామీణ ప్రాంతాల్లోని వ్యవసాయ కూలీలకు వ్యవసాయ పనులు లేని కాలంలో జీవనోపాధి కల్పించే లక్ష్యంతో రూపొందిన మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని కేంద్రం ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే నీరుగారుస్తుందని ప్రతిపక్ష పార్టీలు, హక్కుల కార్యకర్తలతోపాటు ఆర్థికవేత్తలు సైతం విమర్శలు గుప్పిస్తున్నారు. బడ్జెట్ కోతలు, పాలనాపరమైన మార్పులు, సైద్ధాంతిక నిర్లక్ష్యం కలబోసుకున్న మోడీ ప్రభుత్వ వైఖరి ఉపాధి హామీ పథకం లబ్ధిదారులను నిలువునా దగా చేస్తోంది. ఏడాదికేడాది ఉపాధి హామీ పథకం కోసం బడ్జెట్ కేటాయింపులకు కోత పెడుతున్నది. ఉదాహరణకు 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఈ పథకానికి రూ. 60,000 కోట్లు కేటాయింపులు జరిగాయి. అంతకుముందు ఏడాది సవరించిన బడ్జెట్ కేటాయింపులు రూ. 73,000 కోట్లు ఉండగా పెరగాల్సిన కేటాయింపులపై కోత పడింది. అనుబంధ కేటాయింపులలో తరచూ జరుగుతున్న జాప్యం కూడా వ్యవసాయ కూలీలను ఆర్థికంగా తీవ్రంగా దెబ్బతీస్తోంది. వ్యవసాయ ఆఫ్ సీజన్ ముగిసిన తర్వాత అనుబంధ కేటాయింపులు జరగడం వల్ల లక్షలాది మంది కూలీలు ఉపాధి పొందలేక పోవడం, సకాలంలో వేతనాలు లభించకపోవడం వంటి సమస్యలు ఎదుర్కొంటున్నారు. వేతనాల చెల్లింపులో జాప్యం కారణంగా వేతన బకాయిలు భారీగా పెరిగిపోయి నరేగాపై వ్యవసాయ కూలీలలో నమ్మకం, ఆసక్తి సన్నగిల్లుతోంది. ఉపాధి హామీ బిల్లుకు రాష్ట్రపతి ఆమోదముద్ర వేసి సెప్టెంబర్ 5తో 20 ఏండ్లు పూర్తవుతుంది.

వేతన చెల్లింపుల్లో జాప్యం

మోదీ ప్రభుత్వంలో ఉపాధి హామీ కూలీలకు వేతనాల చెల్లింపులో జాప్యాలు నిత్యకత్యంగా మారాయి. వేతనాల కోసం వారాలు లేదా నెలల తరబడి వ్యవసాయ కూలీలు ఎదురుచూడాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. అయితే సంబంధిత మంత్రిత్వశాఖ మాత్రం తమ జాప్యాన్ని ఒప్పుకోకుండా నిందను రాష్ట్రాలపై వేయడానికి ఏమాత్రం సంకోచించడం లేదు. 2022లో లిబ్‌టెక్ ఇండియా అనే స్వతంత్ర సంస్థ దీనిపై అధ్యయనం చేసి చట్టపరంగా తప్పనిసరిగా 15 రోజుల్లో వేతనాలు చెల్లించాల్సి ఉండగా 71 శాతం వేతనాలలో తీవ్ర జాప్యం జరిగినట్లు వెల్లడించింది. వేతనాల చెల్లింపులో ఆలస్యం కారణంగా అప్పటికే ఆర్థికంగా చితికిపోయి ఉన్న వ్యవసాయ కూలీలు మరింత దుస్థితిలోకి కూరుపోతున్నారు. ప్రభుత్వ వైఖరి కారణంగా నరేగా అసలు లక్ష్యమే దెబ్బతినే పరిస్థితి ఏర్పడింది. ఉపాధి హామీ పథకం కింద గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి వ్యవసాయ కూలీ కుటుంబానికి ఏడాదికి 100 రోజుల పని కల్పించాలని చట్టం చెబుతోంది.

జగదీశన్ అజేయ శతకం

- సౌత్‌జోన్ 297/3
- దులీప్ ట్రోఫీ సెమీఫైనల్స్

బెంగళూరు: దులీప్ ట్రోఫీ సెమీఫైనల్లో సౌత్‌జోన్ బ్యాటర్ నారాయణ్ జగదీశన్ అజేయ శతకంతో మెరిసాడు. బిసిసిఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో నార్త్‌జోన్‌తో గురువారం నుంచి ప్రారంభమైన సెమీఫైనల్లో తొలిరోజు ఆట ముగిసేసరికి సౌత్‌జోన్ జట్టు 81ఓవర్లలో 3వికెట్ల నష్టానికి 297 పరుగులు చేసింది. జగదీశన్(147నాటౌట్) సెంచరీకి తోడు పడిక్కల్(57) బ్యాటింగ్‌లో రాణించారు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన సౌత్‌జోన్‌కు శుభారంభం లభించింది. తన్మయ్ అగర్వాల్(43), జగదీశన్ తొలి వికెట్‌కు 103 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. ఆ తర్వాత 2వ వికెట్‌కు జగదీశన్, పడిక్కల్ 128పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. నార్త్‌జోన్ బౌలర్లు సింధుకు రెండు, కంబోజ్‌కు ఒక వికెట్ దక్కాయి.

వెస్ట్‌జోన్ 363/6

వెస్ట్‌జోన్ కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్(184) భారీ శతకం బాదాడు. సెంట్రల్‌జోన్‌తో గురువారం నుంచి ప్రారంభమైన రెండో సెమీస్‌లో తొలిగా బ్యాటింగ్‌కు దిగిన వెస్ట్‌జోన్‌కు శుభారంభం దక్కలేదు. జైస్వాల్(4), దేశాయ్(1)కి తోడు శ్రేయస్ అయ్యర్(25), సామ్స్ ములానీ(18) నిరాశపరిచారు. స్కోర్‌బోర్డు 10 పరుగులకు చేరేసరికి వెస్ట్‌జోన్ ఓపెనర్లను కోల్పోయింది. ఆ తర్వాత గైక్వాడ్ భారీ శతకానికి తోడు తనుష్ కోటియన్(65 నాటౌట్) అర్ధసెంచరీతో ఆదుకున్నారు. సెంట్రల్‌జోన్ బౌలర్లు ఖలీల్ అహ్మద్, సరాన్ష్ జైన్‌కు రెండేసి, దీపక్ చాహర్, హర్ష్ దూబేకు ఒక్కో వికెట్ దక్కాయి.

తెలుగు టైటాన్స్ శుభారంభం

- ఉత్కంఠపోరులో జైపూర్‌పై గెలుపు
- ప్రొ కబడ్డీ సీజన్-12

విశాఖపట్నం: ప్రొ కబడ్డీ సీజన్-12లో తెలుగు టైటాన్స్ శుభారంభం చేసింది. తొలి రెండు లీగ్ మ్యాచుల్లో ఓడి అభిమానులను నిరాశపరిచిన టైటాన్స్.. గురువారం జరిగిన మూడో లీగ్ మ్యాచ్‌లో సమిష్టిగా చెలరేగింది. ఉత్కంఠభరితంగా సాగిన ఈ లీగ్ మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్ 37-32పాయింట్ల తేడాతో జైపూర్ పింక్‌ప్యాంథర్స్‌ను చిత్తుచేసింది. జైపూర్ రైడర్ నితిన్ కుమార్(13)కి తోడు అలీ, సాహిల్, రేజా రాణించారు. ఇక టైటాన్స్ జట్టు కెప్టెన్ విజయ్ మాలిక్(8) ఆల్‌రౌండ్ ప్రదర్శనకు తోడు చేతన్(5) రైడ్ పాయింట్లు, దుహాన్, అజిత్ పవార్ డిఫెండర్లు రాణించారు. ఇక పుణేరి పల్టన్స్-దబాంగ్ ఢిల్లీ జట్ల మధ్య జరిగిన మరో లీగ్ మ్యాచ్ 28-28పాయింట్లతో టై అయ్యింది. టై బ్రేకర్‌లో ఇరుజట్లు 5-5పాయింట్లతో సమంగా నిలిచాయి. గోల్డెన్ రైడ్‌లో దబాంగ్ ఢిల్లీ రైడర్ ఆషు మాలిక్ 2పాయింట్లు సాధించడంలో ఆ జట్టు విజయం సాధించింది.

ప్రొ కబడ్డీలో నేడు..

యు ముంబ x బెంగళూరు బుల్స్(రాత్రి 8.00గం॥లకు)

హర్యానా స్టీలర్స్ x యుపి యోధాస్(రాత్రి 9.00గం॥లకు)

క్రికెట్‌కు అమిత్ మిశ్రా గుడ్‌బై

ఛండీగఢ్: భారత వెటరన్ స్పిన్నర్ అమిత్ మిశ్రా అన్ని ఫార్మాట్‌ల క్రికెట్‌కు వీడ్కోలు పలుకుతున్నట్లు ప్రకటించాడు. తన స్పిన్ మ్యాజిక్‌తో టీమిండియా ప్రధాన అస్త్రంగా మారిన మిశ్రా.. క్రికెట్‌నుంచి వైదొలుగుతున్నట్టు ట్విటర్(ఎక్స్)లో గురువారం వెల్లడించాడు. 'నాకెంతో సంతోషాన్నిచ్చే ఆటకు రిటైర్మెంట్ చెబుతున్నా... ఈ సుదీర్ఘ ప్రయాణంలో నాకు అవకాశం కల్పించినందుకు బిసిసిఐ, హర్యానా క్రికెట్‌కు ధన్యవాదాలు. నా ప్రతి అడుగులో ఎంతగానో సహకరించిన కోచ్‌లు, సహాయక సిబ్బంది.. మరీ ముఖ్యంగా అభిమానులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నా' అని మిశ్రా పేర్కొన్నాడు. దేశవాళీలో అద్భుత ప్రదర్శనతో సెలెక్టర్ల దృష్టిలో పడిన మిశ్రా 2003లో అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేశాడు. 2017లో చివరి అంతర్జాతీయ మ్యాచ్ ఆడాడు. ఆ త ర్వాత నుంచి అవకాశాల కోసం ఎదురుచూసినా సెలెక్టర్ల నుంచి పిలుపు రాలేదు. భారత జట్టు తరఫున 22 టెస్టులు, 36 వన్డేలు, 10 టీ20లు ఆడాడీ లెగ్ స్పిన్నర్. మూడు ఫార్మాట్లలో కలిపి 156 వికెట్లు పడగొట్టాడు. 2008లో టెస్టుల్లో అరంగేట్రం చేసిన మిశ్రా తొలి మ్యాచ్‌లోపే 5 వికెట్లతో మెరిశాడు. ఐపిఎల్ టోర్నీ ఏకంగా మూడు హ్యాట్రిక్స్‌తో చరిత్ర సృష్టించాడు. ఢిల్లీ డేర్‌డెవిల్స్ తరఫున 2008లో, దక్కన్ ఛార్జర్స్ ప్లేయర్‌గా 2011లో, సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆటగాడిగా 2013లో హ్యాట్రిక్ తీశాడు. మిస్టరీ బౌలర్‌గా ముద్ర పడిన అతడు162 మ్యాచుల్లో 174 వికెట్లు తీసి అరదహెూ అనిపించాడు. చివరిసారిగా ఐపిఎల్ 17వ సీజన్‌లో లక్నో సూపర్ జెయింట్స్‌కు ప్రాతినిధ్యం వహించాడు.

డెంగీ లక్షణాలతో బాలుడు మృతి

ప్రజాశక్తి - ఉరవకొండ

డెంగీ లక్షణాలతో చిన్నారి మృతి చెందిన సంఘటన ఉరవకొండ మండలం రాకెట్ల గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన దళిత రామాంజనేయులు, సుహాసిని దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె , రెండవ కుమారుడైన తనీష్(6) కొద్దిరోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. గత శనివారం రాకెట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో చూపించగా అక్కడ రక్త పరీక్ష కేంద్రం లేకపోగా ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చారు. బాలుడిని పరీక్షించిన వైద్యులు మెరుగైన చికిత్స కోసం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.అక్కడ రెండు రోజులుగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు.

ముగ్గురు చిన్నారులను సజీవ దహనం చేసిన తండ్రి

- ఆపై తాను ఆత్మహత్య
- నాగర్‌కర్నూల్ జిల్లాలో ఘోరం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

భార్యతో గొడవ పడి ఆ కోపంలో ముగ్గురు పిల్లలను తీసుకుని ఇంట్లో నుంచి బైక్‌పై బయటకొచ్చిన ఓ వ్యక్తి.. ఆ చిన్నారులను సజీవ దహనం చేశాడు.. ఆ తర్వాత అతను పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం తండ్రి మృతదేహం లభ్యం కాగా.. చిన్నారుల ఆచూకీ కోసం పోలీసులు గాలించారు. ఎట్టకేలకు మృతదేహాలను గుర్తించారు. ఈ ఘటన నాగర్‌కర్నూల్ జిల్లాలో తీవ్ర కలకలం సృష్టించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెం మండలం పెద్దబోయపల్లి గ్రామానికి చెందిన గుత్తా వెంకటేశ్వర్లు ఫర్టిలైజర్ వ్యాపారం చేసేవారు. గత నెల 30న వెంకటేశ్వర్లు భార్య దీపికతో గొడవపడి ముగ్గురు పిల్లలను తీసుకొని మోటార్ సైకిల్‌పై ఇంటి నుంచి బయటకొచ్చారు. ఆ తర్వాత తిరిగి ఇంటికి రాకపోవడంతో దీపిక స్థానికంగా పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు విచారణ చేపట్టారు. బుధవారం తెల్లవారుజామున వెల్దండ మండలం పెద్దాపూర్ రెవెన్యూ శివారులో ఓ మృతదేహం లభ్యం కాగా.. అతని వద్ద లభించిన ఆధారాలతో ప్రకాశం జిల్లాకు చెందిన వెంకటేశ్వర్లుగా పోలీసులు గుర్తించారు. వెంటనే ఆ రాష్ట్ర పోలీసులకు సమాచారం అందించారు. అప్పటికే అతని భార్య ఫిర్యాదు చేసినందున.. వెంట ఉన్న పిల్లలు కనిపించకపోవడంతో విచారణ చేపట్టారు.

నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం హాజీపూర్ వద్ద ఓ హోటల్ తదితర ప్రాంతాల్లో ఉన్న సిసి ఫుటేజీలను పరిశీలించారు. వెంకటేశ్వర్లు ఇంటి నుంచి బయలుదేరి శ్రీశైలం మీదుగా అచ్చంపేట, కల్వకుర్తి ప్రాంతానికి చేరుకున్నాడు. మధ్యలోనే ఇద్దరు చిన్నారులను పెట్రోల్ పోసి సజీవ దహనం చేశాడు. మరో చిన్నారిని ఇంకోచోట పెట్రోల్ పోసి కాల్చేసినట్టు ప్రాథమిక దర్యాప్తులో పోలీసులు తేల్చారు. ఉప్పునుంతల మండలం సూర్యతండా సమీపంలోని శివారు ప్రాంతంలో లభ్యమైన రెండు మృతదేహాలు వెంకటేశ్వర్లు చిన్న కుమార్తె వర్షిణి (6), కుమారుడు శివ వర్మ (4)గా నిర్ధారించారు. కల్వకుర్తి మండలం తాండ్ర గ్రామం మస్కటి ఐస్‌క్రీమ్ పార్లర్ సమీపంలో పెద్ద కుమార్తె మోక్షిత (8) మృతదేహాన్ని వంగూరు పోలీసులు కనుగొన్నారు. పూర్తిగా కాలిపోయి, గుర్తుపట్టలేని విధంగా మాంసం ముద్దలుగా మారాయి. సంఘటనా స్థలాలను పరిశీలించిన అచ్చంపేట, వెల్దండ పోలీసులు తన భార్యతో గొడవల వల్లే వెంకటేశ్వర్లు ఈ దారుణానికి పాల్పడ్డాడా? మరేదైనా కారణాలు ఉన్నాయా? అన్న కోణాల్లో పోలీసులు విచారణ చేస్తున్నారు.

నల్లపురెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణ 8కి వాయిదా

ప్రజాశక్తి-అమరావతి

మాజీ సిఎం, వైసిపి చీఫ్ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెల్లూరు పర్యటన సమయంలో తన విధులకు ఆటంకం కలిగించారని పేర్కొంటూ స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్ మాలకొండయ్య చేసిన ఫిర్యాదు మేరకు నమోదైన కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ కోవూరు మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను గురువారం హైకోర్టు విచారించింది. ఈ కేసును కొట్టేయాలని నల్లపురెడ్డి గతంలో వేసిన మరో పిటిషన్‌తో కలిపి దీనిని కూడా విచారిస్తామని జస్టిస్ యడవల్లి లక్ష్మణరావు గురువారం ప్రకటించారు. విచారణను ఈ నెల 8కి వాయిదా వేశారు.

యుద్ధ విరమణకు సిద్ధం : హమాస్

- ఆగని ఇజ్రాయిల్ దాడులు - మరో 45 మంది మృతి

గాజా స్ట్రిప్ : గాజాలో ఇజ్రాయిల్ మారణహోమం అస్సలు ఆపటంలేదు. హమాస్ చర్చలకు వచ్చినా..క్షిపణి దాడులు ఆపబోమని ఇజ్రాయిల్ అధ్యక్షులు నెతన్యాహు యుద్ధోన్మాదంతో ఊగిపోతున్నారు. అయితే ఇజ్రాయిల్ తమ షరతులకు అంగీకరిస్తే యుద్ధ విరమణకు తాము సిద్ధంగా ఉన్నామని సాయుధ తిరుగుబాటు సంస్థ హమాస్ స్పష్టం చేసింది. గాజా నిర్వహణకు స్వతంత్ర జాతీయ పరిపాలన ఏర్పాటు చేయాలని సూచించింది. ఇజ్రాయిల్ బందీలను విడుదల చేయటానికి సిద్ధంగా ఉన్నామని తెలిపింది. అయినప్పటికీ ఇజ్రాయిల్ దురాక్రమణ చర్యలు ఆగడం లేదు.

ఇజ్రాయిల్ అమానవీయ దాడుల్లో గాజాలో ఇప్పటి వరకు 63,746 మంది మరణించారు. 161,245 మంది గాయపడ్డారు. అక్టోబర్ 7 దాడుల సమయంలో ఇజ్రాయిల్‌లో మొత్తం 1,139 మంది మరణించారు. దాదాపు 200 మంది బందీలుగా ఉన్నారు. గాజా నగరంలోని నివాస ప్రాంతాలు, తాత్కాలిక శిబిరాలపై ఇజ్రాయిల్ బాంబు దాడులను తీవ్రతరం చేస్తోంది. గురువారం తెల్లవారుజాము నుంచి జరిపిన క్షిపణి దాడుల్లో కనీసం 45 మంది పాలస్తీనియన్లు మరణించారు.

బ్రిటన్‌లో నిరసనల వెల్లువ

పాలస్తీయన్లపై ఇజ్రాయిల్ సాగిస్తున్న నరమేధానికి వ్యతిరేకంగా ప్రపంచవ్యాప్తంగా నిరసనలు, ఆందోళనలు ఉధృతమవుతున్నాయి. తాజాగా యూకేలోని కాస్మోటిక్స్ విక్రయించే షాపులు గురువారం మూసివేశాయి. తక్షణమే యుద్ధాన్ని ఆపాలని కోరుతూ ఒకరోజు సౌందర్య సాధనాల విక్రయాలను నిలిపివేశారు. గాజాలోని పాలస్తీనియన్లకు సంఘీభావంగా తాము ఈ నిర్ణయం తీసుకున్నట్టు బ్రిటిష్ కాస్మోటిక్ షాపు నిర్వాహకులు తెలిపారు.

అత్యాచారం కేసులో సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌కు బెయిల్

న్యూఢిల్లీ : 40 ఏళ్ల మహిళపై అత్యాచారం కేసులో 23 ఏళ్ల సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌కు సుప్రీంకోర్టు గురువారం బెయిల్ మంజారు చేసింది. నిందితుడుపై తప్పుడు ఆరోపణలు చేశారని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. నోటీసు జారీ చేసినా ఫిర్యాదు చేసిన మహిళ కోర్టుకు హాజరుకావడం లేదని కోర్టు గుర్తించింది. నిందితుడు తొమ్మిది నెలలు జైల్లో ఉన్నా అభియోగాలు నమోదు కాలేదని, ఫిర్యాదు చేసిన మహిళ 'చిన్న పిల్ల కాదు', 'ఒంటి చేత్తో చప్పట్లు కొట్టలేం' అని జస్టిస్ బివి నాగరత్న, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా ధర్మాసనం వ్యాఖ్యానించింది.

నిందితుడుతో మహిళ స్వచ్ఛందంగా వెళ్లినప్పుడు ఢిల్లీ పోలీసుల అతనిపై అత్యాచార కేసు ఎలా నమోదు చేయగలరని కూడా ధర్మాసనం ప్రశ్నించింది. 'ఈ మహిళ జమ్మూకు ఏడుసార్లు వెళ్లినా భర్తకు ఎలాంటి ఇబ్బంది లేదు' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ కేసులో ఢిల్లీ హైకోర్టు బెయిల్ నిరాకరించడంతో నిందితుడు సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

నైజీరియాలో పడవ ప్రమాదం

- 60 మంది మృతి

అబుజా : నైజీరియాలో జరిగిన పడవ ప్రమాదంలో 60 మంది మృతి చెందారు. నైజర్ రాష్ట్రంలో బోర్గు ప్రాంతంలోని గౌసావా కమ్యూనిటీకి సమీపంలో మాలి నదిలో స్థానిక కాలమానం ప్రకారం.. మంగళవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో ఈ విషాదం చోటుచేసుకుంది. సామర్థ్యానికి మించి ప్రయాణికులు ఉన్నందునే పడవ ప్రమాదానికి గురైనట్లు అధికారులు తెలిపారు. ప్రమాద సమయంలో పడవలో వంద మంది పైగా ఉన్నట్లు పేర్కొన్నారు. మలాలే జిల్లాలో తుంగన్ సులే పట్టణం నుంచి దుగ్గ పట్టణానికి ఈ పడవ వెళ్లాల్సివుంది. అయితే మార్గమధ్యలో నది జలాల్లోని ఒక దుంగను ఢీకొనడంతో పడవ బోల్తా పడిందని నైజర్ రాష్ట్ర అత్యవసర నిర్వహణ సంస్థ బుధవారం తెలిపింది. ఈ ప్రమాదం నుంచి 24 మందికి పైగా రక్షించామని వెల్లడించింది. 10 మంది మంది పరిస్థితి విషమంగా ఉందని, మిగిలిన వారి గాలింపు చర్యలను కొనసాగిస్తున్నట్లు తెలిపింది. కాగా, నైజీరియాలో పడవ ప్రమాదాలు తరచుగా సంభవిస్తుంటాయి. ముఖ్యంగా మార్చి నుంచి అక్టోబర్ వరకూ వర్షాకాలంలో నదులు, సరస్సులు పొంగిపొర్లుతుంటాయి. సరైన భద్రతా సౌకర్యాలు లేకపోవడం, రద్దీ వంటి కారణాలతో ప్రమాదాలు జరుగుతుంటాయి.

దర్గాలు మాత్రమే కనిపిస్తున్నాయా ?

- మిగిలిన ఆక్రమణల మాటేమిటి..
- హిందూత్వ ఎన్‌జిఓను నిలదీసిన ఢిల్లీ హైకోర్టు

న్యూఢిల్లీ : 'మీకు దర్గాలే కనిపిస్తున్నాయా? మిగిలిన ఆక్రమణలేవీ కానరావడం లేదా? ఎందుకు దర్గాలను, మజార్లను మాత్రమే టార్గెట్ చేశారు' అని ఒక విచారణ సందర్భంగా 'సేవ్ ఇండియా' అనే హిందూత్వ స్వచ్ఛంద సంస్థను ఢిల్లీ హైకోర్టు నిలదీసింది. యమునా నదీ పరీవాహక ప్రాంతాల్లో అక్రమంగా నిర్మించిన మూడు దర్గాలను, మజార్‌ను తొలగించేందుకు ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ 'సేవ్ ఇండియా' పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై ప్రధానన్యాయమూర్తి జస్టిస్ డికె ఉపాధ్యాయ, జస్టిస్ తుషార్‌రావుతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. సదరు సంస్థ కేవలం దర్గాలను మాత్రమే లక్ష్యంగా పిటిషన్ దాఖలు చేయడంపై జస్టిస్ ఉపాధ్యాయ ఆందోళన వ్యక్తం చేశారు. 'ఇతర ఆక్రమణలేవీ మీకు కనబడలేదా? కేవలం మజార్‌లను మాత్రమే ఎందుకు గుర్తించారు?' అని ప్రశ్నించారు. దర్గాలను తొలగించాలని కోరుతూ ఇప్పటికి ఇది ఐదవదో లేక ఆరవదో ఇలా పిటిషన్ వేయడం, ఈ బెంచ్ విచారించడం..అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ప్రజలకు సేవ చేయాలనుకుంటే చాలా మార్గాలు, అవకాశాలు వున్నాయి, ఒకసారి కూర్చుని ఆలోచించుకుని, ఇంతకన్నా మెరుగైన సేవలు ఎలా అందించగలరో ఆలోచించండి అంటూ 'సేవ్ ఇండియా ఫౌండేషన్' అధ్యక్షుడు ప్రీత్ సింగ్‌కు ధర్మాసనం తలంటింది. ముస్లిం కమ్యూనిటీకి వ్యతిరేకంగా విద్వేష ప్రచారాలు వ్యాప్తి చేస్తారని ప్రీత్ సింగ్‌పై విమర్శలున్నాయి. విద్వేష ప్రసంగానికి సంబంధించిన కేసులో సింగ్ ప్రస్తుతం బెయిల్‌పై వున్నాడు.

ఆఫ్రికా ఎదుర్కొంటున్న సవాళ్ల పరిష్కారానికి

రష్యాలో తొలి అంతర్జాతీయ సదస్సు

మాస్కో : ఆఫ్రికన్ దేశాలు ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించే దిశగా ఒక కార్యాచరణ సిద్ధం చేయడానికి రష్యా నడుం బిగించింది. ఇదే ప్రధానాంశంగా ఈ నెల 20, 21 తేదీల్లో మొట్టమొదటి వరల్డ్ పబ్లిక్ అసెంబ్లీకి మాస్కో ఆతిథ్యం ఇవ్వనుంది. విద్య, సంస్కృతి, క్రీడలుపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరించి చర్చలు జరగనున్న ఈ కార్యక్రమంలో 150 దేశాలకు చెందిన ప్రతినిధులు పాల్గొంటారు. ఆఫ్రికన్ దేశాలు ఎదుర్కొంటున్న పలు సవాళ్ళ పరిష్కారంపై ఈ సమావేశం ప్రధానంగా దృష్టి సారించనుంది. బహుళ ధ్రువ అంతర్జాతీయ వ్యవస్థలో ఆఫ్రికా ఖండ మానవతా, ఆర్థికాభివృద్ధికి సంబంధించిన అత్యవసర సమస్యల పరిష్కారంలో ప్రజా దౌత్యం పాత్రను చర్చించడమన్నది ఈ వేదిక కీలకాంశంగా వుంది. ఆఫ్రికా ఖండంలో దేశాల మధ్య సంబంధాలు బలంగా వున్నాయని, ఆఫ్రికన్ ఖండ స్వేచ్ఛా వాణిజ్య ప్రాంతం ఏర్పాటులోనే ఈ విషయం స్పష్టమవుతోందని నిర్వాహకులు వ్యాఖ్యానించారు.

పుతిన్ ఆఫ్రికా మిత్రుడు : నెల్సన్ మండేలా మనవడు

రష్యా అధ్యక్షులు వ్లాదిమిర్ పుతిన్ ఆఫ్రికా మిత్రుడని నల్ల సూరీడు నెల్సన్ మండేలా మనవడు ఎన్‌కొసి జ్వెలివిలె మండేలా అన్నారు. జోహాన్నెస్‌బర్గ్‌లో ఆయన మాట్లాడుతూ.. ఆఫ్రికా ఖండం అణచివేతకు గురవుతున్న కాలంలో ఆయన తమకు ఎంతగానో సహకారం అందించారని కొనియాడారు. చరిత్రను ఒకసారి పరిశీలిస్తే, వలస పాలనకు వ్యతిరేకంగా ఆఫ్రికా ఖండంలో అంగోలా, మొజాంబిక్ వంటి దేశాల్లో సాగిన అనేకానేక స్వాతంత్రోద్యమాలకు అండగా మాస్కో నిలబడింది. ఆఫ్రికా దేశాల్లో నిర్మించిన ప్రధాన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు సోవియట్ సాంకేతిక నిపుణులు సాయమందించారు. రష్యా యూనివర్శిటీల్లో ఆఫ్రికా విద్యార్థులు అనేకమంది చదువుకున్నారు. గ్లోబల్ గవర్నెన్స్‌లో ఆఫ్రికాను కూడా చేర్చాలని ఐక్యరాజ్య సమితిలో రష్యా చాలాకాలంగా తన వాణిని వినిపిస్తోంది.

అమెరికాకు లొంగితే వ్యవసాయానికి ఉరితాడే

- ఆహార భద్రతకు పెనుప్రమాదం
- ఎఐఎడబ్ల్యుయు పుస్తక ఆవిష్కరణలో రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నేతలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో


హన్నన్ మొల్లా అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

అమెరికా ఒత్తిడితో టారిఫ్‌లను అంగీకరిస్తే దేశ వ్యవసాయ రంగానికి ఉరితాడే అవుతోందని రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు విమర్శించారు. అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం చరిత్రపై రైతు నేత, మాజీ ఎంపి హన్నన్ మొల్లా రాసిన పుస్తకాన్ని గురువారం రైతు సంఘం కార్యాలయంలో ఆవిష్కరించారు. రచయితతో కలిసి పుస్తకాన్ని ఎఐకెఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అశోక్ దావలే, విజూ కృష్ణన్, వ్యవసాయ కార్మిక సంఘ ప్రధాన కార్యదర్శి బి. వెంకట్, సహాయ కార్యదర్శి విక్రమ్ సింగ్, సిఐటియు కార్యదర్శి సాయిబాబు, ఎస్‌ఎఫ్ఐ నేత ఆదర్శ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అమెరికా టారిఫ్‌లు పెంచేది, తమ వ్యవసాయ ఉత్పత్తులను ఎలాంటి దిగుమతి సుంకాలు లేకుండా భారత్‌తో ఒప్పందాలు చేసుకోవడం కోసమేనని, ఈ విషయాన్ని ట్రంప్ బహిరంగంగా ప్రకటించారని తెలిపారు.

మోడీ ప్రభుత్వం లొంగితే దేశ వ్యవసాయ రంగం విచ్ఛిన్నం అవుతుందని హెచ్చరించారు. మన ప్రధాన వ్యవసాయ ఉత్పత్తులు గోధుమ, డైరీ సర్వనాశనం అవుతాయని, వరి పంటను కంపెనీలు నియంత్రిస్తాయని, . ఆహార భద్రతకు పెను ముప్పు పొంచి ఉందని అన్నారు. వ్యవసాయ రంగాన్ని దెబ్బతీస్తే మన సహజ వనరులను దోసుకోవచ్చని సామ్రాజ్యవాదులు కుట్రలని విమర్శించారు. ఇదే జరిగితే మన దేశం నయా వలస వాదానికి దారి తీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. కాబట్టి టారిఎఫ్‌కు అంగీకరించకుండా ప్రభుత్వంపై ఒత్తిడి కొనసాగించాలని అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం చరిత్రను రచించిన హన్నన్ మొల్లాను అందరూ అభినందించారు. మహాసభల సందర్భంగా తీసుకున్న నిర్ణయాలు ఎంతో అద్భుతంగా వివరించారని తెలిపారు. ఈ ఆవిష్కన సభలో ప్రజా సంఘాల నేతలు మజుందార్, ఇంద్రజిత్, బాదల్, పాండ్యన్, విమల్ పలివాల్, బాబు, మనోజ్, త్యాగి తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఐఆర్‌ఎఫ్ ర్యాంకుల్లో వరుసగా

ఏడోసారి అగ్రస్థానంలో ఐఐటి మద్రాస్

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా అన్ని విభాగాల్లో అత్యుత్తమ విద్యాసంస్థగా ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ- మద్రాస్ (ఐఐటీ మద్రాస్) మరోసారి తన స్థానాన్ని పదిలపరుచుకుంది. వరుసగా ఏడోసారి అగ్రస్థానంలో నిలవడం విశేషం. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్‌సీ) బెంగళూరు, ఐఐటీ ముంబయి ఈ కేటగిరీలో వరుసగా రెండు, మూడోస్థానాల్లో నిలిచాయి. గతేడాది ఇవి వరుసగా రెండు, మూడు స్థానాల్లో నిలవడం గమనార్హం.నేషనల్ ఇనిస్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్ (ఎన్ఐఆర్‌ఎఫ్) -2025 రూపొందించిన పదవ ఎడిషన్‌ను కేంద్ర విద్యాశాఖ మంత్రి గురువారం విడుదల చేశారు. ఎన్ఐఆర్‌ఎఫ్ పదవ ఎడిషన్‌లో 17 విభాగాలకు అవార్డులు ప్రకటించామని కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పేర్కొన్నారు. మరిన్ని సంస్థలు ఈ జాబితాలో చేరాయని అన్నారు. ఇది మన ఉన్నత విద్యారంగం సాధించిన స్థిరమైన వృద్ధిని చూపుతోందని అన్నారు.



బెంగళూరులోని నేషనల్ లా స్కూల్ ఆఫ్ ఇండియా దేశంలోనే అత్యుత్తమ లా కాలేజీగా, ఢిల్లీలోని ఎయిమ్స్ ఉత్తమ వైద్య, దంత కళాశాలగా ర్యాంక్ సాధించాయి. ఢిల్లీలోని ఇండియన్ అగ్రికల్చర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ వ్యవసాయానికి ఉత్తమ విద్యాసంస్థగా ఎంపికైంది. అలాగే పరిశోధనలో బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఉత్తమంగా నిలిచింది. ఇన్నోవేషన్ ర్యాంకింగ్ విభాగంలో ఐఐటీ -మద్రాస్ మొదటి స్థానంలో నిలవడమే కాక ఉత్తమ ఇంజనీరింగ్ సంస్థ హోదాను కూడా పొందింది. రెండో స్థానంలో ఐఐటీ -ఢిల్లీ నిలిచింది.ఉత్తమ రాష్ట్ర ప్రభుత్వ యూనివర్సిటీగా కోల్‌కతాలోని జాదవ్‌పూర్ యూనివర్సిటీ, చెన్నైలోని అన్నా యూనివర్సిటీలు నిలిచాయి. ఉత్తమ ఓపెన్ యూనివర్సిటీగా ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ-ఢిల్లీ, స్కిల్స్‌లో ఉత్తమ యూనివర్సిటీగా సింబయాసిస్ స్కిల్స్ అండ్ ప్రొఫెషనల్ యూనివర్సిటీగా నిలిచింది.ఉత్తమ యూనివర్సిటీగా ఐఐఎస్‌సీ బెంగళూరు అత్యుత్తమ ర్యాంక్ పొందగా, జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యూ), న్యూఢిల్లీ మణిపాల్ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ వరుసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి.మేనేజ్‌మెంట్ విభాగంలో ఉత్తమ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం) అహ్మదాబాద్ అత్యుత్తమ ర్యాంకును సాధించగా, ఐఐఎం బెంగళూరు, ఐఐఎం కోజికోడ్‌లు తరువాతి స్థానాల్లో నిలిచాయి.

బతకాలంటే

రూ.500 కోట్లు ఇవ్వు

- మధ్యప్రదేశ్‌లో మహిళా జడ్జికి 'హనుమాన్ ముఠా' పేరుతో లేఖ

భోపాల్: మహిళా న్యాయమూర్తికి బెదిరింపు లేఖ అందింది. బతికి ఉండాలంటే ఐదు బిలియన్లు (రూ.500 కోట్లు) ఇవ్వాలని అందులో పేర్కొన్నారు. బందిపోటు నాయకుడు హనుమాన్ ముఠా సభ్యుడి పేరుతో అందిన స్పీడ్ పోస్ట్ కలకలం రేపింది. మధ్యప్రదేశ్‌లోని రేవా జిల్లాలో ఈ సంఘటన జరిగింది. తియోంథార్‌లోని మొదటి సివిల్ జడ్జి మోహినీ భదోరియాకు ఒక స్పీడ్ పోస్ట్ అందింది. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ నుంచి పంపిన అందులో బెదిరింపు లేఖ ఉన్నది. 'నువ్వు బతికి ఉండాలనుకుంటే ఐదు బిలియన్లు (రూ.500 కోట్లు) చెల్లించాలి. సెప్టెంబర్ 1న సాయంత్రం 7:45 గంటలకు ఉత్తరప్రదేశ్‌లోని బద్‌గడ్ అడవిలో ఆ డబ్బు అందజేయాలి. దీనిని విస్మరిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయి' అని ఆ లేఖ ద్వారా హెచ్చరించారు. గతంలో మధ్య భారత్‌ను తారెత్తించిన చంబల్ బందిపోటు నాయకుడు 'హనుమాన్ ముఠా'కు విధేయుడిగా పేర్కొన్న వ్యక్తి సంతకం ఉన్నది. కాగా, జడ్జికి అందిన ఈ బెదిరింపు లేఖ కోర్టులో కలకలం రేపింది. ఇది చూసి న్యాయమూర్తి మోహినీ భదోరియా షాకయ్యారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో జిల్లా ఎస్పీ వివేక్ సింగ్ వెంటనే స్పందించారు. దర్యాప్తు కోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ జిల్లాకు చెందిన ఒక అనుమానితుడిని గుర్తించారు. అతడ్ని అరెస్ట్ చేసేందుకు పోలీస్ బృందాలను పంపారు. అలాగే రేవాలోని కోర్టులు, న్యాయమూర్తుల భద్రతను కట్టుదిట్టం చేశారు.

ట్రంప్ సర్కార్‌కు ఎదురుదెబ్బ

- హార్వర్డ్‌కు నిలిపివేసిన నిధులను ఇవ్వాలని ఫెడరల్ కోర్టు ఆదేశం

వైట్‌హౌస్: హార్వర్డ్ నిధుల విషయంలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌నకు ఎదురుదెబ్బ తగిలింది. యూనివర్సిటీకి అందించే 2.6 బిలియన్ డాలర్ల నిధుల నిలిపివేస్తూ ట్రంప్ సర్కార్ తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఫెడరల్ కోర్టు ఆదేశించింది. హార్వర్డ్ తన పాలన విధానాల్లో మార్పు కోసం వైట్‌హౌస్ చేసిన డిమాండ్లను తిరస్కరించినందుకు ట్రంప్ సర్కార్ తీసుకున్న ప్రతీకార చర్య అని తీర్పునిచ్చింది. యూనివర్సిటీలో యూదులపై వ్యతిరేకత విషయానికి ఈ నిధుల కోతకు సంబంధం లేదని పేర్కొంది. ఫెడరల్ నిధులను నిలిపివేయడాన్ని సమర్థించేందుకు యూదులపై వ్యతిరేకతను కవచంగా వాడారని తెలిపింది. ఇది స్పష్టమైన రాజకీయ ప్రతీకారమని వెల్లడించింది. ఈ తీర్పుతో హార్వర్డ్‌కు గణనీయమైన విజయం లభించింది. కోతల కారణంగా నిలిచిన వందలాది రీసెర్చ్ ప్రాజెక్టులకు పునర్జీవం లభించనుంది.

హార్వర్డ్ యూనివర్సిటీలో జరిగే నియామక పద్ధతులు, ప్రవేశ విధానాలలో మార్పులు చేయాలని, ఫేస్ మాస్క్‌లను నిషేధించాలని ట్రంప్ నేతృత్వంలోని పరిపాలన విభాగం ఓ లేఖను పంపించింది. పాలస్తీనా అనుకూల నిరసనలను అణచివేసేందుకు ఈ నిబంధనలను జారీ చేసినట్టుగా సమాచారం. దీనిపై స్పందించిన హార్వర్డ్ విశ్వవిద్యాయలయం ప్రెసిడెంట్ అలాన్ గార్బర్ ఆ డిమాండ్లను వ్యతిరేకిస్తున్నట్టు బదులిచ్చారు. ఏ ప్రభుత్వమైనా విశ్వవిద్యాలయాల్లో ఏం బోధించాలి, ఎవరిని చేర్చుకోవాలి, నియమించుకోవాలి లేదా ఏ రంగాలను ఎంచుకోవాలో నిర్దేశించకూడదని తెలిపారు. దీనిని తీవ్రంగా పరిగణించిన ట్రంప్ ప్రభుత్వం, హార్వర్డ్‌కు అందే నిధులను స్తంభింపజేయాలని నిర్ణయించింది. పౌర హక్కులను ఉల్లంఘించారనే ఇప్పటికే కొలంబియా, పెన్సిల్వేనియాతో సహా కార్నెల్, నార్త్ వెస్ట్రన్ విశ్వవిద్యాలయాలకు అందించే నిధులను ట్రంప్ సర్కార్ నిలిపివేసింది.

ఆ తర్వాత అమెరికా ప్రభుత్వం 2025-26 విద్యా సంవత్సరం నుంచి హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో విదేశీ విద్యార్థుల ప్రవేశాలపై నిషేధం విధించింది. ట్రంప్ సర్కారు నిర్ణయం తర్వాత హార్వర్డ్ ఇకపై కొత్త విదేశీ విద్యార్థులను అడ్మిషన్లు ఉండవు. ఇప్పటికే యూనివర్సిటీలో చదవుతున్న విదేశీ విద్యార్థులు మరొక విశ్వవిద్యాలయానికి బదిలీ కావాల్సి ఉంటుంది. లేకపోతే అమెరికాను విడిచి వెళ్లాల్సి ఉంటుంది. ఈ రెండింటిలో ఏది చేయకపోయినా చట్టపరమైన చర్యలు ఉంటాయని ట్రంప్ సర్కార్ హెచ్చరించారు.

140 కంటే ఎక్కువ దేశాల నుంచి

అమెరికాలోని పురాతన, సంపన్న విశ్వవిద్యాలయాల్లో హార్వర్డ్‌ఒకటి. హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో 140 కంటే ఎక్కువ దేశాల నుంచి ఏటా అడ్మిషన్లు పొందుతున్నారు. ఒక్క మసాచుసెట్స్‌లోని హార్వర్డ్ కేంబ్రిడ్జ్ క్యాంపస్‌లోనే దాదాపు 6,800 మంది విదేశీ విద్యార్థులు చేరుతున్నారు. వీరిలో ఎక్కువ మంది గ్రాడ్యుయేట్ విద్యార్థులే.

ఢిల్లీలోని లోహ పుల్ (ఓల్డ్ ఐరన్ బ్రిడ్జి) వద్ద వంతెనను ఆనుకొని ప్రవహిస్తున్న యమున

దేశ రాజధాని అతలాకుతలం

- భారీ వర్షాలతో జనం విలవిల
- ఉధృతంగానే యమున

న్యూఢిల్లీ. ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు దేశ రాజధానిప్రాంతం ఢిల్లీ-ఎన్‌సీఆర్ అతలాకుతలమవుతున్నది. కుండపోత వర్షాలకు జనజీవనం స్తంభించిపోయింది. వర్షాల కారణంగా యమునా నది ఉప్పొంగింది. మూడు రోజులుగా డేంజ్‌మార్క్‌ను దాటి ప్రవహిస్తోంది. దీంతో ఢిల్లీని వరద ముంచెత్తింది. నిరాశ్రయుల కోసం ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాలు కూడా నీటమునిగాయి అధికారిక సమాచారం ప్రకారం.. ఢిల్లీలోని ఓల్డ్ రైల్వే బ్రిడ్జి వద్ద యమునా నది నీటి మట్టం గురువారం ఉదయం 7 గంటలకు 207.48 మీటర్లుగా ఉంది. అదే ఉదయం 5 గంటల సమయంలో 207.47 మీటర్లుగా ఉంది. తెల్లవారుజామున 2 గంటల నుంచి 5 గంటల మధ్య నదిలో నీటి మట్టం 207.47 మీటర్ల వద్ద స్థిరంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. 5 గంటల తర్వాత వరద ప్రవాహం పెరుగుతుండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా అలీపుర్ ప్రాంతంలో రోడ్డు పైనే లోతుగా గొయ్యి ఏర్పడింది. సివిల్ లైన్స్ ప్రాంతంలో భారీగా వరద నిలిచింది. దీంతో కార్లు నీట మునిగాయి. బేలా రోడ్‌లోని భవనాల్లోకి వరద నీరు ప్రవేశించింది. కాశ్మీర్ గేట్ పరిసరాల్లోనూ వర్షం నీరు నిలిచిపోయింది. ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లో యమునా నది పొంగిపొర్లుతోంది. రోడ్లపైకి నీరు చేరడంతో ట్రాఫిక్ నెమ్మదిగా ముందుకు కదులుతున్నట్టు అధికారులు తెలిపారు.

విమానప్రయాణాలపై ప్రభావం

భారీ వర్షాల తాకిడితో ఢిల్లీ విమానాశ్రయంలో వందలాది విమానాలపై ప్రభావం పడింది. దాదాపు 340కిపైగా విమాన రాకపోకలు ఆలస్యమయ్యాయి. ఎయిర్‌పోర్టుకు సమీపంలో ట్రాఫిక్ జామ్ ఏర్పడటంతో, వేలాది వాహనాలు రోడ్లపైనే నిలిచిపోయాయి. మరోవైపు భారీ వర్షాలు కొనసాగుతున్న నేపథ్యంలో అధికారులు ఢిల్లీక వరద హెచ్చరికలు చేశారు. వరద ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలను అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు.

భారత్.. చైనాపై

యూరప్ ఆంక్షల ప్రణాళిక

- పరిపాలన ఆర్థిక ఒత్తిడి.. ఒక సాధనంగా ట్రంప్ ప్రయోగం
- మీడియాతో మాట్లాడిన రష్యా అధ్యక్షుడు పుతిన్

బీజింగ్: రష్యా ఆర్థిక భాగస్వాములు లక్ష్యంగా చేసుకున్న యూరప్ ఆంక్షల ప్రణాళికలను ఆ దేశ అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ తీవ్రంగా విమర్శించారు. ముఖ్యంగా భారత్, చైనాపై ఇలాంటి చర్యలు తీసుకోవడం కాలం చెల్లిన వలసవాద మనస్తత్వాన్ని ప్రతిబింబిస్తోందని ఆయన అన్నారు. ఈ చర్యలు చారిత్రక సున్నితత్వం కలిగిన దేశాల్లో రాజకీయ పరిణామాలకు దారి తీస్తాయని హెచ్చరించారు. అలాగే ఆసియాలోని రెండు అతిపెద్ద శక్తులను అణగదొక్కడానికి, ట్రంప్ సర్కార్ ఆర్థిక ఒత్తిడిని ఒక సాధనంగా ఉపయోగిస్తోందని ఆరోపించారు. చైనాలో జరిగిన షాంఘై సహకార సంస్థ(ఎస్‌సీఓ) శిఖరాగ్ర సమావేశం అనంతరం సైనిక కవాతులో పాల్గొన్న పుతిన్ అనంతరం మీడియాతో మాట్లాడారు.

భారత్, చైనాలు భాగస్వాములని పుతిన్ అన్నారు. అమెరికా విధించే సుంకాలు ఇరుదేశాల నాయకత్వాన్ని బలహీనపరిచే ప్రయత్నమని అభివర్ణించారు. 1.5 బిలియన్ల జనాభా కలిగిన భారత్, చైనా వంటి శక్తిమంతమైన దేశాలు బలమైన ఆర్థిక వ్యవస్థను కలిగి ఉన్నాయని పేర్కొన్నారు. అలాగే వీటికి ప్రత్యేకమైన రాజకీయ వ్యవస్థలు, దేశీయ చట్టాలు కలిగి ఉన్నాయని తెలిపారు. సుంకాల పేరుతో వారిని శిక్షించే ప్రయత్నాలు చేస్తే అవి ఆ దేశ నాయకులను ప్రమాదంలోకి నెట్టివేస్తాయన్నారు. వారి రాజకీయ ప్రవృత్తులపై చాలా భారం పడుతుందని తెలిపారు. ఈ క్రమంలో ఎవరైనా బలహీనపడితే అతని రాజకీయ జీవితం ముగిసిపోతుందని వ్యాఖ్యానించారు.

'ఇరు దేశాల చరిత్రలో వలసవాదం వంటి కష్టతరమైన కాలం నడిచింది. చాలా కాలం పాటు వారి సార్వభౌమాధికారంపై పన్ను విధించారు. ఇప్పుడు ఆ యుగం ముగిసింది. ఇంకా వాటిని అణగదొక్కేలా మాట్లాడడం సరైనది కాదు. భాగస్వాములతో మాట్లాడేటపుడు సరైన పదాలు ఉపయోగించాలి' అని పుతిన్ పేర్కొన్నారు. ఈ ఉద్రిక్తతలు త్వరలోనే ముగుస్తాయని, పరిస్థితులు మళ్లీ సాధారణ స్థితికి చేరుకుంటాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఇంకా పూర్తి స్థాయిలో ఆంక్షల మోత మోగించలేదు: ట్రంప్

అదనపు సుంకాలతో గత కొద్ది రోజులుగా భారత్.. అమెరికా మధ్య సంబంధాలు క్షీణించాయి. రష్యా నుంచి భారీగా చమురు కొనుగోలు చేస్తోందని అమెరికా భారత్ పై అదనపు సుంకాలు విధించింది. అయితే తాజాగా అమెరికా అధ్యక్షుడు భారత్‌పై విధించిన సుంకాల గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్‌పై ఇంకా పూర్తి స్థాయిలో ఆంక్షల మోత మోగించలేదని అన్నారు. అవి సెకండరీ సుంకాలు మాత్రమేనని, ఆ దేశంపై రెండు, మూడు విడతలు చేపట్టలేదని స్పష్టం చేశారు.

ఒకటికి మించి ఓటరు ఐడీ ఉంటే సరెండర్ చేయాలి

- ఎన్నికల సంఘం

న్యూఢిల్లీ: ఓటరు కార్డులకు సంబంధించి ఎన్నికల సంఘానికి ఇటీవల ఫిర్యాదులు వెల్లువెత్తుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఒకటికి మించి ఓటరు కార్డులు కలిగి ఉండటం నేరమని ఎన్నికల సంఘం పేర్కొంది. ఒకవేళ రెండు, అంతకన్నా ఎక్కువ ఉన్నట్లయితే ఒకదాన్ని మాత్రమే పెట్టుకొని, అదనపు కార్డులను సరెండర్ చేయాలని స్పష్టం చేసింది."రెండు ఓటరు కార్డులను కలిగి ఉండటం ప్రజా ప్రాతినిధ్య చట్టం-1950 ప్రకారం నేరం. సెక్షన్ 31 కింద వారికి గరిష్ఠంగా ఏడాది శిక్ష లేదా జరిమానా లేదా రెండూ ఉండొచ్చు. ఒకవేళ ఎవరి వద్దనైనా రెండు, అంతకంటే ఎక్కువ కార్డులు ఉంటే ఒకటి మాత్రమే తమ వద్ద ఉంచుకోవాలి" అని ఈసీ అధికారులు వెల్లడించారు. ఓటరు జాబితాలో రెండు చోట్ల ఓటరుగా ఉన్నట్లయితే.. ఒకచోట తమ పేరును తొలగించాలని కోరుతూ ఫారం-7 ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇందుకోసం ఆన్‌లైన్‌లోనూ వెసులుబాటు ఉంద న్నారు. బీహార్ డిప్యూటీ సీఎంతో పాటు,కాంగ్రెస్ సీనియర్ నేత, ఆ పార్టీ మీడియా-పబ్లిసిటీ సెల్ చైర్మెన్ పవన్ ఖేరాకు రెండు ఓటరు కార్డులున్నాయనే ఫిర్యాదు రావడంతో ఎన్నికల సంఘం ఇటీవల నోటీసులు జారీ చేసిన విషయం విదితమే.

ఇయు నేతలతో మోడీ చర్చలు

న్యూఢిల్లీ : భారత్-ఇయు శిఖరాగ్ర సదస్సు గురించి యూరోపియన్ నాయకులతో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గురువారం ఫోన్ ద్వారా చర్చించారు. యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షులు ఆంటోనియో కోస్టా, యూరోపియన్ కమిషన్ అధ్యక్షులు ఉర్సులా వాన్ డెర్ లేయన్‌తో ఈ చర్చలు జరిగాయని కేంద్ర ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామిక శక్తులైన భారత్, ఇయు..విశ్వాసం, విలువలు, భవిష్యత్‌పై ఉమ్మడి దృష్టి ప్రాతిపదికన బలమైన, సన్నిహిత సంబంధాలను పంచుకుంటాయని పేర్కొంది. ప్రపంప సవాళ్లను ఎదుర్కొని, సుస్థిరత సాధించడంలో భారత్-ఇయు వ్యూహాత్మక భాగస్వామ్య పాత్రపైనా నేతలు చర్చించారు. కాగా భారత్-ఇయు తదుపరి శిఖరాగ్ర సదస్సును అందరి సమ్మతితో వీలైనంత త్వరగా నిర్వహించడంపైనా చర్చించారు. ఈ సందర్భంగా లేయాన్‌ను, కోస్టాను శిఖరాగ్ర సదస్సుకు మోడీ ఆహ్వానించారు. ఉక్రెయిన్‌లో ఘర్షణలకు తెర దించాల్సిన అవశ్యకతతో పాటు అనేక ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలను నేతలు చర్చించినట్లు కేంద్రం తన ప్రకటనలో పేర్కొంది.

సుప్రీంలో పిన్నెల్లి సోదరులకు ఉపశమనం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

హత్య కేసులో మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణా రెడ్డి సోదరులకు సుప్రీంకోర్టులో ఉపశమనం లభించింది. పల్నాడు జిల్లా టిడిపి నేతలు వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావుల హత్య కేసులో రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు వెంకట్రామిరెడ్డిలకు మధ్యంతర రక్షణ కల్పించింది. ఈ కేసులో వీరు దాఖలు చేసుకున్న ముందస్తు బెయిల్ పిటిషన్‌ను ఆంధ్ర ప్రదేశ్ హైకోర్టు కొట్టివేసింది. దీంతో పిన్నెల్లి సోదరులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆ పిటిషన్‌ను గురువారం సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతా ధర్మాసనం విచారించింది. రాజకీయ ప్రేరేపిత హత్య కేసు అని, పిన్నెల్లి సోదరుల పాత్ర దీనిలో ఉందని ప్రతివాది తోట ఆంజనేయులు తరపు న్యాయవాది వాదనలు వినిపించారు. కాల్ రికార్డులు, ఆధారాలు కూడా విచారణలో బయటపడ్డాయని ధర్మానానికి తెలిపారు. అయితే ఈ వివరాలు అన్ని అఫిడవిట్‌లో చెప్పాలని ధర్మాసనం పేర్కొంది. మూడు వారాల్లో అఫిడవిట్ దాఖలు చేయాలని ప్రతివాదులు రాష్ట్ర ప్రభుత్వం, తోట ఆంజనేయులకు నోటీసులు ఇచ్చి వాయిదా వేసింది. అప్పటి వరకూ మధ్యంతర రక్షణ కల్పించింది. వివరాలు పరిశీలించిన తరువాత, అవసరం అనుకుంటే ఈ రక్షణ రద్దు చేస్తామని ధర్మాసనం పేర్కొంది.

ప్రైవేట్‌కు ఆరోగ్యశ్రీ

(మొదటిపేజీ తరువాయి)

ఇండియా సంస్థకు 13.7 ఎకరాలు, జె కుమార్ ఇన్‌ఫ్రా ప్రాజెక్టు లిమిటెడ్‌కు విశాఖ జిల్లా పెందుర్తిలో 63.37 ఎకరాలు కేటాయింపు. సత్యసాయి జిల్లా ఎన్‌పి కుంట మర్రికొమ్మదిన్నె గ్రామంలో రెఫెక్స్ సోలార్ ఎస్‌పివి ఫైవ్ లిమిటెడ్‌కు ప్రభుత్వ భూమి అందుబాటులో ఉంటే కేటాయింపు.నాయుడుపేటలో సిర్మా ఎస్‌జిఎస్ టెక్నాలజీ లిమిటేడ్, ఈ కంపెనీకి జాయింట్ వెంచర్లకు 26.70 ఎకరాల భూమి కేటాయింపు. మంగళగిరి మండలం ఆత్మకూరులో రత్నాలు, ఆభరణాల పార్క్ ఏర్పాటు కోసం 78.01 ఎకరాల భూ సమీకరణ కోసం 'మంగళగిరి గోల్డ్ క్లస్టర్ ల్యాండ్ పూలింగ్ స్కీం(ఫార్ములేషన్ అండ్ ఇంప్లిమెంటేషన్) రూల్స్-2025కు ఆమోదం.

మరికొన్ని నిర్ణయాలు

- సత్యసాయి జిల్లా ముత్తుకుంట గ్రామంలో రూ.800కోట్లతో సెకి చేసిన ప్రతిపాదనలకు ఆమోదం.
- రవాణా వాహనాలకు గ్రీన్ టాక్స్ రేటును తగ్గించడానికి, ట్రాక్టర్, ట్రైలర్‌లతో సహా వస్తువుల క్యారేజీ వాహనాలులు చెల్లించాల్సిన త్రైమాసిక పన్ను ఆధారంగా కాకుండా రూ.1500, రూ.3వేలుగా కొత్త పన్ను రేట్లు నిర్ణయం. ఇందుకు సంబంధించిన ఎపి మోటార్ వెహికల్స్ టాక్సేసన్ బిల్లు-2025 శాసనసభలో ప్రవేశపెట్టేందుకు ఆమోదం.
- ఎపి ప్రైవేట్ యూనివర్సిటీల చట్టం-2016 సవరణల బిల్లును శాసనసభలో పెట్టేందుకు ఆమోదం.
- ఎస్సి వర్గీకర్ణణ అమలు చేయడానికి తీసుకొచ్చిన ఆర్డినెన్స్‌ను స్థానంలో ముసాయిదా బిల్లును రాబోయే శాసనసభలో ప్రవేశపెట్టనున్నారు.
- థర్డ్ పార్టీ ఆక్రమణలో ఉన్న వ్యక్తుల(347)కు సంబంధించి అదనపు భూముల క్రమబద్ధీకరణ, కేటాయింపు ఆమోదం.
- తిరుపతి అర్బన్ మండలం సెట్టిపల్లి గ్రామంలోని ప్రతి ప్లాట్ యజమానికి కనీసం 2 సెంట్లు కేటాయించేందుకు 2019లో జారీ చేసిన జివో 173 సవరణ.
- దీపం-2 పథకం కింద 5 కిలోల ఎల్‌పిజి సిలిండర్లను 14.2కిలోల సిలిండర్లుగా మార్చేందుకు ఆమోదం.
- ఎత్తైన నివాస భవనాల గరిష్ఠ ఎత్తు పరిమితిని 18 నుంచి 24 మీటర్లకు పెంచేందుకు అవసరమైన బిల్లును శాసనసభలో పెట్టే బిల్లుకు ఆమోదం.
- జిఎస్టి శ్లాబ్‌లను మారుస్తూ కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలను స్వాగతించిన మంత్రిమండలి కేంద్రానికి అభినందనలు తెలిపింది.

కూటమి ఎమ్మెల్యేల అరాచకం

(మొదటిపేజీ తరువాయి)

చేస్తే పేర్లు బయటపెట్టి చర్యలు తీసుకోవాలని సవాలు విసిరారు.

గిరిజనుల ఆందోళనకు మద్దతు : కిల్లో సురేంద్ర

రాష్ట్రంలో ఆదివాసీలకు చట్ట ప్రకారం లభించిన హక్కులను కూటమి ప్రభుత్వం కాలరాస్తోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కిల్లో సురేంద్ర విమర్శించారు. 5వ షెడ్యూలులో ఉన్న ఏజెన్సీ ప్రాంతంలో 10 వేల ఎకరాలను అదానీ, నవయుగ కంపెనీకి కేటాయించారని, అక్కడ వాగులను పూడ్చేసి భూములు స్వాధీనం చేసుకుంటున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని తెలిపారు. అడవీ,భూమి లేకుండా ఆదివాసీలు జీవించలేరని అన్నారు. ఆదివాసీ బిడ్డలకోసం స్పెషల్ డిఎస్‌సి వేయాలని కోరారు. గిరిజన ప్రాంతాల్లో 766 పోస్టులు ఉంటే ఇప్పుడున్న పద్ధతుల్లో భర్తీ చేస్తే 42 పోస్టులు మాత్రమే వస్తాయని ఇంతకంటే అన్యాయం మరొకటి లేదన్నారు. చంద్రబాబు ఎన్నికల ముందు ఆ ప్రాంతంలోకి వచ్చిన సమయంలో మరోజన్మంటూ ఉంటే గిరిజన బిడ్డగా పుడతానని చెప్పారని, ఇప్పుడు ఉన్న గిరిజనులకు మరణశాసనం రాస్తున్నారని విమర్శించారు. పవన్‌కళ్యాణ్ గారు అడవితల్లి బాట పేరు చెప్పి ఇప్పుడు ఆదానీ బాట పట్టారని మండిపడ్డారు. ఈ విషయంలో ప్రభుత్వం జోక్యం చేసుకుని కార్పొరేట్లకు ఇచ్చిన భూములు రద్దు చేయాలని కోరారు. గిరిజనులు నిర్వహిస్తున్న ఆందోళనకు సిపిఎం సంపూర్ణ మద్దతు ఇస్తుందని తెలిపారు.

ఎస్ఆర్ఎం, విట్‌లో రైతులకు అన్యాయం

రాజధాని పరిధిలో భూములిచ్చిన రైతుల పిల్లలకు అక్కడ ఏర్పాటు చేసిన ఎస్ఆర్ఎం, విట్ వంటి యూనివర్శిటీల్లో సీట్లు ఇవ్వడం లేదని, కనీసం ఫీజు రాయితీ కూడా లేదని శ్రీనివాసరావు తెలిపారు. రాజధాని కోసం భూములిచ్చిన రైతులకు ఏమి న్యాయం చేస్తారో తెలియడం లేదని పేర్కొన్నారు. తమ జీవనాధారమైన భూముల్ని రాజధానికి అప్పగించిన రైతుల బిడ్డలకు కనీసం ప్రవేశం లేకపోతే ఎలాగని ప్రశ్నించారు.

జిఎస్‌టి పేరుతో రాష్ట్రాలకు అన్యాయం

తాజాగా ప్రకటించిన జిఎస్‌టి రేట్ల మార్పుకు శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేశారు. సిపిఎం ఎప్పటినుండో నిత్యావసరాలపై జిఎస్‌టి తగ్గించాలని డిమాండ్ చేస్తోందన్నారు. జిఎస్‌టి పేరుతో రాష్ట్ర ఆదాయాలను కూడా కేంద్రం తన గుప్పిట్లో పెట్టుకుని అన్యాయంగా వ్యవహరిస్తోందని తెలిపారు. ఇప్పుడు ఇచ్చిన శ్లాబుల వల్ల రాష్ట్రాలకు రావాల్సిన వాటాలు తగ్గితే వాటిని కేంద్రం పూడుస్తుందా లేదా సమాధానం చెప్పాలన్నారు. సమర్థించిన చంద్రబాబు, పవన్‌కల్యాణ్ కేంద్రం నుండి రావాల్సిన నిధులు తగ్గితే ఒత్తిడి చేసి తెచ్చుకుంటారా? లేదా ఆ భారం ప్రజలపై మోపుతారా? చెప్పాలన్నారు. ఆ భారాన్ని రాష్ట్ర ప్రజలపై వేస్తే అంగీకరించబోమన్నారు.

తరగతి గదిలో పాఠాలు చెప్పడమే కాదు; ఆ విద్యార్థుల చుట్టూ ఉన్న సమాజాన్ని కూడా బాగు చేయాలనుకునే గురువులు చాలా అరుదుగా కనిపిస్తారు. అలాంటి వారిలో వారే అనంతపురం జిల్లా ఎన్.ఎస్.పి.ఆర్. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ప్రగతి, తూర్పు గోదావరి జిల్లా కడియం లెక్కల మాస్టారు చిలుకూరి శ్రీనివాసరావు. బోధనతో పాటు సమాజాన్ని బాగు చేయాలన్న తపన వీరిద్దరిదీ.

దారి చూపే 'గురు' దీపాలు

గురు దక్షిణ



ఆరోజు సెప్టెంబర్ 5వ తేదీ ఉపాధ్యాయ దినోత్సవం. లక్ష్మీపురం పాఠశాలలో పిల్లలంతా గురుపూజోత్సవం ఏర్పాట్లలో హడావిడిగా తిరుగుతున్నారు. ఆ సమయంలో పాఠశాల ప్రాంగణంలోకి ఒక కారు వచ్చి ఆగింది. కారులోంచి నలుగురు యువకులు దిగి, సమావేశ వేదిక వైపు వచ్చారు. వారు పాఠశాలలో ఎనిమిదేళ్ళ క్రితం పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు. రమేశ్, రాజేశ్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా, శ్రీను, వివేక్ ప్రభుత్వ ఉద్యోగాల్లో చేరి విధులు నిర్వహిస్తున్నారు. తమకు చదువు చెప్పిన గురువులను కలిసి కృతజ్ఞతలు తెలపాలని అక్కడికి వచ్చారు.

పట్నం నుంచి ఉదయమే ప్రయాణమై సరిగ్గా సమావేశం జరుగుతున్న సమయానికి పాఠశాలకు చేరుకున్నారు. వేదిక వద్దకు వచ్చి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులందరినీ కలిసి పరిచయం చేసుకున్నారు. చాలా కాలం విరామం తర్వాత తమ ఉపాధ్యాయులను కలిసే అవకాశం వచ్చిందన్న వారి ఆనందానికి అవధులు లేవు. ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు కూడా తమ వద్ద విద్యాభ్యాసం చేసిన విద్యార్థులు ఎదిగి చక్కగా ఉద్యోగాల్లో స్థిరపడ్డ విషయం తెలిసి సంతోషంతో పొంగిపోయారు.

పాఠశాల చదువు ముగించి ఏళ్ళు గడుస్తున్నా ఉపాధ్యాయులని గుర్తు చేసుకుంటూ పాఠశాలకు రావడం, ఉద్యోగాల్లో స్థిరపడడం, సన్మానించడం చూసిన బడి పిల్లలు తమ కరతాళ ధ్వనులతో ఆ కార్యక్రమానికి మరింత అందం తీసుకువచ్చారు.

- నాగరాజు కామర్సు,
తెలుగు ఉపాధ్యాయుడు, దుబ్బాక,
92480 93580.

నేను గీసిన బొమ్మ

పి.సాయిరెడ్డి,
10వ తరగతి,
అరవింద హైస్కూలు,
కుంచనపల్లి, గుంటూరు జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

సాహిత్య, విద్యారంగాల 'ప్రగతి'

బోధనతో పాటు సాహిత్యంపై ఉన్న మక్కువతో కథలు, కవితలతో ప్రతిభ చూపుతున్న డాక్టర్ ప్రగతి ... సాహిత్యరంగంలో ఎందరికో సుపరిచితురాలు. ఆమె రచించిన 'బొగ్గుల పొయ్యి' కవిత ఈ ఏడాది నుంచి డిగ్రీ ప్రథమ సంవత్సరం తెలుగు పాఠ్యపుస్తకంలో ఒక పాఠంగా అచ్చవ్వడం ప్రగతి టీచర్‌కి ఈ టీచర్స్ డే నాడు అందిన గొప్ప గౌరవం.

అవార్డులు, రివార్డుల వైపు ఎప్పుడూ కన్నెత్తిని చూడని ఆమెకి చదువుతో పాటు పిల్లల్లో దాగున్న సృజనని వెలికితీయడం చాలా ఇష్టం. పిల్లలతో ఎక్కువసేపు మమేకం అవ్వాలని, కాలేజీ బాగోగులు దగ్గరుండి పట్టించుకోవాలన్న తపనతో ఇంటికి దూరంగా చాలా సాదాసీదాగా ఓ అద్దె ఇంట్లో ఉంటున్నారు. పగలంతా ప్రిన్సిపాల్ అయితే, సాయంత్రాలు ఆ పిల్లల స్నేహితురాలు ఆమె. వారి బాగోగులు పట్టించుకునే అమ్మానాన్న కూడా.

పిల్లలకు ఎదురైన అనుభవాలు, అవమానాలు, ఇబ్బందులు అన్నీ ఎంతో ఓపిగ్గా వినే ప్రగతి టీచరంటే క్లాసు పిల్లలకి ఎంత ఇష్టమో! రసాయన శాస్త్ర అధ్యాపకురాలిగా 20 సంవత్సరాలు పనిచేసి, 2021 నుంచి శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురంలోని ఎన్.ఎస్.పి.ఆర్. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. అనంతపురం జిల్లా పులి ప్రొద్దుటూరు ఆమె స్వగ్రామం. సరోజ, అశ్వర్థ రెడ్డి తల్లిదండ్రులు. పదేళ్లు వచ్చేసరికి పెద నాన్న మాస్టారు, మాజీ ఎంఎల్‌సి, ఉపాధ్యాయ సంఘం నాయకుడు అయిన రామిరెడ్డి గారి సంరక్షణలో స్కూలు విద్యాభ్యాసం పూర్తిచేశారు. ఎమ్మెస్సీ; బి.ఎడ్., పిహెచ్.డి., (రసాయన శాస్త్రం) పట్టా అందుకున్న ప్రగతికి రామిరెడ్డి గారంటే ఎంతో అభిమానం. 'ఆయన్ని చూసే ఒక ఉపాధ్యాయుడు ఎలా ఉండాలో నేర్చుకున్నాను' అంటారామె.

కాలేజీ రోజుల నుంచి ఈనాటి వరకూ విజ్ఞానదాయక, సామాజిక, సాహితీ అంశాల గురించి వివిధ పత్రికల్లో వ్యాసాలు రాశారు. ఆకాశవాణి ద్వారా విజ్ఞానదాయక ప్రసంగాలు కూడా చేశారు. 2013 నుంచి కథా రచన మొదలుపెట్టారు. మొదటి కథ సాహిత్య ప్రస్థానం పత్రికలో ప్రచురించిన 'మరణ వాంగ్మూలం'. ఇప్పటివరకు 40 కథలు వివిధ పత్రికల్లో ప్రచురితమయ్యాయి. రెండు కథాసంపుటాలు 'కోయిల చెట్టు' (2018), 'కొన్ని చీకట్లూ... ఓ వెలుతురూ!' (2024), ఒక కవితా సంపుటి 'నీలకురింజి సముద్రం' (2023), తన రసాయన పరిశోధన గురించిన అనుభవాలు 'ప్రతి ఫెయిల్యూర్లో ఓ గెలిచే దారి' (A Journey into Chem-Search) అనే పుస్తకం (2024) ప్రచురించారు. ఉమ్మడి అనంతపురం జిల్లా రచయిత్రుల కథా సంకలనం 'ముంగారు మొలకలు' (2022) కథా సంకలనానికి సంపాదకత్వం వహించారు.

పిల్లలు స్కూలుకి ఎందుకు రావడం లేదు? అన్న ప్రశ్న వచ్చిన ప్రతిసారీ, చాలా తేలికైన సమాధానాలనే చాలామంది టీచర్లు ఆలోచిస్తారు. కానీ ప్రగతి టీచర్ అలా కాదు. వీలుని బట్టి ఆ పిల్లల ఇంటికి వెళతారు. వాళ్ల పెద్దలతో మాట్లాడతారు. ఆ ఇంటి పరిస్థితులను అర్థం చేసుకుని, పిల్లల చదువు సమాజ 'ప్రగతి'కి ఎంత ముఖ్యమో అర్థమయ్యేలా చెబుతారు. మూఢ నమ్మకాలు సమాజాన్ని ఎంతలా దిగజార్చుతాయో వివరిస్తారు. అలా తన అనుభవాలనే కథల రూపంలో మార్చి ఎందరో టీచర్లకి గొప్ప గొప్ప పాఠాలు నేర్పారు. 'ఆ కథలు, కవితలని చదివి చాలామంది ఉపాధ్యాయులు పిల్లలను చూసే దృష్టి కోణం మారింద'ని ఆమె ఎంతో సంతోషంగా, గర్వంగా చెబుతారు.

ప్రగతి మేడం రాసిన కథలు, కవితలకి ఎందరో పాఠకులు నీరాజనాలు పలుకుతారు. మేధావులు ఆమె రచనలని ప్రశంసలతో ముంచెత్తుతారు. ఆమె ప్రమేయం ఏమీ లేకుండానే తన రచనలపై చర్చలు జరుగుతుంటాయి. 'వాటిపై మేధావులు జరిపిన విశ్లేషణలే తనకి అవార్డుల కంటే ఎక్కువ సంతోషాన్ని ఇస్తాయి' అంటారు ఆమె.

చీకటి బతుకుల్లో అక్షరాల వెలుగు

తన బోధనతో విద్యార్థుల్లో జ్ఞాన కాంతుల నింపడమే కాదు, సంచార జాతులైన యానాది తెగలు, రవాణా సదుపాయాలు లేని మారుమూల ప్రాంతాలు ఎంచుకొని వారి జీవితాల్లో జ్ఞానాన్ని, అక్షర కాంతులను నింపుతున్నారు శ్రీనివాస మాస్టారు.

రాజమండ్రి పందలపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో లెక్కల మాస్టారుగా పనిచేస్తున్న శ్రీనివాసరావు ప్రస్తుతం రాజమండ్రి కేంద్ర కారాగారంలో డిప్యూటేషన్‌పై ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. జైల్లో ఖైదీలకు పాఠాలు చెప్పాలని అధికారులు ఉపాధ్యాయులను కోరగా ఎందరో తిరస్కరించారు. శ్రీనివాస్ మాస్టారు మాత్రం చొరవతో ముందడుగు వేశారు. ఖైదీల మధ్య ఉంటూ వారికి కేవలం అక్షర జ్ఞానమే కాకుండా జీవన ప్రమాణాలను తనదైన రీతిలో నేర్పిస్తున్నారు. శ్రీనివాసరావు చేస్తున్న కషికి అధికారుల నుంచి ఎన్నో ప్రశంసలు వస్తున్నాయి.

ఖైదీలకు అక్షరాలు, సంతకం నేర్పించడమే కాకుండా కొంతమంది ఖైదీలకు ఆయా సబ్జెక్టులలో చక్కటి తర్ఫీదు ఇచ్చి ఓపెన్ టెన్త్, ఓపెన్ ఇంటర్ పరీక్షలు కూడా రాయిస్తున్నారు. గడిచిన రెండు సంవత్సరాలలో ఓపెన్ టెన్త్, ఓపెన్ ఇంటర్లలో 180 మంది ఖైదీలు పాసయ్యారు. బోధనా వృత్తిలో 27 ఏళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న ఈ మాస్టారు, గతంలో యానాది తెగ నివాసముంటున్న పాముల మెట్ట ప్రాంతం పాఠశాలలో ఏడేళ్ల పాటు విధులు నిర్వర్తించారు. పిల్లలకు చదువు చెప్పడమే కాదు; కాలనీ స్వరూపాన్నే మార్చేశారు. సంచారులను స్థిర నివాసులుగా మార్చారు. కాలనీని అభివృద్ధి చేశారు. ఆ ప్రజలను నాగరిక ప్రపంచం వైపు నడిపించారు. ఇప్పటికీ శ్రీనివాస్ మాస్టారు అంటే పాముల మెట్ట కాలనీవాసులకు ఎంతో అభిమానం.

వందలాది బాల కార్మికులను చేరదీసి ఆయా పాఠశాలల్లో చేర్పించడం ఆయన క్రమం తప్పకుండా చేసే పనుల్లో ఒకటి. 2014లో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు, 2017లో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న శ్రీనివాస మాస్టారు మూడు నాలుగు, ఐదు, ఆరు తరగతుల పాఠ్య పుస్తకాల్లో పాఠాలు కూడా రాశారు. 'మన టీవీ' ద్వారా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమంతా టీవీ పాఠాలు బోధించారు. రిసోర్స్ పర్సన్‌గా ఉపాధ్యాయులకు కూడా పాఠాలు బోధించారు. ఎయిడ్స్ డిఆర్పిగా ఎంతోమందికి ఆ వ్యాధి పట్ల అవగాహన కల్పించారు. అనేక సైన్స్ ఫెయిర్‌లో పాల్గొని తాను పనిచేస్తున్న పాఠశాల పిల్లలకు ఉత్తమ బహుమతులు వచ్చేలా శిక్షణ ఇచ్చారు.

మొక్కలు నాటడం, మూగజీవాలను సంరక్షించడం మాస్టారి దినచర్యల్లో భాగం. వరి కంకులు అల్లిచ్చి పక్షులకు ఆహారం ఏర్పాటు చేయటం దశాబ్దాల కాలం నుంచి చేస్తున్నారు. 'దిష్టిబొమ్మ', 'సైన్స్ నా జీవితం' వంటి పుస్తకాలు రచించారు. ఎన్నో కథలు, కవితలు, సమీక్షలు రాశారు. 2012లో మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం చేతుల మీదుగా పర్యావరణ మిత్ర అవార్డు అందుకున్న శ్రీనివాస మాస్టారుకి ఇంకా అనేక పురస్కారాలు, అవార్డులు వచ్చాయి.

కదం తొక్కిన హాకీ ఆటగాళ్లు

- నిర్ణయాత్మక మ్యాచ్‌లో మలేషియాపై గెలుపు
- కొరియాపై చైనా విజయం
- ఆసియాకప్ సూపర్-4

రాజ్‌గిరి (బీహార్): ఆసియాకప్ హాకీ సూపర్-4 కీలక మ్యాచ్‌లో భారతజట్టు ఆటగాళ్లు సమిష్టిగా చెలరేగి ఆడారు. తొలి సూపర్-4లో కొరియాతో మ్యాచ్‌ను డ్రా చేసుకున్న భారత్.. గురువారం జరిగిన రెండో సూపర్-4 మ్యాచ్‌లో చెలరేగి ఆడింది. మలేషియాతో జరిగిన ఈ మ్యాచ్‌లో భారతజట్టు 4-1గోల్స్ తేడాతో ఘన విజయం సాధించింది. మూడో క్వార్టర్‌ముగిసేసరికి 4-1 ఆధిక్యతలో నిలిచిన భారత్ నాల్గో క్వార్టర్‌లో గోల్ చేయడంలో విఫలమైంది. తొలి రెండో క్వార్టర్‌లు ముగిసేసరికి భారతజట్టు 3-1గోల్స్ ఆధిక్యతలో నిలువగా.. మూడో క్వార్టర్‌లో ఒక గోల్ చేసింది. ఆట ప్రారంభమైన 2వ ని.లోనే మలేషియా హసన్ ఫీల్డ్ గోల్ చేసి మలేషియాకు ఆధిక్యతను చేకూర్చాడు. రెండో క్వార్టర్‌లో 17, 19, 24వ నిమిషాల్లో భారత ఆటగాళ్లు మూడు గోల్స్ కొట్టారు. మన్‌ప్రీత్, సుఖ్‌జీత్, లక్రా ఈ గోల్స్ చేశారు. మూడో క్వార్టర్‌లో 38వ ని.లో వివేక్ ప్రసాద్ మరో గోల్ చేయడంలో భారత్ 4-1గోల్స్ ఆధిక్యతలోకి దూసుకెళ్లింది. అంతకుముందు జరిగిన మరో సూపర్-4 మ్యాచ్‌లో చైనా జట్టు 3-0తో కొరియాకు ఝలక్ ఇచ్చింది. శనవారం జరిగే చివరి సూపర్-4 మ్యాచ్‌లో భారతజట్టు చైనాతో, మలేషియా జట్టు కొరియాతో తలపడనున్నాయి. రెండో సూపర్-4 మ్యాచ్‌లు ముగిసే సరికి భారత్, చైనా జట్టు టాప్-2లో కొనసాగుతున్నాయి. ఇక 5-8స్థానాలకు జరిగిన మరో మ్యాచ్‌లో బంగ్లాదేశ్ జట్టు 5-1గోల్స్ తేడాతో కజకిస్తాన్‌ను ఓడించింది. దీంతో 5, 6స్థానాలకు జపాన్, బంగ్లాదేశ్, 7, 8 స్థానాలకు చైనీస్ తైపీ, కజకిస్తాన్ జట్లు పోటీపడనున్నాయి.

సెమీస్‌కు సిన్నర్, అగర్

- నేడు మహిళల సింగిల్స్ సెమీఫైనల్స్
- యుఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ

న్యూయార్క్: యుఎస్ ఓపెన్ పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లోకి టాప్‌సీడ్, ఇటలీకి చెందిన జన్నిక్ సిన్నర్‌తోపాటు 25వ సీడ్ అగర్ అలియాస్సిమ్(కెనడా) ప్రవేశించారు. గురువారం జరిగిన క్వార్టర్‌ఫైనల్లో ఇటలీకి చెందిన సిన్నర్ వరుససెట్లలో తన దేశానికే చెందిన మసెట్టిని చిత్తుచేశారు. ఏకపక్షంగా సాగిన ఈ మ్యాచ్‌ను సిన్నర్ కేవలం మూడు వరుససెట్లలోనే ముగించడం విశేషం. చివరి క్వార్టర్‌ఫైనల్లో సిన్నర్ 6-1, 6-4, 6-2తో మసెట్టిపై విజయం సాధించాడు. మరో క్వార్టర్‌ఫైనల్లో 8వ సీడ్, ఆస్ట్రేలియాకు చెందిన డిమినార్ అనూహ్యంగా ఓటమిపాలయ్యాడు. 25వ ర్యాంకర్ అగర్ చేతిలో 6-4, 6-7(7-9), 7-5, 6-7(4-7)తో పరాజయాన్ని చవిచూశాడు. ఇక మహిళల సింగిల్స్ సెమీఫైనల్లోకి 8వ సీడ్, అమెరికాకు చెందిన అనిసిమోవా, జపాన్‌కు చెందిన 23వ సీడ్ ఒసాకా ప్రవేశించారు. అనిసిమోవా 6-4, 6-2తో 2వ సీడ్, పోలండ్‌కు చెందిన ఇగా స్వైటెక్‌ను చిత్తుచేయగా.. ఒసాకా 6-4, 7-6(7-3)తో 11వ సీడ్, ముఛోవా(చెక్‌రిపబ్లిక్)ను ఓడించింది.

తొలి సెమీస్: సబలెంక × పెగూలా

రెండో సెమీస్: అనిసిమోవా × ఒసాకా

'శీలావతి' పాత్ర చిరస్థాయిగా నిలుస్తుంది : అనుష్క



'నేను సినిమాల్లోకి భయం భయంగా వచ్చాను. అయితే రెండు దశాబ్దాల జర్నీ పూర్తి చేసుకున్నాను. ఇన్నేళ్ల ప్రయాణాన్ని ఊహించలేదు. ఈ స్థాయి ఫ్యాన్ ఫాలోయింగ్‌ని, స్టార్‌డమ్‌ని సొంతం చేసుకోవడం హ్యాపీగా ఉంది. ఇందుకు ఫ్యాన్స్‌కి, ప్రేక్షకులకి కృతజ్ఞతతో ఉంటా.. 'ఘాటీ'లో నేను చేసిన శీలావతి క్యారెక్టర్‌లో బ్యూటిఫుల్ షేడ్స్ ఉన్నాయి. నా కంఫర్ట్ జోన్‌ని దాటి చేసిన సినిమా ఇది. శీలావతి నా ఫిల్మోగ్రఫీలో ఎప్పటికీ నిలిచిపోతుంది. సరోజ (వేదం), శీలావతి వంటి అద్భుతమైన పాత్రలు ఇచ్చిన క్రిష్ గారికి థ్యాంక్స్. క్రిష్; చింతకింది శ్రీనివాస్ ఈ కథ చెప్పినప్పుడు ఆసక్తిగా అనిపించింది. షూటింగ్ లొకేషన్స్‌కి వెళ్లిన తర్వాత ఒక కొత్త పాత్ర, సంస్కృతి, ఒక కొత్త విజువల్‌ని ప్రేక్షకులకి చూపించబోతున్నామనే ఎగ్జయిట్‌మెంట్ కలిగింది. ప్రతి మహిళ సాధారణంగా, సున్నితంగా కనిపించినప్పటికీ ఏదైనా ఒక సందర్భం వచ్చినప్పుడు ఒక బలమైన స్తంభంలాగా నిలబడుతుంది. అరుంధతి, రుద్రమదేవి, బాహుబలి, భాగమతి వంటి సినిమాల్లో చాలా బలమైన పాత్రలు చేశాను. 'ఘాటీ'లో చేసిన శీలావతి పాత్ర కూడా అంతే బలంగా ఉంటుంది. ప్రస్తుతం సమాజంలో ఉన్న ప్రధానమైన సమస్య గంజాయి. క్రిష్ సమాజానికి దగ్గరగా ఉండే కథలనే ఎంచుకుంటారు. 'ఘాటీ'లోనూ ఫిజికల్ హార్డ్ వర్క్ ఉంది. షూటింగ్ కోసం పెద్ద పెద్ద కొండలు ఎక్కేవాళ్లం. ఇలాంటి ఒక వైవిధ్యమైన కథని నమ్మి, నాపై నమ్మకం ఉంచి ఇంత గ్రాండ్ స్కేల్‌లో ఈ సినిమా చేసినందుకు రాజీవ్‌రెడ్డి, సాయిబాబు, యూవీ క్రియేషన్స్ వారికి ధన్యవాదాలు. క్రిష్ గారు రాసిన మూడు పాటల్లో 'కుందేటి చుక్క...' అంటూ ఆయన చేసిన పదప్రయోగం నాకు చాలా ఇష్టం. షూటింగ్స్ లేనప్పుడు ఎక్కువగా ప్రయాణాలు చేస్తాను. పుస్తకాలు చదువుతాను. ప్రస్తుతం క్రిష్ ఇచ్చిన 'మహాభారతం' చదువుతున్నా. ఆంధ్రా-ఒరిస్సా సరిహద్దుల్లో షూట్ చేసినప్పుడు నన్ను చూడడానికి భారీ సంఖ్యలో ఫ్యాన్స్ రావడం హ్యాపీగా అనిపించింది." అని కథానాయిక అనుష్క శెట్టి చెప్పారు. క్రిష్ జాగర్లమూడి దర్శకత్వంలో అనుష్క శెట్టి, విక్రమ్ ప్రభు ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ఘాటీ'. యూవీ క్రియేషన్స్ సమర్పణలో రాజీవ్ రెడ్డి, సాయిబాబు జాగర్లమూడి నిర్మించిన ఈ సినిమా శుక్రవారం విడుదల కానుంది. ఈ సందర్భంగా మీడియాతో ఆమె పై విధంగా మాట్లాడారు.

'శివం భజే' మూవీకి గామా అవార్డు

ప్రతిష్టాత్మకమైన గామా (గల్ఫ్ అకాడమీ మూవీ అవార్డ్స్) అవార్డుల కార్యక్రమం తాజాగా దుబాయ్‌లోని షార్జా ఎక్స్‌పో సెంటర్‌లో ఘనంగా జరిగింది. 'శివం భజే' డైరెక్టర్ అప్సర్ మోస్ట్ అస్పైరింగ్ డైరెక్టర్‌గా అవార్డు అందుకున్నారు. 'గంధర్వ'తో దర్శకుడిగా డిఫరెంట్ ప్రాజెక్ట్‌తో అప్సర్ అందరినీ మెప్పించారు. ఇక అశ్విన్‌బాబు కథానాయకుడుగా వచ్చిన 'శివం భజే' మూవీని మరో డిఫరెంట్ టేకింగ్, మేకింగ్‌తో తెరకెక్కించారు. మంచి రెస్పాన్స్ వచ్చిన ఈ సినిమాకు గామా అవార్డు దక్కింది. ప్రస్తుతం అప్సర్ తెరకెక్కించబోతోన్న చిత్రాల ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి.

చిన్న చిత్రాలనూ ఆదరించండి : ఆలీ

'చిత్ర పరిశ్రమలో ఇప్పుడు చిన్నా, పెద్దా అనే తేడాలు సినిమాల్లో లేవు. కథా కథనం బాగుంటే చిన్న సినిమాలు సైతం బాక్సాఫీసు వద్ద హిట్ మూవీస్‌గా నిలుస్తున్నాయి. సమాజ రుగ్మతలు రూపుమాపాలనే లక్ష్యంతో తీసిన సినిమా 'స్పిరిట్' (ఈజ్ నాట్ వన్). దర్శకుడు, నిర్మాతలతో మాట్లాడాను. ఎక్కడో మారుమూల పల్లెవాసులు ఇలా సినిమా తీయటం ఎంతో సంతోషమేసింది. ఆత్మవిశ్వాసంతో వెంకటనర్సమ్మ ముందుకు సాగారు. ఆమె కోరిన లక్ష్యం విజయవంతం కావాలి. చిన్న సినిమా అయినా 'స్పిరిట్'ను అందరూ ఆశీర్వదించాలి. థియేటర్‌లో ఈ సినిమాను చూసి బలపర్చండి' అని ప్రేక్షకులను సినీనటుడు ఆలీ కోరారు.

ఎన్టీఆర్ ఫొటోకు రికార్డు ధర

టాలీవుడ్ కథానాయకుడు ఎన్టీఆర్‌కు ప్రపంచవ్యాప్తంగా అభిమానులు ఉన్నారు. ఆయన ఫొటోకు కూడా మంచి క్రేజ్ ఉందని అర్థమైంది. బులా రుబీ అనే పెన్సిల్ ఆర్టిస్ట్ ఎన్టీఆర్ ఫొటోను తన టాలెంట్‌తో ఆవిష్కరించారు. ఆ పెన్సిల్ ఆర్ట్ ఏకంగా రూ.1,45,300కు అమ్ముడైంది. ఈ విషయాన్ని ఆర్టిస్ట్ బులా రూబీ ట్విటర్ ద్వారా తెలియజేశారు. 'నా పెన్సిల్ ఆర్ట్ ఇలా చరిత్ర సృష్టిస్తుందని కలలో కూడా ఊహించలేదు. ఈరోజు నా జూనియర్ ఎన్టీఆర్ పెన్సిల్ ఆర్ట్ ఇప్పటివరకు అమ్ముడైన వాటిలో అత్యంత ఖరీదైనది.' అంటూ ట్విటర్‌లో పోస్ట్ చేశారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68